

అలనాడు వృత్తాసుర సం... తన
వెన్నెముకనే అవలీలగా ఇచ్చివే... విగా
హిందూ ముస్లీములనేకం చేసే... దివర కు
అందోళన చెందిన కబీర్‌దాస్‌గా - ... తిశివా
తయారుచేసి లోకకళ్యాణానికి అ... ఎన స
రామదానుగా - శ్వానన... న్తవ
ప్రయోగించడం నేర్పిన లాహిరీ మ... యు
వివేకానందునివంటి మాణిక్యాన్ని మనకందించిన శ్రీరామకృ... మహ
అవతారములు దాల్చిన ఆ మహనీయుడే శ్రీపండిత శ్రీశ్రీరా...
దేవాత్మ హిమాలయాలకు చేరువగా జన్మించి హరిం...
జీవితకాలంలో ఎన్నో మహత్వపూర్ణమైన కార్యక్రమాల్ని అమో... ర్వహిం
- శ్రీ దయానంద సరస్వతి మొదలయిన వారి దివ్య సంకల... నిర్వి
పూర్తిచేసి - 3,652 పై చిలుకు గ్రంథాలను రచించి, ప్రచు... మన
ఆ మహనీయుడే మనకో అపూర్వమైన ఆణిముత్యాన్ని క... ంది వా
వారే శ్రీ మారెళ్ళ శ్రీరామకృష్ణగురుదేవులు. కాశీక్షేత్ర...
గురువులదగ్గర ఎన్నో ఆధ్యాత్మిక సాధనలు దిగ్విజయం... సా
తిరిగి వచ్చిన డా॥ శ్రీమారెళ్ళ శ్రీరామకృష్ణగారు M.Sc., ...
వారు భౌతికంగా పుచ్చుకున్నప్పటికీ, ఆధ్యాత్మిక జగత్తుకే మ...
మరో డిగ్రీని శ్రీశ్రీరామశర్మ ఆచార్య దగ్గర్నుంచి అందుకు...
నేకట్టిందే కట్టు. నేతిన్నదేతిను. నాతరువాత అంతా
అనిపించుకున్న దివ్యాత్మ స్వరూపుడు గత 22, 24 ఏళ్ల...
దృష్టిలోపెట్టుకొని కొన్ని కొన్ని సందర్భాలలో ...ంతో
వారిచ్చిన ప్రసంగాలలోని కొన్నింటిని ఏరి కూర్చి, వాటి...
మార్చి వారి ఆదేశంతో సమర్థ సద్గురు వే... రప
ద్వారా ఇలా ప్రకటింప బడుతున్నాయి.

# మహాశూన్యోపాసన

## (ఓ మహత్తర రహస్యోపాసన)

ప్రథమ ముద్రణ :
వసంత పంచమి సందర్భంగా . . . .
ఫిబ్రవరి - 2002

సర్వస్వామ్యములు ప్రకాశకులవి

వెల : రూ. 33 /-

## ఆశీస్సులు

నోట్సు ప్రిపేర్ చేయడంలోను, అచ్చుతప్పులు సరిదిద్దడంలోను చక్కగా, ఓపికగా మాతో సహకరించిన 'మా చిన్నారులైన చిరంజీవులు **లక్ష్మీసుప్రజ, నాగేంద్ర సింధు**లకు గురుదేవుల అనుగ్రహాశీస్సులు లభించుగాక !' అని మనసారా కోరుకొంటున్నాము.

## శుభాభినందనలు

కమలా ఆర్ట్ ప్రింటర్స్ సిబ్బంది ఎంతో ఉత్సాహంగా ప్రింటింగ్ పనులు వగైరా సకాలంలో పూర్తిచేసి మాకెంతో సహకరించినందుకు వారికి మా ప్రత్యేక శుభాభినందనలు తెలుపుకొంటున్నాము.



ఏ జన్మలోని పూర్వపుణ్యమో
దివ్యాత్మల దర్శనభాగ్యము మాత్రమే కాక
మహామహితాత్మల దివ్యవాణిని వినగలిగే శక్తినిస్తూ
వారి మహత్తర మహావాక్యాల్ని పుస్తకరూపంలోకి
మార్చే అమోఘ ప్రయత్నాన్ని సఫలం చేస్తూ
ఏమీ తెలీనివారిలా ఉంటూ
అజ్ఞానంతో పిచ్చి అడుగులేస్తోన్న మాకు
ప్రేమగా, తోడుగా ఉంటూ నడిపిస్తోన్న
శ్రీ భగవాన్ మారెళ్ల శ్రీ రామకృష్ణ
గురుదేవుల పాదపద్మములకు
శతసహస్రాధిక పాదాభివందనాలర్పిస్తున్నాము.

– అక్కరాజు వెంకటేశ్వర ప్రసాద్
" సురేష

ప్రతులకు
**సమర్థ సద్గురు వేదపీఠము**
చిన్న మసీదు వెనుక, ప్లాట్ నెం. బి 135,
అమరావతి ఫ్లాట్స్, తెనాలి - 522 202
☎ 08644 - 25947, 55287 ☎



అక్కరాజ వేంకటరంగ సూర్యనారాయణ మూర్తి గారు.
అక్కరాజ వేంకటరంగ శ్యామలాదేవి గారు

నా ఆధ్యాత్మిక జగత్తుకు తొలిగురువులు
నాకన్న తల్లిదండ్రులే అవడం నేనెంతో
అదృష్టంగా భావిస్తున్నాను.
నాకు జన్మనిచ్చినందుకు వారి
ఋణం తీర్చుకోవల్సిందిపోయి నేనింకా వారికి
ఎంతో ఋణపడి పోయినందుకు విచారిస్తూ .....
చిరుకానుకగా
వారికీ పుస్తకాన్ని ప్రేమతో సమర్పించుకొంటున్నాను.

– అక్కరాజ వెంకటేశ్వర ప్రసాద్

# ఆశీర్వాదాక్షతలు

ప్రియమైన ఆత్మబంధువులారా !

నేడు మానవజాతి ఓ చిత్రాతిచిత్రమైన మలుపులో ఉంది. 'ఏది తెలుసుకొంటే ఇక అన్నీ వాటంతటవే తెలిసిపోతాయో' అలాంటి మహావిద్యను అతి సామాన్యులకు సైతం అందించేందుకు ఎంతగానో ఆత్రుతపడుతోన్న దివ్యాత్మలు, ఋషులు ఏ మాత్రం కనీసార్హతలున్న వారికైనా త్వరత్వరగా అందించాలనే తపనతో వెతుకులాట ప్రారంభించారు. వారి ఆరాటాన్ని, తపనను మనం మన మాటలలో వివరించలేము. వారివిషయంలో మనపై కురిపిస్తోన్న కరుణారస వర్షం మన ఊహలకందనిది. ఎవరైతే ఈ అక్షరసత్యాల్ని అర్థంచేసుకొన్నారో నిజంగా వారు ఎంతో ధన్యులు.

ప్రతి ఒక్కరికీ ఐదు శరీరాలున్నాయి. కానీ భౌతిక శరీరాన్నే ఎలా ఉపయోగించుకోవాలో కూడ తెలీని అయోమయంలో అజ్ఞానంగా జీవిస్తూన్న వారున్నారు మనలో అనేక మంది. అలాంటి వారికి ఆ ఐదు శరీరాల్నీ ఉపయోగించుకొనేందుకు అవసరమయ్యే జ్ఞాన విజ్ఞానం ఈ పుస్తకంలో తెలియజేయబడింది.

అదేవిధంగా ప్రకృతి అంటే సరివన నిర్వచనము, ఆ ప్రకృతిని ఎలా ఆరాధించాలో, ఆ ప్రకృతిలోంచి వస్తోన్న సందేశాల్ని ఎలా స్వీకరించాలో వివరించబడ్డాయి. అన్నిటికంటే ప్రధానంగా అసలు యోగవిద్యకు - సంధ్యావందనానికీ, యోగవిద్యకు - గాయత్రికి ఉన్న విడదీయరాని సంబంధం ఎంతో విపులంగా అందరికీ అర్థమయ్యేలా అందించబడ్డది. అలాగే ఆసన-ప్రాణాయామాలో మనిషి భౌతిక

జీవితంలో ఎలా ఉపయోగపడతాయో, ఆధ్యాత్మికతలో అవి ఎంత ఉన్నత స్థితికి వెళ్ళేందుకు తోడ్పడుతాయో చాలా బాగా వివరించబడ్డది.

వీటన్నిటికీ మించి జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యా, ప్రతి కష్టము గురువు యొక్క అనుగ్రహము తప్ప వేరుగాదనే సత్యాల్ని ఎంతో స్పష్టంగా అందించబడ్డది. దానితోపాటు ఆధ్యాత్మికతలోని భ్రమల్నీ - లొసుగుల్ని తెలియజేశారు. అది ఎంతో మేలు కలిగించే అంశముగా భావించవచ్చు.

సమర్థ సద్గురు వేదపీఠము నిర్వాహకులు చిరంజీవులు అక్కరాజు వెంకటేశ్వర ప్రసాద్ - సురేఖ దంపతులు ఎంతో కష్టపడి అనేక ఆధ్యాత్మిక రహస్యాంశాల్ని పుస్తక రూపంలోకి తేవడం నిజంగా అభినందించాల్సినది. ఇన్నెన్ని అమూల్యాంశాల్ని త్వరత్వరగా యావత్ మానవజాతికీ అందించాలనే వారి కృషి, తపనను ప్రతి భక్తుడు, శిష్యుడు - ప్రతి సాధకుడు, ప్రతి ఆధ్యాత్మికవేత్త అర్థము చేసుకొన వలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ చిరంజీవులకు అంతటి ప్రేరణ ఎందరో దివ్యాత్మల నుంచి, పరమ గురువులనుంచి అందివ్వబడు తోందనీ, వారి రచనలకు ఆ మహితాత్ముల అనుగ్రహమే తప్ప వేరేదీ కాదని నా విశ్వాసం.

ఈ పుస్తకాల ద్వారా వెలువడుతున్న మహాసత్యాల్ని అందు కొంటోన్న యావన్మందికీ సకల సమర్థ సద్గురువుల అనుగ్రహాశీస్సులు పుష్కలంగా అందాలనీ - సమర్థ సద్గురు వేదపీఠం నుంచి ఇంకా ఇంకా ఆధ్యాత్మిక రహస్యమయ సత్యాలు విడుదల కావాలనీ ఆశీర్వదిస్తున్నాను.

మీ

## ముందు మాట

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. మార్పు దాని సహజ లక్షణం. మారే కాలంతో పాటు పరిస్థితులు, సమస్యలు, సాంప్రదాయాలు, విలువలు కూడా మారుతూనే ఉంటాయి. భవిష్యత్తును చూడగల్గిన మహాత్ములు, సర్వసమర్థులైన గురువులు, అనేకమంది ఋషులు ప్రస్తుతం నడుస్తోన్న కాలం యొక్క విశేషాన్ని తెలియజేస్తూ ఇపుడు మనమున్న ఈ కాలం పృథ్వీ గ్రహ చరిత్రలోనే మొట్టమొదటిసారి వచ్చిందన్నారు. ఈ మహత్తర సమయం కోసం ఎందరో దివ్యాత్మలు వేలవేల సంవత్సరాల పాటు ఎంతో ఆతురతగా ఎదురుచూశారు. తీరా ఆ విశేషకాలం రానే వచ్చింది. దాంతో వారి ఆతృత, తపన మరింతగా పెరిగాయి. ఓ ప్రణాళికాబద్ధంగా వారివారి కార్యక్రమాల సరళి వేగవంతమైంది. మహామహా విద్యలు సైతం చక్కటి సరళమైన విధానాలతో మనకందించబడుతున్నాయి.

యీ విషయంలో సమర్థసద్గురు వేదపీఠం - నిర్వాహకులు నిజంగా చాలా కృషిచేస్తున్నారు. ఎంతో గోప్యమైన గుహ్యాతి గుహ్యమైన ఆధ్యాత్మికాంశాల్ని పరమగురువుల దివ్యప్రేరణతో ప్రపంచానికి అందజేస్తున్నారు. వారు పడుతోన్న శ్రమ అభినందనీయము.

భారతదేశం అతి సమీపకాలంలో జగద్గురు పీఠాన్ని అధిరోహించ బోతోంది. అందుకు తగిన దిశానిర్దేశము ఆంధ్రప్రదేశ్ ద్వారా జరుగనుంది. 'మహాభారత యుద్ధము జరుగుతుంది దానిలో దైవలక్షణాలున్న ఓ వర్గం గెలుస్తుంది' అన్నది సునిశ్చితమైనటువంటి తథ్యము. శ్రీకృష్ణుడు పుట్టక ముందే అది తారీకులతో సహా నిర్ణయింపబడి ఉంది. అదే విధంగా ఇప్పుడు కూడా అంతే. ఆనాడు ఒకవేళ అర్జునుడే యుద్ధరంగం నుంచి తప్పుకుని ఉంటే అతని స్థానంలో ఓ ఐదుగురు వ్యక్తుల్ని ప్రకృతి మాత అర్జునుడికి బదులు

యుద్ధం చేసేందుకు తయారుగా ఉంచిందని మహనీయులు చెప్తారు. అలాగే ఈ అక్షర సత్యాలను తెల్సుకున్నప్పటికి ఏ విధమైన స్పందనా చూపించక తటస్థంగా ఉన్నవారు ఋషి ప్రణాళికను ఆగిపోయేట్లే చేస్తారేమో అని మనమేం భయపడక్కర్లేదు. ఎవరెవరి అదృష్టము ఎలా ఉందో ఎవరం చెప్పగలం ? ఋషి ప్రణాళిక మాత్రం మనకోసం ఆగదు.

నేడు మనబోటి వారి చేత మహామహ కార్యక్రమాల్ని చేయించ దలచి సర్వసమర్థులైన ఆ మహనీయులే మనల్ని ప్రాధేయ పడి అడుగుతున్నారు. మహాకాలుడంతటివాడే కొంగు చాచి అర్థించాడు. ఈ సమయంలో మనం వారి ఆహ్వానాన్నీ, అభ్యర్థనను నిర్లక్ష్య పరిస్తే అది మానవత్వం కాకపోగా రాక్షసత్వం అవుతుంది కూడా. ఈ విషయాలు విన్న తర్వాత కూడా మీనమేషాలు లెక్కపెట్టు కుంటూనో, ఉత్తర ప్రగల్భాలు పలుకుతూనో కాలయాపన చేసేవారు, సందు చిక్కిందని తమ ప్రకాండపాండిత్యాన్ని ప్రదర్శించేవారు సహజంగానే మహాకాలునికి పనికి రారు. కాని ఋషి ప్రణాళికలో భాగంగా సహాయ సహకారాలు అందిద్దామనుకునేవారు, మహాకాలుని పనులలో పాలు పంచుకోదల్చినవారు ఒక హనుమంతుడే కానక్కర్లేదు, ఓ ఉడుత కూడా సాయం చేయగలదు. అయితే ఆ మహాకాలునికి చేసిన సహాయం మొత్తంజాతికి తన చేతి వేలి ముద్రను బహుమతిగా ఇవ్వగలదు. మనం చేసే సాయం రవ్వంతైన దానికి ప్రతిఫలంగా కొండల కొద్ది పొందగలం. ఇవి అతిశయోక్తులు చెప్పటం కాని, అబద్ధ మాడుటంకాని చేతగాని ఋషి వాక్యం.

ఇందిరాగాంధి చిన్నప్పుడు అలహాబాదులో ఉంటూ బ్రిటీష్ వాళ్ళకు వ్యతిరేకంగా పోరాడుతున్న నాయకులకు సాయం చేయాలనే ఓ తలంపుతో 'రామదండు' అని ఓ పిల్లల గుంపును తయారుచేసింది. ఆవిడ చేసిన చాలా పనులు ఆనాటి నాయకులకు బాగా ఉపయోగపడేవి. 'మేము చిన్న పిల్లలం గదా ! మేమేం చేయగలం !' అని ఊరుకోకుండా వాళ్ళకు తోచిన పనులు వారు చేసేవారు. ఎంతో ఉత్సాహంగా, త్వరత్వరగా ఒక చోటి నుండి మరోచోటుకి సమాచార పత్రాల్ని అందించేవారు. చిన్న పిల్లలు ఆడుకుంటున్న ఆటల్లే అనుకుని ఎవరూ పట్టించుకొనేవారు కాదు. ఎవరికీ పెద్దగా అనుమానాలు వచ్చేవి కావు. వారి తల్లిదండ్రులు వారు చేసే పనులను చక్కగా సమర్థించే వారు. కాని అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఎలాంటిదంటే పట్టుబడితే పిల్లలని కూడా చూడకుండ చంపిపారేసేవారు. అయినా 'రామదండు' అనే పిల్లల మూక చెక్కుచెదిరేది కాదు.

కాని ఇప్పుడు అలాంటి ప్రాణత్యాగం చేయాల్సిన అగత్యమూ లేదు. అలాంటి పరిస్థితులు లేవు. కేవలం గురువులకు సాయపడేందుకు కొంత సమయాన్ని మన శక్తికొద్ది మనస్ఫూర్తిగా, ఆత్మసాక్షిగా కేటాయిస్తే చాలు. మహాకాలుడిచ్చిన 24 గంటల్లో కొద్ది నిమిషాలైనా సరే ఆయనకి సమర్పించగల్గితే ఋషి సంతతికి చెందిన వారమనిపించుకుంటాము.

ఈ పై మహా సత్య వాక్కులకు స్పందించిన వారు వెంటనే తమ అమూల్యమైన అభిప్రాయాన్ని, సలహాలను, సూచనలను సమర్థ సద్గురు వేదపీఠము - తెనాలి చిరునామాకు వ్రాసి తెలియజేయమని కోరుకుంటున్నాము. మీ మీ ఉత్తరాలకోసం ఎంతోమంది ఎదురు చూస్తుంటారని మరువకండి ! మీక్కల్గిన స్పందనను తక్షణం వ్రాయండి.

జై మహాకాలీ !

జై జై మహాకాలీ !!

– M.S.K. NARAYANA RAO
కన్వీనర్
సమర్థ సద్గురు సంస్థాన్
విజ్ఞయూర్ వేదిక్ ట్రస్ట్ ఇంటర్నేషనల్
వేణుగోపాలనగర్, గుంటూరు



"ఒకని శిరస్సుకు గురిచూసి వదలిన బాణం తలపాగాకు తగిలి నిర్వీర్యమైనట్లు భక్తుని యొక్క దుష్టకర్మ, ప్రారబ్దము జ్ఞాని అనుగ్రహంతో తప్పక పూర్తిగా తగ్గించ బడుతుంది. అందులో ఏ మాత్రం సందేహం లేదు. అయితే జ్ఞానికి సంకల్పాలుండవు. కానీ జ్ఞాని యొక్క ఉనికి లేక సన్నిధి మహా శక్తివంతమైనది. జ్ఞాని ప్రత్యేకించి సంకల్పించకుండానే, ఆ మహాశక్తి పరమాద్భుతాలను చేస్తుంది. ప్రారబ్ధాలను పోగొట్టడం, వరాలనివ్వడం, భక్తుల్ని రక్షించడం, మనసుకు శాంతి నివ్వడం, తుదకు ముక్తిని అనుగ్రహించడం కూడా సులభసాధ్యము. మీ ప్రార్థనలకు ఈ శక్తే బదులు పలుకుతుంది. మీ కర్మలను తొలగించి వరాలను యిస్తుంది. ఇదంతా అత్యంత సహజంగా జరుగుతుంది. జ్ఞాని సంకల్పించకుండానే ఈ మహాలీల సాగిపోతుంది. కనుక భయపడవలసిన పనిలేదు."

– శ్రీశ్రీశ్రీ భగవాన్ రమణ మహర్షి

ॐ

# మహా శూన్యోపాసన

## (ఓ మహత్తర రహస్యోపాసన)

"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః" అనటం దగ్గర్నించి 'ఏం గురూ' అనే వరకు మనమంతా ఆ 'గురు' శబ్దాన్ని వాడుకొంటున్నాము. కానీ అది అంత తేలికగా వాడుకోవల్సిన పదము కాదు. ఆ గురువు దేవతల కంటే అధికుడు. ఆయన దేవతల్ని సైతం శాశించగలిగేంత శక్తివంతుడు. క్రీస్తు అయినా, మహమ్మదైనా, సాయిఐనా మరొకరైనా వారంతా ఒక్కటే. అట్టి గురువులంతా సాక్షాత్తూ వేదమూర్తులేనని మర్చిపోరాదు.

ప్రకృతిలోని శాశ్వత, సనాతన, నిత్యనూతన సత్యాల్నీ - వాటి నియమాల్నీ 'వేదములు' అన్నారు. ప్రజ్ఞానఘనులు - సత్య వాక్పరిపాలకులు ఐన గురువులంతా తెలియజేస్తోన్న ఎన్నో అత్యంత రహస్యమయ విషయాలతోపాటు, మరింత శుభప్రదమైన ఓ రహస్య ఆహ్వానం ఈ సందర్భంగా ప్రకటించబడుతోంది. అందుకొంటోన్న వారు నిజంగా ఎంతో అదృష్టవంతులు.

'వేదమనగా యీ శరీరమే. యీ శరీరంలో ఏద్దైతే వున్నదో అదే వేదాలలో ఉన్నది తప్ప మరోటి లేదని స్పష్టపరుస్తూ మరింత విపులంగా 'ప్రకృతిలో ఉన్న దేవతా శక్తుల్నీ - వాటి నియమాల్ని గుర్తించి అవి యీ శరీరంలోకూడ ఉన్నాయనీ, బయట ప్రకృతిలో ఏం జరుగుతోందో సరిగ్గా, ఖచ్చితంగా అలాగే మన శరీరాలలో కూడ జరుగుతోందనే అద్భుత రహస్యాన్ని గుర్తించిన మహామహులు మన భారతీయ ఋషులు. అంతటి మహాత్ములు 'ఆ వేదమే యీ శరీరమనీ - ఆ సూర్యుడే వేదమనీ, సూర్యకిరణ విజ్ఞానమే వేద విజ్ఞానమనీ

ఎంతో స్పష్టంగా తెలియజేశారు. అట్టి ఋషులే నేడెంతో ఆవేదనతో, అశ్రునయనాలతో ఆతృతపడ్తూ యిస్తోన్న ప్రకటన యిది. దీనిని నిర్లక్ష్యపరచరాదు. యిదివరకటిలా ఏవేవో సాకులతో, వంకలతో దీనిని అలక్ష్యపరిస్తే రోగాల రూపంలో, కలహాల రూపంలో కమ్ముకొస్తోన్న కాల సర్ప విష వలయంలో చిక్కుకోవల్సి ఉంటుందని గ్రహించాలి !

భగవంతుడనగా మనమే. మనమంతా కలిస్తేనే భగవంతుడు. పంటి కింద నాలుక పడ్డదని పళ్ళూడగొట్టుకొన్న దాఖలాలెక్కడైనా విన్నామా? అలాగే మన మధ్య పరస్పరం మునుపెలాంటి బేధాభిప్రాయాలున్నప్పటికీ వాటిని సరిచేసుకొని సోదరభావంతో కలసిమెలసి మెలగవలసిన పరిస్థితులొచ్చాయి. మన తాత తండ్రులున్నప్పటి వాతావరణం లేదిప్పుడు. ఇది 24 కోట్ల సంవత్సరాల తర్వాత మనకు మన భాగ్యవశమున లభించినట్టి సువర్ణావకాశము.

అనాదికాలం నుంచి నేటివరకు గురువులందర్నీ చిత్రహింసలకు గురిచేయడమే కాకుండ హత్యచేయడానికి సైతం వెనుకాడలేదీ మానవజాతి. అయినా కరుణాసముద్రులు, దయాసాగరులు అయినటు వంటి సద్గురువులంతా సహజ ప్రేమమూర్తులు కనుక మనల్ని యింత వరకూ క్షమిస్తూనే వచ్చారు. 5వేల సంవత్సరాలు యీ మానవజాతికి అవకాశమివ్వడం జరిగింది. అయినా మన ప్రవర్తనలో ఋషులాశించిన మార్పు యిసుమంత కూడా కానరాలేదు. యిది చాలా విచారకరము. ఈ విశేషకాలంలో వారంతా చిట్టచివరి శంఖారావంగా యిలా అందిస్తూన్న ప్రేమ పూర్వక ఆహ్వానాన్నైనా విజ్ఞతతో అందుకొందాము.

"నాయనలారా ! నేడు యీ మానవజాతి యావత్తూ ఓ అద్భుతమైన కాలప్రభావానికి లోనై వున్నది. నేడు మానవజాతి తన బాధ్యతను తను స్వీకరించవలసిన సమయమాసన్నమైనది. ఇంతటి అరుదైన అపూర్వ శుభతరుణంలో అమరత్వము మీ ముంగిట నిల్చివున్నది. భారతదేశము జగద్గురు పీఠాన్ని అధిరోహించబోతోంది. ఋషి ప్రణాళిక ప్రకారము అందుకు సంబంధించిన దిశా నిర్దేశము



ఆంధ్రప్రదేశ్ ద్వారా జరుగనున్నది. ఇలాంటి అపూర్వ సమయము ఇదివరకెన్నడూ రాలేదు. యీ అరుదైన విశేష శుభ తరుణంలో మహాకాలుని యొక్క పుణ్యప్రయోజనాల్ని సుసంపన్నం చేసేందుకై ఎందరో దివ్యాత్ములు, ప్రబుద్ధాత్మలు, మహాత్ములు మనుష్యశరీరాలు ధరించి, మన మధ్య సామాన్య మానవులవలె, మనతోపాటే మనలానే జీవిస్తున్నారు. వారిలో సంత్‌పురుషులు, గతంలో యోధాను యోధులుగా కీర్తించబడ్డవారు, వీరబాలకులు, పతివ్రతా శిరోమణులు, సాధ్వీమ తల్లులు యిలా ఎందరో ఉన్నారు. అంతేగాదు బ్రహ్మమానస పుత్రులైన సప్త ఋషులు కూడ యీ భువిపై యధేచ్ఛగా సంచరిస్తున్నారు.

శ్రీరాముని కంటే ముందు పుట్టిన హనుమంతుడు, సుగ్రీవుడు వంటివారు రామకార్యానికెలా సహకరించారో - శ్రీరాముని కంటే ముందే వున్న వశిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలైనవారు రామునికెలా సహాయపడ్డారో - అదే విధంగా శ్రీకృష్ణుని కంటే ముందు వచ్చిన వారంతా ఆయన యొక్క కార్యకలాపాలకు అవసరమైన సన్నాహాలెలా చేశారో సరిగ్గా యిపుడు కూడా అలాగే యీ ఋషిప్రణాళికలో, తమదైన శైలిలో వారంతా వారివారి పనుల్లో ముమ్మరంగా సాగిపోతున్నారు. గురువులంతా కూడ ఆయా విశేష కార్యకలాపాలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఇట్టి అమృతతుల్య శుభతరుణంలో ఓ ప్రక్కనుంచి అసురీశక్తుల ప్రకోపము - విజృంభణ ప్రారంభంకానున్నది. ఇలాంటి పరీక్షా సమయంలో కూడా మనము ఎప్పటిలానే అజ్ఞానపు ప్రవర్తనతో వారికి పలువిధాల అడ్డుతగులుతూ వారిని కలవరపెడ్తున్నామన్నది గ్రహించుకోవడం లేదు. అందుకు వారావేదనతో వారి అవసరార్థము ఎన్నో రహస్యాతి రహస్యమైన అధ్యాత్మికాంశాల్ని వెల్లడి చేస్తున్నారు. వాటిలో ప్రధానంగా శ్వాసనుపయోగించుకొని, కొద్దిపాటి ప్రయత్నంతో పిల్లలు సైతం ఎన్నో మహాత్ప్రయోజనాల్ని పొందవచ్చును. మనం నిత్యము సాధారణంగా తీసుకొంటున్న శ్వాసలోని గుహ్యాతి గుహ్యమైన విశేషాల్ని తెనాలి - సమర్థ సద్గురు వేద పీఠము ద్వారా వారందించారు. (శ్వాసమహా

విజ్ఞాన్‌ను నాలుగు భాగాలుగా అందించబడ్డాయి. అసలు ఆధ్యాత్మికతకు మూలభూతమైన యీ శ్వాసతో ఎన్నో మహత్వపూర్ణమైన కార్యాల్ని దిగ్విజయంగా నెరవేర్చవచ్చు ! అందుకు సంబంధించిన ఎన్నెన్నో కీలకాంశాలు, రహస్యమయ విశేషాలు యీ నాలుగు భాగాల్లో చాలా వివరంగా తెలియజేయబడ్డాయి. తక్షణం ప్రతిఒక్కరూ చదువవలసినవి.) నేడు ఆధ్యాత్మికతలో వస్తోన్న విప్లవాత్మకమైన మార్పులు అందులో సవివరంగా వివరించబడ్డాయి. వాటిని ప్రతి ఒక్కరూ అంటే పిల్లలు, పెద్దలు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, స్త్రీలు, వృద్ధులు అందరూ తక్షణం తెల్సుకొని తీరాలి. కుల, మత, జాతి, లింగ, వయో బేధములు ఏవీ లేవు. అలాంటి వాటిని యీ సందర్భంగా పట్టించుకోవడం గురుద్రోహమనిపించుకొంటుంది.

కాస్త గందరగోళంగా ఉన్నప్పటికీ, ఓ పట్టాన జీర్ణంగాని ఓ యదార్థాన్ని గురువులు మన ముందుంచారు. "భారతదేశాన్ని విదేశీయులు కొల్లగొట్టడంలో గురువుల పాత్ర ఎంతో ఉంది." సర్వజ్ఞులైనవారు ఏది, ఎప్పుడు, ఎందుకు, ఎక్కడ, ఎలా చేస్తారో మనం ముందే ఊహించేయ గలిగితే ఇక వారి గొప్పేముంది ? సద్గురువులు, ఋషితుల్యులు తమ ఉనికిని బాహాటంగా ప్రదర్శించుకోటానికి యిష్టపడరు. నేడు వారి ప్రణాళిక ప్రకారం ఎన్నో పనులు త్వరత్వరగా పూర్తిచేయవల్సిఉన్నది. యీ లోగా భక్తులనబడే కొందరు వారి దివ్యమైన ప్రణాళికకు యిబ్బందికరం కాకుండ ఉండేందుకు శ్రీ సత్యసాయి ఇటీవల అసత్యాల బురద వారిపై వారే చల్లుకొన్నారు. అందుకే సర్వజ్ఞులైన వారేనాడో ఓ పిలుపునిస్తూ 'భక్తులైన బిడ్డలారా ! నాకు భక్తులుగాదు. శిష్యులు కావాలర్రా ?' అంటూ మనల్ని ఆవేదనతో ప్రాధేయపడ్డారు. అయినా మనం వారికి నిరాశే మిగిల్చాము.

నేడు మనం ఎంతో అపురూపమైన, మంగళప్రద వాతావరణంలో జీవిస్తున్నాము. ఆనాడు క్రీస్తు తన దగ్గరున్న కొద్దిపాటి రొట్టెల్నీ వాటినీ వేలాది మందికి పంచిపెట్టినప్పటిలాంటి వాతావరణం మన చుట్టూ



ఏర్పడి ఉన్నది. శ్రీరాముని పట్టాభిషేకానికి ముందు నృప్పటిలాంటి ఓ విశేష కాలప్రవాహంలో మనమంతా ఉన్నాం. సూర్యుని నుంచి విశేష శక్తిధారలు పృధ్విపై వెల్లువలా కురుస్తున్నాయి. వాటిని మనం వట్టించుకోపోతే - ఆ అమృతధారల్ని నేలపాలు చేసుకొన్న దౌర్భాగ్యులమౌతాము - యీ అమోఘప్రద దైవీయ వాతావరణంలో కూడ మనం మునుపటిలానే జీవిస్తూంటే మనంత దురదృష్టవంతులు యిక ఉండబోరు.

ఈ సందర్భంగా సకల సమర్థ సద్గురువులంతా ఓ విశేషమైన సమూహాల్ని కోరుకొంటున్నారు. యీ పృధ్వీ గ్రహాన్ని ఏకంగా స్వర్గంగా మార్చివేయబోయే ఋషి ప్రణాళికకు శరీరధారులమైన మనమెంతో సహకరించాల్సిన అవసరమున్నదని గ్రహించాలి ! మన కందజేయ బడుతోన్న యీ మహత్తర అవకాశము మానవజాతికి మొట్టమొదటి సారిగా ఓ అద్భుత ప్రయోగంగా గురువులు స్వీకరించారు. యీ మహా ప్రయోగానికి జగద్గురువైన శ్రీకృష్ణుడే బీజాలు వేశారు. ఆనాడు 'మధుర' అనే ఊరిని రాత్రికి రాత్రే ద్వారకకు తరలించేశాడాయన. వినా అలా తరలించబడ్డవారికి ఆ విషయం అసలు తెలీనే తెలీదు. ద్వారకలోనే కొన్నేళ్ళుగా నివసిస్తున్నామను కొన్నారు. అలా ఉంటాయి వారి చర్యలు. యీ సారి కూడ సరిగ్గా అలాంటి ప్రయోగమే, కాకపోతే అందుకు భిన్నంగా జరుగబోతోంది.

కాబట్టి ఆత్మబంధువులారా కాస్త జాగ్రత్తగా వివేకంతో యీ విశేష అపూర్వ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు మనమంతా తక్షణం ప్రయత్నాలు ప్రారంభిద్దాం ! ఋషి సంతతి యైన మనం వారు కోరుకొంటున్నట్లు సమూహాలుగా ఏర్పడదాం ! త్వరపడండి ! నేడిలాంటి అవకాశాన్ని జారవిడుచుకొన్నట్లయితే యీ అక్షరమైన విజ్ఞానము కాలగర్భంతో కలిసిపోయే ప్రమాదముందనీ, వీలయినంత త్వరగా, వీలయినంత ఎక్కువ మందికి యీ సమాచారము అందివ్వమనే గురువుల ఆదేశము మేర ప్రయత్నిస్తున్నాము - సహృదయులు అర్థంచేసుకొని మాకు తగిన సహాయ సహకారాలందించి మహాకాలుని

విశేషానుగ్రహానికి పాత్రులగుదురుగాక ! మనకందరకూ కల్కి భగవానుని అఖండ-శీర్వాదము, సకల సమర్థ సద్గురువుల విశేషాశీశ్శులు మెండుగా లభించుగాక ! అని మనసారా ప్రార్థిద్దాం !

సమస్త బాధలూ, కష్టాలు, అలజడులు పొగొట్టి శాంతినిచ్చే ఏకైక ఔషధం ఏదైతేఉందో దాన్నందించే ప్రయత్నమే యిది. అంతేకాదు. ఏ ఒక్కటే తెలిస్తే సమస్తమూ తెలిసిపోతాయో అట్టి దివ్యజ్ఞానాన్నందించే అద్భుతవిద్య ఈ సందర్భంగా ఇక్కడ ప్రకటింపబడుతోంది. పరమ పూజ్య గురుదేవులు శ్రీ పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్యులవారు దీన్ని ఏకమూలికావైద్య విధానంగా అందించారు. మొట్టమొదటగా ప్రతి సాధకుడూ ప్రతి ఒక్క ఆధ్యాత్మికవేత్త తెలుసుకోవలసిన ప్రాథమిక సూత్రమొకటుంది. అది తెలీని వాడు అసలు ఆధ్యాత్మిక జగత్తుకే అనర్హుడు. అదేమంటే

*'Nature is always right'*

**"ప్రకృతి ఎప్పుడూ సరిగానే చేస్తుంది"**

ఈ మూలభూతమైన పరమసత్యాన్ని అంగీకరించకుండా మనం చేసే ఎంత గొప్ప సాధనైనా వ్యర్థమే.

**"నీవు ఏ పరిస్థితుల్లో ఉన్నావో అదే సరియైనది. ప్రకృతి నిన్ను సరిగానే ఉంచింది అనే సూత్రాన్ని విశ్వసించని నీ సాధన, నీ తపస్సు నిన్ను పిచ్చి భ్రమల్లో ఉంచుతుంది."** మనిషి యొక్క తత్వం గురించి మాట్లాడుతూ ఓసారి మాష్టారు "మనిషెంత అల్పజ్ఞత్వంతో ఉంటాడంటే తనకు బాగా పనికొచ్చే విషయాల్ని కూడా ఎందుకూ పనికిరాని వాటిగా అనుకొంటుంటాడు. అలాగే ఆ పరిస్థితుల్ని తయారు చేసుకుంటుంటాడు. ఈ విషయంలో 84 కోట్ల జీవరాశులలో మనిషిని మించిన ప్రాణి మరోటి లేదు." అంటుంటారు అప్పుడప్పుడూ హాస్యపుధోరణిలో.

**మన జీవితంలో మనకు ఎదురయ్యే కష్టాలు, ప్రమాదాలు, సమస్యలు ప్రకృతి మనకు అందజేస్తున్న వరాలు** అనే సూత్రాన్ని ఎంత చక్కగా అర్థం



చేసుకోగలుగుతామో, విశ్లేషించుకుంటామో ప్రకృతి చెప్తోన్న పాఠాన్ని అంత చక్కగా అవగాహన చేసుకోగలుగుతాం. **మనచుట్టూ ఉన్న నచ్చని పరిస్థితులే మనల్ని మహానుభావులుగా మార్చే దివ్యమైన ఔషధాలు** అన్న సత్యాన్ని ఎంత గట్టిగా విశ్వసిస్తామో అంతగా గురువులకు దగ్గరౌతాము. ప్రతీ మహాత్ముడూ ప్రతి ఒక్క సద్గురువూ ఇలాగే కష్టాల నధిగమించి పైకొచ్చినవాడే. నిజానికి ఆ కష్టపరిస్థితులే వాళ్ళనలా పైకిలేపాయి. ఏ గురు చరిత్ర చదివినా మనకీ కఠోర సత్యం స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే మరో పరమ సత్యవాక్కు ఏమంటే కష్టాలు అవసరమే. బాధలూ తప్పవు. అవి లేకుండా జీవితంలో రుచి ఏమీ ఉండదు. అంతేగాదు ఎదుగుదలే స్థంభించిపోతుంది' అని చెప్తూ యింకో ఉదాహరణగా యిలా చెప్పారు 'సినిమాలు చూసేవాళ్ళకి బాగా అర్థమవుతుంది. సినిమాలో విలన్ లేదనుకోండి ఆ సినిమా ఎలా ఉంటుంది ? చాలా మంది అలాంటి సినిమాలకెళ్ళరు. కావాలంటే పరిశీలించుకోండి' అన్నారు ఓ సందర్భంలో కాలేజిపిల్లలతో మాట్లాడుతూ

మాతృశ్రీ జిల్లెళ్ళమూడిఅమ్మ ఓ సందర్భంలో అక్కడున్న పరివారానికి పెరుగన్నం కలిపి తనే ముద్దలు చేసి పెడుతోంది. కమ్మటి పెరుగన్నం ముద్దల్ని తింటోన్న బిడ్డల్లో ఒకరడిగారు 'అమ్మా ! పెరుగన్నంలో నంచుకోడానికి ఏ అవకాయో, కారమో కాస్త తెప్పించండ'ని. పెరుగన్నం సుఖమనుకొంటే కారంగా ఉండే అవకాయ కష్టం, బాధలకు సంకేతముగా చెప్పుకోవచ్చు. అందుకే అమ్మ అనేవారు 'బాధల భగవంతుడు'అని

**పూజ్య గురుదేవులు డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ** గారందించిన దివ్యామృత వాణి నుంచి సేకరించబడ్డ రహస్యవాణి యిది. దీనిని జాగ్రత్తగా చదివి అవగాహన చేసుకొంటే వెన్వెంటనే పరమ గురువుల మహత్వపూర్ణమైన చేయూతను, సమర్థ సద్గురుని స్పర్శను అందుకోగలగడం తథ్యం. అందులో ఏ మాత్రమూ సందేహం లేదుగాకలేదు.

'భగవంతుడా ! నాకు శక్తినివ్వు' అని అడిగాను. దానికాయన నాకు కష్టాలనిచ్చి శక్తిని పొందమన్నాడు.

'భగవంతుడా ! నాకు జ్ఞానాన్నివ్వమ'ని అడిగాను. అందుకాయన నాకు సమస్యలనిచ్చి పరిష్కరించుకోమన్నాడు.

'భగవంతుడా ! నాకు సంపదనివ్వు' అని అడిగాను. తెలివి తేటలనిచ్చి మట్టిని బంగారంగా చేసుకోమన్నాడు.

'భగవంతుడా ! నాకు ధైర్యాన్నివ్వు' అనడిగాను. అందుకాయన నాకు ప్రమాదాలిచ్చి ధైర్యం తెచ్చుకోమన్నాడు.

'భగవంతుడా ! నాకు నీ ప్రేమనందించు !' అనడిగాను. అందుకాయన నాకు ఆపదల్లో నున్న వారిని చూపించి వారినాదుకో పొమ్మన్నాడు.

భగవంతుడా ! నాకు వరాలనివ్వు అనడిగాను ఆయన నాకు రకరకాల అవకాశాలిచ్చాడు.

'భగవంతుడు కఠినాత్ముడు. నేనొకటడిగితే ఆయన మరొకటిచ్చాడు. నేను కోరుకున్నదేదీ పొందలేకపోయాను' అని ఒకడంటే 'భగవంతుడు దయామయుడు. ఆయన ద్వారా నాకవసరమైన ప్రతిదీ పొందాను' అని మరొకడన్నాడు. మన దృష్టికోణంలోని చిన్న మార్పే అది.

మన జీవితంలో వచ్చే కష్టాలు, సమస్యలు, ప్రమాదాలు భగవంతుడిచ్చిన వరాలు అనే సత్యాన్ని ఎంత అవగాహన చేసుకుంటామో అంతగా ఆత్మోన్నతి సాధించగలుగుతాము. ఏ ఆధ్యాత్మిక జీవన స్రవంతి వల్ల భారతదేశము రత్నగర్భ అని కీర్తించబడిందో, జగద్గురు పీఠంపై అధిరోహించబోతోందో ఆ ఆధ్యాత్మిక విద్య యొక్క వాస్తవిక స్వరూపాన్ని చూడగలిగే దృష్టిని సముపార్జించుకోవాలి. అందుకు సంబంధించిన ప్రయత్నం జరుగుతోందిక్కడ. ఈ దేవత వల్ల నా కష్టాలు తీరతాయి. ఈ పూజతో నా సమస్య పరిష్కారమవుతుంది. ఈ నోము నా కష్టాలు తీరుస్తుంది. ఆధ్యాత్మికత కేవలం వీటికోసమే అనే భ్రాంతికి లోనై



యున్నాం మనం. దాన్ని ఎంత త్వరగా పోగొట్టుకొంటే అంతగా ఉన్నతుల మవగలుగుతాము.

కాలచక్రగతి ప్రభావంతో విదేశీయులు మన మధ్య జొరబడ్డారు. వారి కుసంస్కారిత ప్రభావం మనపై ఎంతో ముద్ర పడేలా చేసింది. దాని ప్రభావంతో మన భారతీయ ఆధ్యాత్మిక మానసిక స్థితి మర్చిపోయాం. ఎంతో నష్టపోయాం. రత్నగర్భ అని ఒకప్పుడు కీర్తించబడ్డ భారతదేశం ఈనాడు అప్పులపాలవడానికి కారణం ఆధ్యాత్మిక జీవన విధానాన్ని మనం మర్చిపోవడమే. గురుపరంపర మళ్ళీ మళ్ళీ మనకు గుర్తు చేయడానికి ప్రయత్నం చేస్తున్నా కూడా మనం లక్ష్యపెట్టట్లేదు. విదేశీయులు భారతదేశంలో జొరబడి అసలే అయోమయంలో ఉన్న మనల్ని మరికాస్త చీకట్లోకి తోశారు. సరే ఎలాగో కొందరు మహాత్ములు వాళ్ళని తరిమికొట్టేసినా వారి విదేశీ జీవన విధానం మన మీద చాలా ప్రభావం చూపించింది. అనాగరికమైన పరాయి విధానాన్ని గబ్బిలాల్లా పట్టుకు వేళ్ళాడుతున్నాం. వెలుగులోకి రాలేకపోతున్నాం. సవ్యమైనటువంటి జీవన విధానాన్ని నేర్చుకొని జీవితాన్ని శాంతిమయంగా చేసుకోవాలని మనకు అనిపించడం లేదు. ప్రకృతికనుగుణ్యంగా జీవించడమే ఆధ్యాత్మికత అని మర్చిపోయాం. నేర్చుకోదలచుకోకపోతే ఎంత అనుకూల వాతా వరణాన్నిచ్చినా నేర్చుకోం. నేర్చుకోదలచుకుంటే ఏకలవ్యుడిలా గురువు 'నీకు నేర్పనుపో' అన్నా నేర్చుకోగలుగుతాం. చిత్రం. విచిత్రం కదా !

మానవజాతికి భారతీయ ఋషులు అందిస్తోన్న విశిష్టమైన జీవన విధానాన్నీ ఋషి సంస్కృతినీ, సుసంస్కారాల్నీ మన ద్వారా ప్రపంచానికి అందజేయబడబోతున్నాయి. ఋషి ప్రణాళికలో భాగమిది. మొట్టమొదట మనం ఈ సందర్భంగా తెలుసుకోవలసిందేంటంటే బానిసత్వపు ప్రవృత్తులు గలిగిన మన ప్రస్తుత జీవన విధానానికి స్వస్తిపలకాలి. అలాగాకుండా యిదే బానిసత్వపు మానసికస్థితితో వుంటే ఋషులచే అందించబడుతోన్న మహా విజ్ఞానం బుర్రకెక్కదు.

అవగాహనవదు. బానిస ఎప్పుడూ స్వతంత్రంగా జీవించలేడు. మంచిదని తెలిసినా సమాజం ఒప్పుకోకపోతే మనమేమీ చెయ్యలేం. అంటే మొట్టమొదట మనం సమాజానికి బానిసలమైపోయాం. చెడు అని తెలిసినా సమాజం అడ్డుచెప్పకపోతే హాయిగా చేసేస్తుంటాం. తాగుడు, జూదం యివి చెడు అని అందరికీ తెలుసు. కానీ నిశ్చింతగా, బాహాటంగా, హాయిగా జరిగిపోతుంటాయవి. తప్పు చేస్తున్నామనే కనీస భావనకూడా రాని బానిస బ్రతుకులు. ఆ మానసిక స్థితి నీచమైనది.

ఒకాయనకి అతని స్నేహితుడు అమెరికా నుంచి ఓ బహుమతి తెచ్చాడట. దాన్నందిస్తూ యిలా చెప్పాడట. 'మిత్రమా ! యిదంటే నీకు చాలా యిష్టం. కానీ యిది స్లోపాయిజన్. మెల్లిమెల్లిగా అది నిన్ను, నీ కుటుంబాన్నీ దహించేస్తుంది. నీ మేలుకోరే స్నేహితుణ్ణి కాబట్టి నీ కిష్టమైందని తెచ్చాను. చెప్పాల్సింది చెప్పాను. తీసుకో' అన్నాడు. ఆ బహుమతి ఏంటంటే అమెరికాలో దొరికే సిగరెట్లు. తీసుకోవాలా ? వద్దా ? 'సిగరెట్ స్మోకింగ్ ఈజ్ ఇన్‌జ్యూరియస్ టు హెల్త్' అన్న అక్షరాలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నా పెద్దగా పట్టించుకోము. యిదీ బానిసత్వం అంటే. కుటుంబ సభ్యులు కూడా అది స్లోపాయిజన్ అని తెలిసీ ఊరుకుంటారు. చింతపండు, నూనె, ఉప్పు యివన్నీ నిన్నో రోజు కిందపడేస్తాయని తెలిసీ అవి వదల్లేక 'యిక అవికూడా తినకపోతే బతకడమెందుకు ?' అనే స్థితి కొచ్చాం. 'నిరాశ కలిగించేందుకు చెప్తున్నవి కావీ మాటలు. యింతకంటే హీనమైన పరిస్థితుల్లో ఉన్నాసరే మనమెదిగేందుకు దివ్యమైన మార్గముంది. అదే గురువుల మార్గము' అంటూ చెప్తోన్న ఋషులు ఏమంటున్నారంటే యావత్ గురుపరంపరకే మార్గదర్శనం చేస్తోన్న సూర్యుణ్ణి ఉపాసన చేయండి ! అనంతమైన సంపద, అఖండ శాంతి మీ సొత్తు అవుతుంది. మీరెవ్వరినీ అడుక్కోవక్కరలేదం'టున్నారు. జీసస్ క్రైస్ట్ ఎవ్వర్నీ అడుక్కోలేదు. మహమ్మదు కూడా ఎవర్నీ అడుక్కోలేదు. సాయి ఎవ్వర్నీ అడుక్కోలేదు. ఇలా ఏ గురువూ ఎవ్వర్నీ అడుక్కోలేదు పైగా ఈ సూర్యో



పాసనతో అద్భుతాలు చేశారు. అక్షయ పాత్రలు సంపాదించారు. ఎంత హీనమైన స్థితిలో ఉన్నవారికైనా ఈ సూర్యోపాసన అమితమైన మేలు చేస్తుంది.

ఆధ్యాత్మికవేత్తలు, ఋషులు, ఆధునిక సైంటిస్టులు లెక్కగట్టి చెప్పిందేమంటే ఈనాడు సంపూర్ణ మానవజాతి అట్టడుగు స్థాయికి పడిపోయింది. యింక అంతకు మించి వెళ్ళేందుకు లేదు. మరి యిలాంటి పరిస్థితుల్లోని మనం ఆ సూర్యుని ఉపాసనను అర్థం చేసుకొని ఋషుల, గురువుల ఆశీర్వాదంతో ఉన్నత స్థితికి ఎదగవచ్చు. ఈ సందర్భంగా వారి సత్యవచనాల్ని ఓ సారి పరిశీలించాల్సివుంది.

'భారతీయ ఆధ్యాత్మికతను సరిగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి ! ఉన్న ఒకే ఒక విద్యుత్తు అనే శక్తితో మీరు ఫ్యాన్‌లు, టీవీలు, రేడియోలు, కంప్యూటర్లు, హీటర్లు మొదలైనవి ఎలా వాడుకుంటున్నారో ఖచ్చితంగా అలాగే రకరకాల దేవతా మూర్తుల్లో సూర్యునియొక్క శక్తి ప్రతిబింబిస్తోంది. రాముడు, కృష్ణుడు, హనుమంతుడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులే కాకుండా, ప్రపంచంలో ఉన్న మూడొందల మతాల ధర్మాలు కూడా సూర్యుడి యొక్క శక్తినే తెలుపుతున్నాయి అని అర్థం చేసుకోవాలి. అది ఎప్పుడైతే చక్కగా అర్థమవుతుందో అప్పుడు ఆధ్యాత్మికత పట్ల ఓ అవగాహన వస్తుంది.

'ఏకం సద్విప్ర బహుధావదంతి' ఒకే సత్యాన్ని, ఒకే చేతనత్వాన్ని విప్రులు రకరకాలుగా చెప్పారు. ఆకాశాన ఉదయిస్తున్న సూర్యుడు ఉదయాన బ్రహ్మగా, మధ్యాహ్నం విష్ణువుగా, సాయంకాలం మహేశ్వరుడిగా దర్శనమిస్తాడు. దీన్నవగాహన చేసుకోలేక 'అనేక మంది దేవతలు' అనే భ్రాంతిలో జీవించడమే కలియుగ ధర్మం. సత్యాన్ని చూసే శక్తి లేకపోవడమే కలియుగం. కానీ మహర్షులు ఈ దురవస్థ రెండువేలవ సంవత్సరం తరువాత పోతుందని స్పష్టంగా చెప్పారు.

అనేక మంది గురువుల సమాధుల దగ్గర లక్షలాది మంది సమస్యలు తీరుతున్నాయి. బాధలు పోతున్నాయి. వారి పేరు మీద

లక్షలాదిమందికి ఆహారం అందుతోంది. అది మంత్రాలయం కావచ్చు, వెంకయ్యస్వామివారి గొలగమూడి కావచ్చు మరో క్షేత్రం కావచ్చు. హిందూ మతానికి సంబంధించినదే కాకపోవచ్చు. మరో మత ప్రవక్తల పేరున అనేక దానధర్మాలు యిప్పటికీ అలా జరుగుతున్నాయి. ఏమిటి యిదంతా ? వారికా శక్తి ఎక్కణ్ణించి వచ్చింది ? ఆ సూర్యుడి యొక్క శక్తిని పట్టుకోగలిగారు వాళ్ళంతా. నేడు మన భాగ్యవశాన ఆ అమృత విద్యను నేర్పుతామని మన మధ్యకొచ్చిన ఋషుల మాటలపట్ల శ్రద్ధ చూపకపోవడం మన బానిస మనస్తత్వానికి అద్దం పడుతోంది. 'మీరు యిక దేనికీ దేహీ అని ఎవ్వరినీ యాచించక్కర్లేదు ! రండి నాయనలారా మీకా అద్భుతమైన విద్య నేర్పుతాము' అంటూ ఆహ్వానం పంపితే మనం స్పందన చూపకపోవడం ఎలాంటిదో ఒక్కసారి ఆలోచించండి ! అంటూ ఆందోళనగా పలుకుతోన్న గురుసత్తాను అర్థం చేసుకొనే ప్రయత్నం చేద్దాం !

ఓ సారి ఓ పంజరంలోని పక్షిని చూసి ఓ యోగి జాలిపడి దాని పంజారానికుండే తలుపు తీశాట్ట. అయినా ఆ పక్షి బయటకి రాలేదు. ఎగిరిపోలేదట. సంవత్సరాలబట్టీ అలవాటుపడి మగ్గుతోన్న బానిస బ్రతుకులు ఒక్క పిలుపుకు ఎలా మలుపు తిరుగుతాయి. కాని అది మనకే చేటు కలుగజేస్తుంది. యీ చిట్టచివరి శంఖారావాన్ని పెడచెవిన పెట్టడం ఎంతమాత్రమూ శ్రేయస్కరం కాదు.

దయామూర్తులు మనకు అమరత్వాన్నందించే అమృత విద్యను నేర్పబోతున్నారు. అఖండ శాంతిని, అనంత ఐశ్వర్యాన్నిచ్చే 'మహాశూన్యోపాసన' ను అనుగ్రహిస్తున్నారు. 'అడక్కుండానే యిలా మనకందివ్వడం పృథ్వీగ్రహచరిత్రలో ఇదే మొదటి సారి జరుగుతోందన్నారుకూడా. 'బహుశా యిదే చివరి సారి కూడానేమో' అనీ అంటున్నారు. జన్మజన్మలుగా అనేక జన్మలలో మనలో రకరకాల సంస్కారాలు నాటబడివున్నాయి. దాని ప్రభావం చేత నేటి సద్గురువుల సత్యవాక్యాలకు ఆకర్షింపబడ్డాము. ఆధ్యాత్మికత పట్ల ఆసక్తితో మనం ఉన్నప్పటికీ ఏదో ఒక మూల



మనలోని దౌర్భాగ్యం వల్ల అమృతవిద్య యైన దీని పట్ల పెంచుకోవాల్సిన అభిరుచిని పెంచుకోలేక పోతున్నాం. దాన్ని మనం వీలయినంత త్వరగా సరిచేసుకోవాలి !

భగవాన్ శ్రీ మూరెళ్ళ శ్రీరామకృష్ణ గురుదేవులు ఆధ్యాత్మికతలో ఉన్న అనేక గందరగోళాల్నీ, అనుమానాల్నీ, సందేహాల్నీ నివృత్తి చేస్తూ సమగ్రమైన ఆధ్యాత్మిక విద్యను మనకందచేస్తున్నారు. సరియైన అవగాహన లేకపోవడం వల్ల ఆధ్యాత్మికతలో ఈ గందరగోళాలేర్పడ్డాయి. అసలు ఆధ్యాత్మికతలో మనం ఏం నేర్చుకోవాలో తెలీదు మనకు. దీపారాధన కుడిచేత్తో చేయాలా ? ఎడమ చేత్తో చేయాలా ? హారతెలా యివ్వాలి ? యిలా ప్రతిదీ సందేహమే. ఎడమచేత్తో రాసే విద్యార్థిని టీచర్లు ఏం చేస్తున్నారు ? 'అయ్యబాబోయ్ ఎడం చేత్తో రాస్తున్నావ్! కొంపలంటుకుపోతాయి. యింకేముంది సరస్వతీదేవికి కోపం వచ్చేస్తుంది. అన్నీ బెడిసి కొట్టేస్తాయి' అనేమైనా అంటున్నారా ? ఏం లేదే ? మరి పూజా కార్యక్రమాలు పొరపాటున ఎప్పుడన్నా ఎడం చేత్తో చేస్తే మాత్రం ఏంటిట ? మనం చేసేటువంటి పెద్ద పొరపాటేంటంటే కర్మకాండకు మాత్రమే ప్రాముఖ్యత నిచ్చేస్తున్నాం. ఐదు మాలలు గాయత్రీమంత్రం చేసేసి, దత్త మంత్రం ఒక మాల చేసేసి, సాయి మంత్రం మూడు మాలలు గబగబా లాగేసి, పూజ చకచకా తొందర తొందరగా చేసేసి......'

ఏంటిట చేసేసి ? ఎందుకాపూజలు ? (అంటే మానేయమని కాదు సుమా.) కర్మకాండ కంటే మనం ప్రాముఖ్యత నివ్వాల్సింది ఆ పై యింకోటుంది. 'ఒక్కొక్క గాయత్రీమంత్రాన్ని నేను ఉచ్చారణ చేస్తుంటే నాలో ఏయే మార్పులు వస్తున్నాయ'నేది గమనించు కోలేకపోతున్నాం. ఋషులు మనకు కర్మకాండలను నిర్దేశించింది ఎందుకో వారి ఉద్దేశ్యాన్ని విస్మరించడం వల్లనే మనకు ఆధ్యాత్మికత పట్ల అనాశక్తతకు కారణమౌతోంది.

పసిపిల్లలు మొదట్లో కారాలు తినరు. మనమేదన్నా కాస్త కారం నోటికి రాస్తే అరిచి గగ్గోలు పెడతారు, ఉమ్మేస్తారు. అయినా మనం వాడిని వదలం. మెల్లిమెల్లిగా అలవాటు చేస్తాం. చివరికి వాడెలా తయారవుతాడు ? చప్పిడి పదార్థాలు పెడితే ఉమ్మేస్తాడు. అయినా అట్లాగే చప్ప చప్పగా పెడితే గందరగోళం చేస్తాడు. యిష్టం లేని దానిమీద ఒక పిల్లాడికి ఎలాగైతే మనం రుచి కలిగిస్తున్నామో అలాగే ఆధ్యాత్మికతలో కూడా రుచిని, అభిరుచిని పెంపొందించు కోవాలి. మొదటిసారి సిగరెట్ తాగేటప్పుడు ఆనందంగా తాగిన వాళ్ళెవరూ ఉండరు. దగ్గొస్తుంది, కళ్ళ వెంట నీళ్ళొస్తాయి ఉక్కిరి బిక్కిరవుతూ నేర్చుకుంటాడు. మెల్లిమెల్లిగా 'ఫలానా హీరో యిలా తాగాడు' అంటూ గుర్తుచేసుకుంటూ మొదలెడతాడు. ఆ సినిమాలో ఆ హీరో కొన్ని మంచి పనులూ చేసుంటాడు. అవేమీ గుర్తురావు. యిదిగో యిదొకటి మాత్రం అచ్చు హీరోలాగా నేర్చుకుంటాడు. సిగరెట్ తాగడం చివరకెంత వరకు తెచ్చుకుంటాడంటే 'యిక నువ్వు సిగరెట్లు తాగావా ? ఛస్తావ్ !' అని డాక్టరు చేత చెప్పించుకునే వరకు తెచ్చుకుంటాడు. తమాషా ఏంటంటే అప్పటికీ వీడి చేతిలో వున్న సిగరెట్టుని అవతల పారేయలేడు.

'యిదిగో ఈ విద్య మిమ్మల్ని ఆరోగ్యవంతుణ్ణి చేస్తుంది. ఐశ్వర్య వంతుణ్ణి చేస్తుంది, మృత్యుంజయుణ్ణి చేస్తుంది. శాంతి స్వరూపుడిగా చేస్తుంది.' అని పరిపరి విధాల ప్రాధేయపడి చెప్తున్నా ఆ ఋషుల సత్యవాక్యాల మీద ఎందుకు మనసు పెట్టలేకపోతున్నాం ? ఆ విద్య పట్ల మనమెందుకు అభిరుచి పెంచుకోలేకపోతున్నాం ? సమాధానం ఒక్కటే. దానిపట్ల ఆసక్తి పెంచుకోవాలని లేదు మనకు. 'కానీ అది ఎంత మాత్రమూ సరిఐనదికాదు' అని గ్రహించాలి.

శివకుమార్‌గారు మంచి భక్తులు. అయితే వారికి మాష్టారు యిలా చెప్పారు. మన భక్తిలో బాబాకు సేవలో, పూజలో, భజన్లో చేస్తున్నాం సరే. పరిపూర్ణంగా వీలయినంతగా, చేతనయినంతగా చేస్తున్నామా చూస్కోండి !' అన్నారు.



'పూజ చేయడం - హారతి పాటలు పాడటం మాకు సొంతం సవ్యంగా రావండి. అందుకే ఏదో చేతనయినట్టు చేసుకుంటూపోతున్నాం.' అనేశారాయన.

అదే దానిగురించే చెప్తోంది. మొదట్లో చేతగానిది తర్వాత్తర్వాత నేర్చుకోనో, తెల్సుకోనో చేయొచ్చుగా. 7, 8 ఏళ్ళ క్రితం ఎలా చేసేవాళ్ళమో యివాళకూడ అదే పద్ధతి ప్రకారం చేస్తున్నాము. మరి మనకి శ్రద్ధ ఉందనా ? లేదనా ? ప్రతీది యిలా ఆలోచించుకోండి ! నిన్నటికీ, యివ్వాల్టికీ నీ శ్రద్ధ పెరగాలి - వీలయినంతగానే. చేతగానిదీ మొయ్యలేనిదీ - ఇబ్బంది కలిగించేదీ అక్కర్లేదు. వీలునుబట్టి మన సేవల్లో, మన పూజల్లో - మన జప ధ్యానాల్లో మార్పుచేసుకొంటూ, మెరుగు పరుచుకుంటూ ముందుకు పోతూండాలి. అలా జరుగుతోందా చూస్కోవాలి - పువ్వులుంటాయి బయట చెట్లకు. కొసెందుకు బద్ధకం. అక్షతలైతే సిద్ధంగా ఉంటాయిగా. సర్వాభావే అక్షతాన్ సమర్పయామి. 'యిదే అంతా' అనేస్తాం. అదే సిగరెట్ వెలిగించుకొనే టైంకి అగ్గిపెట్టె కనిపించకపోతే ఎంత శ్రద్ధగా వెతుకుతామో యిల్లంతా. యింట్లో సమయానికి అగ్గిపెట్టె లేకపోతే రోడ్డు మీదకెళ్ళైనా సరే కొనుక్కొస్తాం. యిది ఎవ్వర్నీ కించపరచడానికి కాదు నే చెప్పేదంటూ మాష్టారు యిదంతా చెప్తున్నారు. "రాత్రిపూట ఏ సిగరెట్ కోసమో ఏ అగ్గిపెట్టెకోసమో, టీ కోసమో 2, 3 కిలోమీటర్లు అయినా సరే నడిచి ఏ బస్టాండుకో - రైల్వేస్టేషన్‌కో వెళ్ళి మరీ తెచ్చుకొంటాం. మరి యిదే పట్టుదల, శ్రద్ధ యీ జపధ్యానాలు - పూజల పట్ల మనమంతగా చూపించం. దాన్ని కాస్త సరి చేసుకోగలగాలి" అన్నారొసారి.

దేవాలయాలలో ఆధ్యాత్మికత అడుగంటింది. విష్ణాలయానికి ఎలా వెళ్ళాలి ? శివాలయానికి ఎలా వెళ్ళాలి ? అంటే ఏ మానసిక స్థితిలో వెళ్ళాలి ? ఏ పూలు తీసుకెళ్ళాలి ? వస్త్రధారణ ఎలా ఉండాలి ? ఏ దేవాలయంలో ఏ మంత్రోచ్చారణ చేయాలి ఏ మంత్రోచ్చారణ

చేయకూడదో అలాంటివేం తెలీదు. దేవాలయాలన్నీ ఎందుకూ పనికిరాని వాటిగా చేసుకున్నాం. దీనికి కారణం ఎవరు ? అనేది అనవసరం. పేకాట మిత్రులు గుళ్ళల్లో చేరి ఆట, మీద ఆట గోలగోలగా ఆడుకుంటున్నా, అది అలాంటి స్థలము కాదని గట్టిగా చెప్పలేని నపుంసకులు గుళ్ళోను, గుడిచుట్టూతా ఉంటారు. కాలేజ్‌లో పేకాడితే ఒప్పుకుంటారా ? రిక్షావాళ్ళని పులిమేక - అష్టాచెమ్మ ఆడుకోనిస్తారా ?

ఏ శివాలయమో, విష్ణాలయమో, అంజనేయస్వామి గుడో, ఏ బాబా మందిరమో దర్శనం చేసుకొని వచ్చేస్తుంటే శఠగోపం పెడతారు. అవి ఆ సర్వాంతర్యామి ఐన గురువు యొక్క పాదాలు. మనం ఆ చరణాలను మోసుకుంటూ తిరిగివస్తాం. ఆ చరణాలే మనల్ని ఆయనవైపు నడిపిస్తాయి. ఆచరణలు ముఖ్యం. మంచిదని తెలిశాక ఆచరించాలి. కాస్త కష్టమైనాసరే ఓర్చుకుని చేయగలగాలి.

అసలైన సాధువులు, సంత్ పురుషులు, ఋషులు, గురువులు, అవతార పురుషుల వంటి వారి జీవితము పైకి చాలా మామూలుగా కనిపిస్తూంటుంది. అలాంటి వారితో అత్యంత సన్నిహితంగా మెలుగుతోన్న వారు సైతం వీరి జీవిత ఘట్టాలను చూసి అంతటి మహాత్ముల్ని కూడా సామాన్యులవలెనే భావిస్తూ భ్రమపడతారు. వారి దైనందిన కార్యక్రమాల్ని చూసి వీరు కూడా మనబోటి వారేనని భావిస్తారు. ఆ మహామహితాత్ముల అవతరణ వెనుక ఉన్న దివ్యత్వాన్నీ పరమ లక్ష్యాన్ని ఏ కొద్దిమందో గ్రహించగల్గుతారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి గొప్ప గొప్ప అవతార పురుషులను కూడా ఆనాటి సమకాలికులు ఆ పరమాత్మ స్వరూపాన్ని గుర్తించలేదు. చాలా మంది వారినికూడా తమ బోటి మామాలు మనుషులానే భావిస్తూ వారితో మెలిగేవారు. బహుకొద్దిమంది మాత్రం వారి దివ్య లక్షణాల్నీ, దైవీశక్తుల్ని గ్రహించగలిగారు. అతి మామూలుగా జీవనం సాగిస్తున్న మహాత్ముల క్రమబద్ధమైన జీవన సరళిని, వారి దినచర్యను గమనిస్తే మనకెన్నో



మార్గదర్శకమైన సందేశాలు దొరుకుతాయి. అందుకే ప్రతీ గురువు 'నా జీవితమే ఓ మహా సందేశం' అని చెప్తారు.

పండిత శ్రీ శ్రీరామశర్మఆచార్య చిన్నతనంలో సబర్మతీ ఆశ్రమానికి వెళ్ళారు. 'యోగిగా తీర్చిదిద్దబడాలంటే ఏం చేయమంటారు ?' అని అడిగారు గాంధీజీని. అంతే విపరీతమైన చాకిరీ చేయించారక్కడ. ఆఖరికి లెట్రిన్‌లు శుభ్రపరిచే పని కూడా ఈయనకిచ్చారు. అసలు తొలిగా ఆ ఆశ్రమంలో ఆయన కివ్వబడ్డ పని అదే. ఈ విషయమై భగవాన్ శ్రీ రామకృష్ణ గురుదేవులు మాట్లాడుతూ యిలా అన్నారు. 'యోగ' పేరుతో ఈ రోజుల్లో ఎంతో మంది చాలా తీవ్రమైన సాధనలూ అవీ చేస్తున్నారు. అయితే వీటన్నిటికన్నా అత్యంత కీలకమైన వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారు. అవి ఎంత కీలకమైనవంటే అసలు ఉన్నదంతా వాటిల్లోనే ఉన్నది. అలాంటి మహా రహస్యాల్ని చాలా మంది ఆధునిక గురువులు కూడా ఆచరించటం లేదు. తమ శిష్యవర్గానికి చెప్పటం లేదు కూడా. Cleanness is God. పరిశుభ్రత ఎంత అవసరమంటే ఆరోగ్యం కోసం మాత్రమే అనుకుంటే పిచ్చిపొరపాటది. శుభ్రంగా ఉంచుకోవల్సిన వాటిలో అత్యంత ప్రాధాన్యత స్నానాలగదులు, పాయఖానాలకూ ఇవ్వాలి. యోగము నేర్చుకునే విద్యార్థి అవి ఎవరి బాత్రూములో, వేరెవరి లెట్రిన్‌ల్లో అనవసరం అసలు. పరాయవాళ్ళ పాయిఖానాలు, స్నానపు గదులు, ఎవరెంత బాగా ఎంతగా శుభ్రము చేయగలడో అంత త్వరగా యోగికాగలడు. అంతవేగంగా ఆ విద్యనందుకోగలడు. మహాత్మాగాంధీ చేసినదదే. అందుకే అదే చేయించారు. మాలపల్లెలోని అక్కడి వారి వీధుల్నీ, పాయిఖానాల్నీ, మురుగుకాల్వల్నీ ఎంతో శ్రద్ధగా శుభ్రపరచి వచ్చే వాడాయన. కీలకమైన రహస్యాన్ని పట్టుకోగలిగాడాయన. దాన్నే ఆనాటి శ్రీరామ శర్మకు బోధించారు. వీరేకాదు చరిత్రల్లో అనేక మంది ఈ పరిశుభ్రత అనే కీలకాన్ని గ్రహించిన వారే. ఈ విషయంలో శ్రీరామకృష్ణ పరమహంస వీరందరికంటే ఎంతో ముందుకు దూసుకెళ్ళారాయన. ఆ మహ

నీయుడు ఊళ్ళోవాళ్ళ పాయిఖానాల్ని తన జుట్టుతో శుభ్రపరిచేవాడు. వారు గ్రహించిన రహస్యమైన, మరింత కీలకమైన వాటి పట్ల వారికి ఎంత విశ్వాసమో కదా అనిపిస్తుంది.

యోగవిద్య నేర్చుకుంటోన్న మనం క్రమశిక్షణ తప్పకుండా పాటించాలి. ముఖ్యంగా తీసిన వస్తువును తీసిన చోట పెట్టడం అనే చిన్న లక్షణం లేని ఏ వ్యక్తైనా సరే యోగి కాజాలడు. టి.వి. చూస్తూ మంచినీళ్ళో, ఏ కాఫీనో త్రాగి ఆ గ్లాసును అక్కడ వదిలేయడం యోగి లక్షణం కాదు సరిగదా అలాంటి వారి ఇళ్ళలో లక్ష్మీదేవి నిలబడలేదు. ఐశ్వర్యం హరించిపోతుంది. తీసిన వస్తువును తీసినచోట పెట్టడమనేది వింటానికి మామూలుగా అనిపించినా ఈ కీలకాన్ని విస్మరించినవారు ఎన్ని గొప్ప గొప్ప సాధనలు చేసినా, ఎంత తపనపడ్డా యోగి అయ్యేందుకు అవకాశం లేదన్నారు. యోగి మాటలా ఉంచి జీవితంలో వారు ఉన్నత స్థితినీ, ఐశ్వర్యాన్నీ పొందలేరు. 'ఐశ్వర్యమనేది ఓ మానసిక స్థితి' అని చెప్తూ యిదంతా చెప్పారు.

'నీ గురువుకు నీవు శిష్యుడవు అవాలంటే ఆయనేం ఆచరించాడో, ఆయనే పద్ధతి ననుసరించాడో ఆ ఆచరణ నీ జీవితంలో రావాలి. నీ ఆచరణ నీ విశ్వాసాన్ని తెలియజేస్తుందన్నారందుకే. భగవంతుడి పట్లో, ఏ గురువు పట్లో నీకున్న విశ్వాసం నీ ఆచరణ తెలియజేస్తుంది. ఆయన్ని అనుకరించడం గాదు. అనుసరించాలి. వస్త్రధారణ వంటి వేషధారణ అనుకరణ మాత్రమే. ఆయనేం చేశాడో అలా చేయగలగాలి. ఆయనెలా జీవించాడో అలా జీవించగలగాలి. దురాచారిని సైతం సాధువుగా మార్చివేసే సర్వ సమర్థత గలిగిన ఆ గురుని చరణాలు మనల్ని ఆయన పరిధిలోకి లాగేసుకుంటాయి. మనం చేయాల్సింది ఒక్కటే. ఆయన చెప్పినట్లు చేయడం. 'కరిష్యే వచనం తవ' 'నీవేమి చెప్తావో అది చేస్తాను.' అని అర్జునుడు చివరకు పలికాడు. అదే నిన్ను ఉన్నతస్థితికి చేరుస్తుంది అని మర్చిపోకూడదు.



ఆధ్యాత్మిక జగత్తుకీ, నిత్యజీవితానికి తేడా వుందనుకొనే భ్రమలో బ్రతుకుతున్నాం. నిత్యజీవితంలో ఆధ్యాత్మికతతో జీవించడం ఆ గురువుకు సర్వసమర్పణ చేసుకున్నట్లవుతుంది. సమర్పణ అంటే మరేం కాదు. ఉద్యోగి ఉద్యోగం చేస్తున్నంతసేపు అతని శరీరము, మనసు, బుద్ధి అతనిష్టానుసారము చేయడం లేదు. అలా చేస్తే ఉద్యోగంలోనించి పీకేస్తారు. అతని పైఅధికారి చెప్పినట్లు నడుచుకుంటాడు కదా ! అదే సమర్పణ గురువుపట్ల ఉంటే చాలు. ఆఫీసు నుంచి యింటికొచ్చాక యింట్లో కూడా అలా ఆఫీసులోలాగా ఉండక్కర్లేదు. అలాగే ఆధ్యాత్మిక సాధనలూ అవీ కూడా ప్రారంభంలో 24 గంటలు చేసెయ్యక్కరలేదు. ఓ మూడు నాలుగ్గంటలు ఆధ్యాత్మిక పరంగా మనసునీ, బుద్ధినీ, శరీరాన్నీ గురువు చెప్పిన పనికి ఉపయోగిస్తే చాలు. కనీసం రోజుకి నాలుగ్గంటలు గురువు చెప్పిన పనికి వెచ్చించగలిగే వారే ఆధ్యాత్మిక విద్యార్థులు. గురువులంతా దేవాలయాల్లో ఏ శక్తి అయితే లేదని చెప్తున్నారో దాన్ని మీరు ఈ సాధనలతో పొంది ఆ శక్తిని దేవాలయాల్లో తిరిగి ప్రతిష్ఠించాలి. పూర్వకాలం ఋషులు చేసిందదే. 'తీర్థీ కుర్వంతి తీర్థాని'. వాళ్ళవల్ల తీర్థక్షేత్రాలకి ఆపేరొచ్చింది. అనేక తీర్థ క్షేత్రాల్లో ఋషుల తపశ్శక్తి ధారపోశారు.' అన్నారు.

తపశక్తి తపస్సు ద్వారా పొందగలడం ఎలాగో విపులీకరించి యిలా చెప్పారు.

SIVA ప్రిన్సిపుల్‌ను ఇలా గుర్తుంచుకోండి !

(దీనికీ, శివుడికీ ఏమీ సంబంధం లేదు. ఉత్తినే ఆ అక్షరాల్లో గుర్తుండటం కోసం అలా చెప్పారంతే !)

S - సమయ సంయమనము I - ఇంద్రియ సంయమనము
V - వాక్ సంయమనము A - అర్థ సంయమనము.

ముందుగా S - సమయ సంయమనము సమయాన్ని ఎక్కడా కూడ వృధాగా ఖర్చు చేయకూడదు. ప్రతి సారి దీన్ని మనం చాలా జాగర్తగా

పరిశీలించుకొంటుండాలి. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఖాళీగా కూర్చోడం ఆధ్యాత్మికతకు పనికిరాదు. విరుద్ధమైనదిగా చెప్పబడ్డది. ఏదోక పని చేస్తుండటం చాలా అవసరం. 'నీరసంతో శోషవచ్చి పడిపోతే పడిపోండి గాని సోమరితనంగా కాలాన్ని వృథా చేయకండి !' అంటుంటారు గురుదేవులు దాని తీవ్రతను తెలియజేసేందుకు.

యింకా యిలా చెప్పారు 'డైరీ వ్రాసే అలవాటు చేసుకోండి ! ఎవరైతే ఆధ్యాత్మికతలో ఉన్నత పీఠాన్ని అధిరోహించాలనుకొంటున్నారో వారంతా తప్పకుండా డైరీ వ్రాసే అలవాటు చేసుకోక తప్పదు. దీన్ని మీరెంత త్వరగా ఆచరణలో పెడతారో మీ అదృష్టాన్ని బట్టి ఉంటుంది. ఏ మాత్రం యీ ముఖ్యాంశాన్ని అశ్రద్ధ చేయకండి ! అలాగే మీకొచ్చే కలలు కూడా నోట్ చేసుకోవడం నేర్చుకోండి ! ప్రతీ కలను ఓ పుస్తకంలో గుర్తున్నంతవరకు వ్రాసుకోండి ! సాధకుల కలలు ఎంతో మార్గదర్శనం చేస్తాయి. మీ తలగడ కిందనే ఓ నోట్స్ ఉంచుకోండి ! అది చాలా మంచి అలవాటు. మీ కొచ్చిన కల మీరు పుస్తకం కోసం, కలం కోసం వెతుక్కొనే సరికి మరుపుకు రావచ్చును. అందుకే యీ డ్రీమ్ నోట్స్‌ను తలకిందనే ఉంచుకోండి ! వెంటనే నోట్ చేసుకోవచ్చు.

యీ డైరీ రాయడం అనే అలవాటు వల్ల మరో ప్రయోజనమేమంటే ఏయే సమయాల్లో ఎంతెంత సమయాన్ని మనం వృధాగా కాలక్షేపం చేస్తూ వెళ్ళదీస్తున్నామో యీ డైరీ ద్వారా గుర్తించగల్గుతాం. తిరిగి ఆ తప్పు మళ్ళీ జరగకుండ జాగర్తపడతాం. ఇది ఎంతో ప్రయోజనకరమైన అలవాటు. యీ రోజునుండే దీన్ని అమలుచేయడానికి ప్రయత్నించండి !" ఇదంతా సమయ సంయమనం గురించి చెప్తూ చెప్పారు.

I - ఇంద్రియ సంయమనం : ఆత్మ కథలో శ్రీ పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్యుల వారేమన్నారంటే. 'నా స్వాదేంద్రియము, జననేంద్రియములను పూర్తిగా అదుపులో ఉంచుకొన్నాను. యీ కలిమాయ నుంచి బైటపడాలంటే అది ఎంతో అవసరము. నాలుక (స్వాదేంద్రియము) అదుపు తప్పితే రకరకాల రోగాలు కమ్ముతాయి. అలాగే జననేంద్రియం కూడ. దాన్ని దురపయోగం చేసుకొంటే అనేక సుఖవ్యాధులు శరీరంలో ప్రవేశించడమే కాకుండ జీవితం సర్వనాశనమవుతుందని గ్రహించాలి' అన్నారు.



V - వాక్ సంయమనం : 84 లక్షల జీవరాశులో యీ భూమీ్మద నోరున్న ప్రాణీ మనిషే. మిగతా వాటికి యీ వాక్ శక్తి యివ్వబడలేదు. యింకోటేమిటంటే అటు మనిషి కంటే క్రింది స్థాయి ఖనిజ, వృక్ష, జంతువులకు వాక్కు యివ్వబడలేదు. మనిషి కంటే పై స్థాయిలో ఉన్న యక్ష, గంధర్వ, కిన్నెర, నాగ, కింపురుష జాతులకూ వాక్కు యివ్వబడలేదు. మధ్యనున్న యీ మనిషికే యీ అద్వితీయమైన వాక్కు యొక్క శక్తి యివ్వబడింది. దీన్ని మనం చాలా జాగర్తగా అర్థం చేసుకొని వినియోగించుకోవాల్సివుంది. మాటల యీటెలతో ఎదుటివాడిని హింసించే వాడు యోగవిద్యకు అనర్హుడౌతాడు. యమ నియమాలను అధ్యయనం చేసిన మనకు అహింస గురించి తెలియాలి ! పదునైన శూలమో, కత్తో అక్కర్లేదు. మాటలతో యితరులను బాధించినా యోగవిద్య వంటబట్టదు. అలాంటి వారికి అయోగ్య విద్యే గతి. మీ వాక్కును ఎంతగా తక్కువ వాడుకొంటారో అంతగా తగ్గించి వాడండి ! అవసరమైన వాటికి తప్ప మిగతా ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు మాట్లాడకుండా మౌనంగా ఉండడం నేర్చుకోండి !ఎంతో శక్తి మీలో నింపబడుతుంది. యింకొక అతిముఖ్యమైనదేమంటే వాక్కును అదుపులో ఉంచుకోలేనివాడు ఐశ్వర్యవంతుడు కాలేడు. అసలు యీ సూత్రాన్ని మనం యావత్ సమానవజాతికీ తక్షణం తెలియజేయ గలగాలి. యీ సందర్భంగా మహాత్ములు తెలియజేస్తోన్న మరో సూత్రమేమంటే 'నీవు ఉచ్చరించని పదము నీ ముందు ఉచ్చరింపబడదు' ఇది ఎప్పుడూ మనం గుర్తుంచుకొంటూ మాట్లాడవలసివున్నది.

A - అర్థ సంయమనం : డబ్బును (ద్రవ్యాన్ని,) వనరుల్ని సవ్యంగా వినియోగించడం తెలియాలి. దుబారా చేయరాదు. పెళ్ళిళ్ళు పేరంటాలు, విందులు వినోదాలు పేరుతో ఎంతో డబ్బు వృధాగా ఖర్చు చేయబడటం చూస్తున్నాం మనం. అలాంటి అపవ్యయాన్ని చేయడం వల్ల ప్రకృతి యొక్క ప్రకోపానికి గురికావల్సివస్తుందని తెల్సుకోవాలి.

ఇది అసలైన తపస్సంటే. అలాంటి తపశ్శక్తి ఈ విశేష కాల ప్రభావం చేత ప్రతి ఒక్కరి దగ్గరకొచ్చి, ఏదో రూపంగా తట్టిలేపుతోంది. మన తలక్రిందులా లోచనలు మానేసి సమర్థ సద్గురుని ఆహ్వానాన్ని స్వీకరించగలమా ? మహామహులుగా తీర్చిదిదుతా మంటోన్న ఆ తపశ్శక్తిని లోనికి ఆహ్వానించగలమా ? అనేది మన అదృష్టాన్ని బట్టి ఉంటుంది.

'ఆహ్వానం మన దగ్గరకొచ్చినట్టూ, మన తలుపుకొడుతున్నట్టూ, మనల్ని తట్టిలేవుతున్నట్టూ మనకెలా తెలుస్తుందండీ ?' అనుకుంటారేమో చాలా స్పష్టంగా తెలుస్తుంది. ప్రతి భక్తుని జీవితంలో మనమా సంఘటనల్ని చదివాం. ప్రతి గురు చరిత్రల్లో, ఆత్మ కథల్లో స్పష్టంగా చూశాం. అదేమంటే దిక్కుతోచని పరిస్థితిలో, అంధకారమయంగా ఉన్నదీ అంటే ఖచ్చితంగా అదే గుర్తు. దాన్ని కొండగుర్తుగా తీసుకోవచ్చు. యిదొక నిదర్శనం. మమ్మల్నెవరూ ఆదుకోవట్లేదు మమ్మల్నెవరు కాపాడతారు? ఈ అయోమయ పరిస్థితి నుంచి నన్నెవరు బయట పడేస్తారు ? అన్న ప్రశ్న - కలవరపాటు - ఆందోళన - భయం ఎవరి జీవితంలో తటస్థపడ్డదో వారాక్షణంనుంచి ఆ అఖండమండలాకారుడైన గురుని అనుగ్రహ పరిధిలోకి వచ్చినట్లే. చాలా స్పష్టంగా చెప్పారీ విషయాన్ని.

యోగి అరవిందులు చిన్నప్పటినుంచీ విదేశాల్లో పెరిగాడు. నడి వయసులో భారతదేశం రావడం జరిగింది. ఆంగ్లేయుల పరిపాలన నడుస్తోందిక్కడ. ఓ బ్రిటీష్ కలెక్టరు అరవిందుని మిత్రుణ్ణి ఏదో నెపం



మీద హింసించి చంపేశాడు. కోపోద్రిక్తుడైన అరవిందో బ్రిటిష్ పోలీస్ అధికారులపై బాంబులు వేస్తాడు. పరిస్థితి విషమించి అరవిందుని అదుపులోకి తీసుకున్నారు. జైల్లో పెట్టారు. ఉరి తీయమని తీర్పు వచ్చింది. రేపోమాపో అది అమలుకానుంది. గట్టి బందోబస్తు మధ్య మగ్గుతోన్న అరవిందుని భగవద్గీత శ్లోకం తట్టిలేపింది. ఆ అరవిందులే మహర్షిగా సమస్త బంధనాలనీ తెంచుకొని మన మధ్య చిరంజీవిగా నేటికీ వెలుగొందుతున్నారు. ఒకరుగాదు యిద్దరు గాదు. ప్రతి ఒక్క యోగి అలాంటి స్థితి నుంచి వేడి వేడిగా తయారుచేయబడ్డవాడే.

ఓ ముసలాయన్ని చూస్తాం. మనం గూడా ముసలాళ్ళమై అలాంటి పరిస్థితుల్లోకి రాబోయే వారమేనని ఆలోచించం. అదీ మాయంటే. ఓ రోగగ్రస్తుణ్ణి చూస్తాం. ఎప్పుడోప్పుడు మనక్కూడా ఆరోగ్యం క్షీణించవచ్చని ఆలోచించం. అదే మాయంటే. ఓ చనిపోయిన వాణ్ణి చూస్తాం. మనం కూడా ఎప్పుడో అప్పుడు మనవాళ్ళనందరినీ హఠాత్తుగా ఉన్న ఫళాన వదిలేసి చచ్చిపోతాం అని ఆలోచించం. మిగతావన్నిటికీ గ్యారంటీ లేదు గానీ చావడం మాత్రం గ్యారంటీ. మన మెంత పెద్ద మాయలో ఉంటామంటే ఆలోచించాల్సింది అలోచించం. భయపడాల్సిన వాటికి భయపడం. ప్రాధాన్యత నివ్వాల్సిన వాటికివ్వం. అసలైన వైరాగ్యమంటే మనదేనేమో ననిపిస్తుంది.

'ఒక్క క్షణం మాయామోహితంగా ఉన్నటువంటి, లక్ష్యరహితంగా సాగుతున్నటువంటి మీ ఆలోచనల ప్రభావాన్ని ఆపి మౌనంగా ఉండండి. అప్పుడు తప్ప గురుఅనుగ్రహం మీలో ప్రవేశించలేదు' అంటుంటారు గురుదేవులు. 'అమ్మో! అలా మౌనంగా కూర్చుండిపోతే నా కుటుంబమేమౌతుంది ? నా బాధ్యతలేమౌతాయి ? అని అనిపించవచ్చు. గురువనుగ్రహాన్ని మీరు మౌనంగా ఉండి మీలోకి స్వీకరించండి అంతే. మీరు మీ బాధ్యతల్ని యిప్పటికన్నా చాలా చక్కగా పూర్తిచేయగలుగుతారు. మీరు మీ కుటుంబాన్ని యిప్పటికన్నా ఎంతో సుఖశాంతులతో నింపగలుగుతారు. గురువు యొక్క సర్వ సమర్థత

మీద నమ్మకముంచండి. మన సంగతి మనకంటే ఆయనకే బాగా తెలుసని, ఆయన సర్వజ్ఞత్వం మీద విశ్వాస ముంచండి. 'ఆయనెక్కడో పరలోకంలో ఉన్నాడనీ, ఈ భూమ్మీదున్న నేను, నా కుటుంబం ఆయన దృష్టిలో కెళతామా ?' అని భ్రమపడకండి. సర్వవ్యాపకుడైన నీ గురువు నిన్నూ - నీ కుటుంబాన్నీ వదిలి ఎలా ఉండగలడు ? ఆయన సర్వవ్యాపకత్వం మీద భరోసా ఉంచండి చాలు" అని చెప్పారు.

అలాంటి గురువు పట్ల మనమెంత ఎక్కువగా విశ్వాసం చూపించగలిగితే మన పరిస్థితులు అంత ఉన్నతంగా మారిపోతాయి. మనకెదురయ్యే పరిస్థితుల్లో ఆయన అనుగ్రహం స్పష్టంగా కనిపిస్తుంటుంది. అంటే మనం అనుకున్నట్లు జరుగుతుందా ? జరిగితే మంచిదే. జరక్కపోయినా మరేం ఫరవాలేదు. ఆ పరిస్థితి మనకి ఆ గురువే కల్పించాడు.

కంటి చూపు తగ్గిందని డాక్టరు దగ్గర కెళితే 'శుక్లాలున్నాయి. ముదరాలి అంటాడు. ముదిరాక ఆపరేషన్ చేసి తీసేస్తాన'ంటాడు. 'ఈయనేం డాక్టరు ? చూపు సరిగా లేదు మొర్రో అంటే అలాగే కొన్నాళ్ళు అఘోరించు అంటాడేమిటి ?' అనుకోవట్లేదు మనం. ముదరకుండా ఆపరేషన్ చేసేస్తే కళ్ళు శాశ్వతంగా పోయే ప్రమాదముంది. బాధలు, కష్టాలు వచ్చాయంటేనే ఖచ్చితంగా గురువనుగ్రహంతోనే అదిసంభవము.

గురుదేవులు శ్రీ పండిత శ్రీ శ్రీరామశర్మఆచార్యుల వారు చాలా అద్భుతమైన ఉదాహరణ చెప్తారు. గురువు యొక్క అనుగ్రహానికి పాత్రులైనవారి జీవితం తుఫాను గాలికి ఎండుటాకు మురికి కూపంగా ఉన్న పరిసరాల్లోనించి అదుపు తప్పి అమాంతంగా అలా లేచి వెళ్ళి ఎక్కడో పడుతుంది. మీ జీవితాలు అలా పైపైకి లేస్తాయి. గురువను గ్రహం కోసం తపించండి. జీవితాలు నందనవనంలా మారిపోతాయి. అలాంటి గురువుల సమక్షంలో మీరు మీ పిచ్చి పిచ్చి మోహాలతో



అర్థం లేని కోరికలతో అలాగ కూర్చోకండి. తుఫాను గాలైనా ఎండుటాకు అదే ఊపులో ఎగరకుండా ఏ రాయినో పట్టుక్కూర్చుంటే గురువైనా ఏమీ చేయలేడు. అది ఎంత బాగా అర్థమైతే మన జీవితాలంత ఉన్నతంగా తీర్చిదిద్ద బడతాయన్నారు.

ప్రాథమిక స్థాయి విగ్రహారాధన స్థితినుంచి ఎదగాలి. అంతర్ముఖం అవగలగాలి. ఈ సందర్భంగా గురువులందిస్తోన్న పరమ సత్యమైన విషయమేమంటే చక్కటి అవగాహనతో మీరు చేసే సాధనలకు ఋషులిస్తున్న గ్యారంటీ ఏంటంటే మూడే మూడు రోజుల్లో మీరెంతో గొప్ప శక్తిని స్పర్శించ గలుగుతారు. మూడే మూడు రోజులు మౌనంగా ఉండగలిగితే ఆ మౌన స్వరూపశక్తిని దర్శించగల్గుతారు. ఈ విశేషకాలం యొక్క అమోఘప్రదమైన ప్రకృతి నియమమిది. మౌనాన్ని ఆ మూడు రోజులపాటు శక్తివంతమైన మౌనంగా పాటించాలి. గురుని అనుగ్రహం కోసం తపించాలి. మూడు రోజులు చాలు. అంతకన్నా అవసరం లేదంటున్నారు. ఏ దేవతా సాక్షాత్కారాన్నైనా మీరు ఆ మూడు రోజులలో పొందవచ్చు.

సకల దేవతా అనుగ్రహ ప్రదాయిక శ్రీరామకృష్ణ పరమహంస ఫిబ్రవరి 18వ తేదీ 1836వ సంవత్సరం మన బోటి వారి కోసం ప్రకృతిలో ఉన్న అనేక దేవతాశక్తుల్ని భూమ్మీదకి దింపారు. "ఈ ప్రపంచంలో నాకింకేమీ వద్దు. దేవతాశక్తుల్ని మాత్రమే నేనారాధన చేస్తాను." అదే వారు జీవితంలో చేసిన ఏకైక సాధన. దాని ఫలితంగా అనేక దేవతాశక్తుల్ని మన మధ్యకు దింపారు. యుగద్రష్ట అయిన శ్రీ పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల ముందరి జన్మలో జరిగినదా విశేషం. శ్రీరామకృష్ణ పరమహంసగా తానే ఆ జన్మలో దింపుకొన్న అనేక దేవతా శక్తుల్నించి 24 శక్తుల్ని గాయత్రీ పరమైన చతుర్వింశతి గాయత్రీ రూపాలుగా మన కందించారు. నిజంగా మనమెంత అదృష్ట వంతులమో కదా ! మన గురుమూర్తులు ఎంతటి కరుణాసముద్రులో కదా !

దేశ రాజధాని ఢిల్లీకి వెళ్ళి ప్రధానమంత్రిని కలవాలంటే చాలా పెద్ద తతంగం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో బహుశ వీలుపడకపోవచ్చు కూడా. అదే ప్రధానమంత్రి ఏ ప్రారంభోత్సవానికో మన ఊరొస్తే ఓ ఎమ్. ఎల్. ఏ ద్వారానో, ఎవరి ద్వారానో మనం ఆయన్ని కలవ్వచ్చు. అదే విధంగా ఓవర్‌మైండ్ లెవల్లో ఉన్న దేవతా శక్తుల్ని మనం నేరుగా అందుకోలేం. అలాంటిది పరమ దయామూర్తులు, కృపాసాగరులైన గురువులు శ్రీరామకృష్ణ పరమహంస, మహర్షి అరవిందో వంటి సర్వ సమర్థులు మొత్తం ప్రకృతిలో ఉన్న సమస్త దేవతాశక్తుల్ని భూమ్మీదకి దింపడం జరిగింది. ఈ మఠం గొప్పదా ? మా మిషన్ గొప్పదా ? అనే మీమాంసలతో జీవితాల్ని ఊడ్చుకుంటూ గడిపేస్తున్న వారనేకమంది ఉన్నారు. వారి వారి గురువులందించిన రహస్య సమాచారాల్ని వంట బట్టించుకున్నదెవరు ? ఆ రహస్య సాధనలు అర్థమైంది ఎందరికి ? సమస్త దేవతా శక్తులూ, సకల సమర్థ సద్గురువులు మన చుట్టూరా ఉన్నా మనం అశాంతితోనో, అనారోగ్యం తోనో ఉన్నామంటే అది మన చేతగాని తనం. శ్రీరామకృష్ణ పరమహంస కాళీమాతను నేరుగా భూమ్మీదకి అవతరింపజేశారు. తరువాత తరువాత మెల్లిమెల్లిగా మూడేసి రోజుల్లో సమస్త దేవతా శక్తుల్నీ మన మధ్యకు తెచ్చారు. చాలాకాలం పట్టిందాయనకు పాపం. కానీ ఆ దేవతా శక్తుల్ని పలికించుకోవడానికి అప్పుడాయనకి పట్టినంత సమయం మనకిప్పుడు పట్టదు. ఐన్‌స్టీన్‌కి $E = MC^2$ అనే సూత్రం కనిపెట్టేందుకు చాలా కాలం పట్టింది. యిప్పుడు కాలేజీల్లో లెక్చరర్స్ ఈ సూత్రం గురించి క్లాసుల్లో చెప్పేస్తున్నారు. అంటే వాళ్ళు ఐన్‌స్టీన్ కన్నా గొప్పవాళ్ళనా ? పడాల్సిన కష్టం వాళ్ళుపడి మనకందుబాటులోకి తెచ్చిన మహనీయులు 'స్వల్పమైన సాధనచేసి ఆ దివ్యశక్తుల్ని పలికించుకోండ'న్నారు. ఆర్తితో పిలిస్తే పలుకుతాయవి. మన శ్రద్ధను పరీక్షిస్తాయవి. ఆర్తి, శ్రద్ధ మనమెంత త్వరగా తెచ్చుకోగలిగితే అంత త్వరగా గురు ప్రసాదాన్నందు కోగలం. యిందులో ఎలాంటి సందేహమూ అక్కర్లేదు.



జిల్లెళ్ళమూడి అమ్మ 'బాధల భగవంతుణ్ణి' అనేవారు. భక్త జనులు కంగారు పడ్డారు. అనుగ్రహం కష్టాల రూపంలో, బాధల రూపంలో, తలుపు తడుతుందంటే కాస్త భయమేసినా మరి ఆ వాస్తవాన్ని జీర్ణించుకోగలగాలి. సైన్సు ఏం చెప్తుందంటే భూమ్మీదున్న ప్రతివ్యక్తీ పిల్లవాడుగానీ, పెద్దవాడుగానీ కొన్ని వందల టన్నుల బరువుగల గాలిని మోస్తున్నామని. యిది నమ్మశక్యంగా ఉందా ? కానీ పరమవాస్తవం అది. నాలుగైదు కిలోల స్కూల్‌బ్యాగ్‌ని మోసే విద్యార్థిని చూసి 'పాపం పిచ్చి వెధవ' అనుకుంటాం. అంతకన్నా యింకా చిన్న పిల్లాడుసైతం నెత్తిమీద కొన్ని వందల టన్నుల బరువైన గాలిని మోసుకుంటూ తిరుగుతున్నాడంటే ఎంత వాస్తవ దూరంగా అనిపిస్తుందో యిదీ అంతే. పుట్టిన క్షణం నుంచీ అలవాటుపడిపోయాం గాలి బరువు నెత్తిమీద మోయడానికి. అలాగే గురువనుగ్రహం పొందడానిక్కూడా మనం అలవాటు పడాలి. కష్టాల్ని, బాధల్ని ఎదుర్కోవాలి. అందుకే శ్రీ పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్య ఓ సందర్భంలో అన్నారు. 'పిచ్చివాళ్ళల్లారా ! ధైర్యము లేనివాడికి మోక్షము లభించదు. మీరనుకునే ముక్తీ దొరకదు. సాహస వంతులు మాత్రమే భగవంతుని చేరగలుగుతారు. వీరులకే స్వర్గము. పిరికివారు యిటూ పనికిరారు. అటూ పనికిరారు. ధైర్యం తెచ్చుకోవడమంటే గురువు పట్ల - అతని మాటల పట్ల విశ్వాసం చూపడమే.' అంతకన్నా వేరేంలేదు.

'అఖండ మండలాకారుడైన ఆ గురుని స్పర్శ 'మౌనం' లోనే లభిస్తుంది. ఆ మౌనం ద్వారానే మీ ప్రతి సమస్యకూ పరిష్కారం దొరుకుతుంది. ఆధ్యాత్మిక జగత్తులో మొట్టమొదటిసారి ప్రవేశపెట్ట బడిన ఓ విధానం మీ పై ప్రయోగించబడుతోంది. జగద్గురువు శ్రీకృష్ణుడే నాడు బీజాలు వేశాడు. అదివరకు రోజుల్లో అంత తొందరుండేదిగాదు. 'ఓ పది జన్మలు మౌనంగా ఉండవయ్యా ! తరువాత ఆలోచిద్దాం !' అన్నట్టుండేది. ఈ విశేష కాల ప్రభావం చేత ఋషుల యొక్క దృష్టికోణం కూడా మారింది. కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకునేందుకు

ప్రయత్నించండి ! ఈ పరిస్థితి పృథ్వి మీద యింతకు ముందెప్పుడూ రాలేదు. అందుకే ఫలానా దాని మాదిరిగా అని చెప్పలేకపోతున్నాము. భౌతిక శరీరంతోనే అమరత్వాన్ని సాధించగలిగే తొలి ప్రయత్నం సాగుతోంది. అసంభవాలను సంభవాలుగా మార్చగలిగే ఋషుల యొక్క ప్రణాళికలో భాగమది.

భారతదేశాన్ని జగద్గురు పీఠం మీద కూర్చోపెట్టబోతోన్నవారు మీరే. ఈ పృథ్విని స్వర్గంగా మార్చబోతున్నది కూడా మీరే. ఎవరో స్వర్గం సృష్టించి యిస్తే దాన్ని నరకంగా మార్చేసుకుంటారు నేటి మానవులు. సంపూర్ణ మానవ జాతినే దేవతలుగా మార్చేయగలిగితే అప్పుడేర్పడబోయే స్వర్గీయ వాతావరణం చిరస్థాయిగా మిగిలిపోతుంది" అని చెప్తూ 'ఏదేదో గొప్ప గొప్పగా చెప్పేస్తున్నారు మాష్టార'నుకుంటు న్నారేమో ! చాప కింద నీరులా జరగాల్సినవన్నీ జరిగిపోతున్నాయి. ఈ మహాశూన్యోపాసన అనే రహస్యోపాసనను శ్రద్ధగా మొదలుపెట్టిన ప్రతి ఒక్క సాధకుడికి వారం తిరిగేలోగా గురుని సందేశాలు అందడం మొదలెడతాయి. అక్కడ కొంచెం జాగ్రత్తగా ఉండాలి. మొదట సందేశాలు గురువునించే వస్తాయి. కానీ తరువాత తరువాత ఆ సందేశాలు మీ అహంకారం నించి వస్తున్నాయేమో చూసుకోవాలి జాగ్రత్తగా. అది మీరే చూసుకోవాలి. గురువు పనికాదు. అది మీపనే.

ప్రతి సమస్యా, బాధా కష్టమూ ఖచ్చితంగా మిమ్మల్ని మంచి వైపుకే నెడుతుంది. భయపడకండి. అభయముద్ర అందుకోసమే. ఆపాటి విశ్వాసం మనం ఆయనపై వుంచితే చాలు. ఖచ్చితంగా మీ సమస్య పరిష్కారం, మీ రోగానికి మందు, మీ బాధకి నివారణోపాయం ప్రకృతిలోంచే దొరుకుతుంది. ప్రకృతంటే నీవు - గురువు తప్ప ప్రతి వ్యక్తీ, ప్రతి జీవి, ప్రతి సంఘటనా ప్రకృతే. 'యింకోళ్ళు చెప్పినట్టు నేను వినాలా?' అనే అహంకారం లేకుండా మన చెవుల్ని కాస్త ప్రకృతి వైపుంచగలిగితే ఆ గురువనుగ్రహంతో ప్రతి ప్రశ్నకూ జవాబు ప్రకృతిలోంచే వినిపిస్తూంటుంది. అది నేర్చుకోవాలి మనం. ఏ క్షణానికా క్షణం మనమేం చేయాలో



కూడా చెప్తుంటుంది. అంతేకాదు ప్రకృతి యొక్క ప్రతి అణువునుంచీ మనకి గురువు యొక్క మార్గదర్శనం లభిస్తూనే ఉంటుంది. యిలాంటి విద్య యింతకు ముందెప్పుడూ యింత స్పష్టంగా అందించబడలేదు. మొట్టమొదటిసారి ఈ రహస్యోపాసనను అందుకుంటున్నవారు నిజంగా ధన్యులే మరి.

మరో ఆధ్యాత్మిక రహస్యమేంటంటే మీ సమస్య లేక బాధ ఎప్పుడూ కూడా పైకి చెప్పకండి. వైఖరీ రూపం అంటే వాక్కు రూపం యివ్వద్దు. 'నాకిలా కష్టమొచ్చింది. నాకీ బాధుంది' అని మీరు చెప్పుకున్నారో ఆ సమస్యో, రోగమో పెద్దదై కూర్చుంటుంది. జటిలమవుతుంది. అందుకే ఆ సమస్యని లేక ఆ బాధను వ్రాతపూర్వకంగా తెలియజేయండి. వెంటనే దాని తీవ్రత తగ్గటం ప్రారంభమై త్వరలో నివారింపబడుతుంది. యిది ప్రకృతి నియమంలోని రహస్యం.

అలాగే ఆలోచనలు కూడా ఓ రకమైన వాక్ రూపమే. కనుక మీకొచ్చిన కష్టం గురించి ఆలోచించకండి. కళ్ళుమూసుకొని మౌనంలోకి వెళ్ళిపోతే జీవితాలకు జీవితాలే యిలా ఉన్నవి అలా మారిపోగలవు. మౌన స్వరూపుడు, ఆ మహాశూన్య స్వరూపుడు అయిన ఆ గురువు ఓ మామూలు ఊరును రాత్రికి రాత్రే ఉన్నఫళంగా సుధామనగరుగా మార్చేశాడు. అలాంటి సర్వసమర్థుడికి మీ జీవితాల్ని శాంతిమయంగా మార్చడమెంత ? ఎటొచ్చీ వాళ్ళని మార్చనివ్వాలి మనం. ఆ శక్తికి లొంగిపోగలగాలి. ఆ ప్రవాహంతో పాటు కొట్టుకు పోగలగాలి. ఏ రాయినో పట్టుక్కూచో కూడదు. ఆ తేలికతనాన్ని,(easyness) ఆ కరుణారసాన్ని, ఆత్మీయతను, ప్రేమను, ఆనందాన్నీ అనుభూతి చెందగలగాలి. ఆనందం వల్ల, ఆ గురుని స్పర్శ వల్ల ఆవేదన పొంగి కనుల వెంట నీరు పొంగినా ఆపుకోనక్కరలేదు. అంతకంటే అద్భుతమైనటువంటి, ప్రేమమయమైనటువంటి స్పర్శ మనకెప్పుడూ లభించదు. ఆ కన్నీళ్ళు మనలోని కషాయ కల్మషాలను కడిగేసేవే. సిగ్గుపడక్కరలేదు. హాయిగా ఏడ్చేయవచ్చు. ఎవరొప్పుకున్నా ఒప్పుకోకపోయినా అవునన్నా, కాదన్నా

మనమంతా ఒకే గురుత్వం యొక్క శిష్యులమే. హాయిగా ఆ మహాశూన్యంలో తేలిపోతూ సాగిపో గలగాలి. అదే అసలైన ఆధ్యాత్మికత. వారే నిజమైన అదృష్ట వంతులు.

రాబోయే 25000 సం॥రాలకు యీ మానవజాతి ఎలాంటి ప్రగతి సాధిస్తుందో తెలియజేస్తూ జ్వాలాకూల్ మహర్షి 24 మహా గ్రంథాల్ని రచించాడు. గురువులే ఆశ్చర్యపోతోన్న విషయమేమంటే 1921 వ సం॥రం తర్వాత పుడుతోన్న వాళ్ళలో మహామహులున్నారట. ఓ లక్ష సం॥రాల తర్వాత పుట్టాల్సిన వాళ్ళు యిప్పుడే జన్మించేస్తున్నారట. పరిణామక్రమాన్ని వేగవంతం చేయబోయే అద్భుత కార్యక్రమం ముమ్మరంగా సాగిపోతుంది..

యిక్కడ గురుదేవులు భగవాన్ శ్రీ మూరెళ్ళ శ్రీరామకృష్ణ గారు అందిస్తున్న మహత్తరాంశాల్ని కాస్త జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి. అపసవ్యంగా ఉన్న మన దృష్టికోణాన్ని, సవ్యమైనదిగా తీర్చిదిద్దేందుకు వారు చేస్తోన్న ప్రయత్నం నిజంగా మాటలతో చెప్పలేనటువంటిది. అందుకు మనం వారికేమిచ్చి ఆ ఋణాన్ని తీర్చుకోగలమో కదా ! అనిపిస్తుంటుంది. యిప్పుడు చెప్పబోయే విషయాల్ని మనసులో నాటుకునేలా చేసుకోగలిగితే అసలైన యోగసాధనకు పనికొచ్చే అద్భుతమైన సోపానాలుగా మారగలవు. మనము ఏ రైల్లోనో దూరప్రయాణం కోసం రైల్వేస్టేషను కొచ్చి ఫ్లాట్ ఫాం మీద కెళ్తాం. అక్కడ మనలాగానే చాలామంది మనమెళ్ళే వైపుకే వచ్చే వాళ్ళుంటారు. వాళ్ళలోని కొందరు వారి-వారి బంధువుల్ని సాగనంపేందుకొచ్చిన వాళ్ళుంటారు. అలాంటి వారి మీద కన్నా మనం మనతో పాటే దూరప్రయాణం చేసి మనమెళ్ళబోయే ఢిల్లీయో, బొంబాయో వచ్చే వాళ్ళమీద మన మనసులో ఓ రకమైన స్నేహభావం ఏర్పడుతుంది. అలాంటి భావన ఐదు, పది నిమిషాలు ప్రయాణం చేసి పక్క స్టేషనులో దిగిపోబోయే వారి మీద రాదు మళ్లీ. మనతో పాటు చివరి వరకూ (గమ్యం వరకు) వచ్చే తోటి ప్రయాణీకులతో మనం ఎలాంటి భావన,



దగ్గరితనం ఏర్పరచుకుంటామో అలాంటి భావమే ఆధ్యాత్మిక సాధనలూ అవీ చేస్తున్న తోటి వారితో ఉంచుకోవాలి. వారు తప్ప మిగతా వాళ్ళందరినీ పక్క స్టేషన్లో దిగిపోయే వాళ్ళలానే వాళ్ళతో ప్రవర్తించ గలగాలి. ఆఖరికి వాళ్ళు బంధువులైనా, కుటుంబ సభ్యులైనా సరే. దీన్ని మనం కాస్త జాగర్తగా అర్థం చేసుకోవాలి !

బాధ్యత పేరు మీద మన మనేక పనులు ఒక ప్రణాళిక ప్రకారం మొదలుపెడుతుంటాం. అది నిజంగా బాధ్యతైతే ఫరవాలేదు గానీ **మోహంతో అయితే మాత్రం మొత్తము మీ ఆధ్యాత్మిక జీవితం గంగలో దిగుతుంది.** కాబట్టి చాలా దగ్గర పోలికతో నిరంతరం భ్రమింపజేసే బాధ్యత - మోహములను చాలా జాగ్రత్తగా గుర్తించగలగాలి.

సమాజపరంగా కొన్ని పచ్చి నిజాలు మనకి తెలియాలి. నీ వ్యక్తిగత జీవితం ఏమైపోయినా ఆఖరికి మీరు చితికిపోయి నాశనమైనా సమాజానికే మాత్రమూ పట్టదు. **మీరేమైపోతున్నా ఈ సొసైటీ కనవసరం.** అంటే ఈ సొసైటీకి మీ వ్యక్తిగత జీవితంతో ఏ మాత్రం సంబంధం లేదు. మీ యిల్లంతా తవ్వుకొని, ఆ మట్టి ఏ పెరట్లోనో పోసుకుంటే ఎవ్వడూ ఏమనడు - పట్టించుకోడు. అలాకాక రోడ్డుకడ్డంగా పోస్తే అందరూ మాట్లాడేవాళ్ళే. ఈ తేడా చాలా జాగ్రత్తగా గమనించాలి. ఆధ్యాత్మిక సాధనలో ఉన్నతి సాధించాలంటే కొన్ని సత్యాలు మనకర్థం కావాలి !" అని చెప్తోన్న గురుదేవులు "వ్యక్తిగతంగా మీరేమైపోయినా పట్టించుకోని సమాజానికి ప్రాధాన్యతనివ్వడం - దాన్ననుసరించడం సబబేనంటారా ?" అని ప్రశ్నించారు.

ఢిల్లీ మహానగరంలో చదువుకుంటూ ఏ సెలవలకో మా యింటికొచ్చారు మా బంధువుల పిల్లలు ఓ సారి. తెల్లరాక వాళ్ళలో ఓ పిల్లాడు గబగబా మిగతా పిల్లలందరినీ చెయ్యిపుచ్చుకు లాక్కెళ్ళి వాకిట్లో ఉన్న దాని గురించి ఆశ్చర్యంగా చూపిస్తున్నాడు. 'ఏమైవుంటుం దబ్బా !' అని చూడ్డానికెళ్ళాను. బయట ఓ టెలిఫోన్ స్తంభం దగ్గర

గేదె ఉంది. ఆ పిల్లాడు నన్ను చూసి 'అంకుల్ అదేంట'నడిగాడు. నాకు గుర్తులేదు నేనేం చెప్పానో ఆశ్యర్యపోవడం మాత్రమే గుర్తుంది.

విదేశీ చదువులపై వ్యామోహం వెర్రితలలు వేసింది. వినాశనానికి దారితీసింది. పసిపిల్లల జీవితాలతో ఆడుకుంటోంది. వాళ్ళని వెర్రివాళ్ళని చేసి ఆడిస్తోంది. పై సంఘటన ఋజువు చేసిన అంశాలివి.

మళ్ళీ మాష్టారే ఓ సందర్భంలో యిలా చెప్పారు. ఓ సారెవరింటికో వెళ్తే అక్కడ గుమ్మంలో చదువుకుంటున్న పిల్లాడు మాష్టార్ని టైమడి గాట్ట. 'ఏడున్నరయిందన్నా'రట మాష్టారు. పిల్లాడు అయోమయంగా మొహంపెట్టి 'అంటే ఎంత అంకుల్ ?'అన్నాట్ట. దీన్ని బట్టి మనకేమర్థ మవుతోంది ? యిది మాష్టారి అనుభవం. మనక్కూడా యిలాంటి అనుభవాలు ఎదురయ్యే ఉంటాయి. పెద్దగా పట్టించుకోం మనం.

ఏ పెళ్ళిళ్ళల్లోనో, పేరంటాల్లోనో మహిళామణుల గుంపులో యిదివిని పిస్తుంటుంది. ఏంటంటే 'మా అమ్మాయికి తెలుగు మాట్లాడటం రాదండీ !' ఈ మాట అంటున్నప్పుడు ఆమె మొహంలో సిగ్గు, బిడియం లాంటి వాటికి బదులు స్పష్టత, స్వచ్ఛత, గర్వము తొణికిసలాడు తుంటాయి. ఏదో ఇంగ్లీషు పేరుతో ఉన్న పబ్లిక్ స్కూల్లో, ఇంగ్లీషు మీడియంలో చదువుతున్న వాళ్ళమ్మాయిని వాళ్ళనాన్న చేర్పించాట్ట అక్కడ. అతనికి పొట్టబొడిస్తే ఇంగ్లీషు ముక్క రాదు. ఏ వీధి బడిలోనో చదివుంటాడు. పిల్లలకుమాత్రం తెలుగుతప్ప అన్నీ నేర్పించాలని ఉంటుంది. పుట్టీ పుట్టకముందే ఇంగ్లీషు మీడియంలో పడేస్తేసరి. వాళ్ళ తిప్పలు వాళ్ళుపడి, చచ్చీచెడీ 'ఇంగ్లీషు వాళ్ళకిమల్లె తయారవకపోతారా' అని యీ వీధిబడి తండ్రి దుష్ట ఆలోచన.

యిలాంటి వారి పిల్లలంతా ఓ సారి ఒక యజ్ఞానికొచ్చారు. What is this uncle ? ఈ బ్రిక్స్ (Bricks) ఫైరూ (Fire) ఏంటి ?' మీ చాదస్తం కాపోతే అన్నట్టుగా. ఇంగ్లీషు దొరల్ని అనుకరించేందుకు తెగ



ప్రయత్నించారు. నలుగురితో కలిసి ఓంకారాన్ని ఉచ్ఛరించాలంటే చచ్చేంత సిగ్గుపడ్డారు. యజ్ఞమైపోయాక ప్రదక్షిణలు చేసేందుకు రావాల్సి వస్తుందని ప్రసాదం కూడా తీసుకోకుండా వెళ్ళిపోయారు. ఏ జన్మలోనో మూట గట్టుకున్న పాపం ఈ జన్మలో అజ్ఞానంగా మనలో ప్రవేశించి భస్తూ, బ్రతుకుతున్న మనం మన పిల్లల లేలేత జీవితాల్ని, బంగారు భవిష్యత్తును కేవలం సమాజం కోసం, పనికిమాలిన విద్యకోసం భ్రష్టత్వపు చదువులు చదివించి, దేనికీ పనికిరాని, ముఖ్యంగా గురువుల అనుగ్రహానికి, దేవతల ఆశీర్వాదానికి జన్మ జన్మలకీ నోచుకోనీయకుండా చేయడం తల్లిదండ్రులకు పిల్లల పట్ల ప్రేమను తెలియజేస్తోందా ? ద్వేషము, కసిని తెలియజేస్తోందా ? అలాంటి తల్లిదండ్రుల్ని పిల్లల బంగారు జీవితాల్ని నాశనం చేసిన పాపం జన్మజన్మలు వదిలిపెట్టదు.

దయామయులైన ఋషులు త్వరలో ఈ విద్యావిధానాన్ని సమూలంగా ఎత్తి వేయబోతున్నారు. ముఖ్యంగా ఈ రెసిడెన్షియల్ కాలేజీలు, అర్థం లేని చదువులూ, బట్టీ పట్టించే స్కూళ్ళూ అవీ, పై ఎత్తునున్న యూనివర్సిటీల వంటి మొత్తం విద్యాసంస్థలన్నీ ఋషుల శాపానికి గురవబోతున్నాయి. పెనుగాలుల్లో ఎత్తి వేయబడుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ప్రాణవిద్య అందించబడుతుంది.

'లెడ్‌బీటర్' అనే ఓ ప్రముఖ రచయిత, భవిష్యద్రష్ట The beginings of the sixth route rays అనే పుస్తకంలో యింకా ఎంతో సమాచారాన్నందించారు. పరమ గురువులంతా దాన్ని సమర్థించారు. అతి సమీప భవిష్యత్తులో కొన్ని కుటుంబాల్ని మనం చూడబోతున్నాం. అలాంటి కుటుంబాల వారు ఎక్కడెక్కడ నివసిస్తున్నారో గుర్తించి ప్రజలు తండోప తండాలుగా వెళ్ళి చూసి వస్తుంటారు. ఆశ్చర్యపోతూ వారిలో వారు తర్జన భర్జనలు పడుతుంటారు. మనమెందుకు వాళ్ళలాగా జీవించలేకపోతున్నాం? వీళ్ళెప్పుడూ యింతహాయిగా ఆనందంగా, రోగమంటే ఏంటో తెలియకుండా ఎలా ఉండగలుగుతున్నారు ? పరమ ఆశ్చర్యకరమైన విషయమవుతుంది వాళ్ళకి. పోనుపోనూ యీ విచిత్రకుటుంబాలు

నగరాలుగా సంతరించుకుంటాయి. ప్రస్తుతం దివ్యాత్మలంతా ఆ నగర నిర్మాణానిక్కావలసిన వ్యక్తులకోసం ఒక్కొక్కరినీ, ఒక్కొక్కరినీ ఏరుకుంటున్నారు. ఏ మాత్రం ఉత్సాహం వున్నా బ్రతిమిలాడుకొంటూ యీ సమూహంలో చేర్చుకొంటున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో మంచి పట్టు సంపాదించుకున్న సంస్థ శ్రీ పండితశ్రీశ్రీరామశర్మ ఆచార్య తయారుచేశారు. శాంతికుంజ్ - హరిద్వార్‌లో ఉన్న గాయత్రీపరివార్ - బ్రహ్మ వర్చస్ శోధ్ సంస్థాన్ యిలాంటివెన్నో స్థాపించారు. దీనితోపాటు సమానమైన మరో పెద్ద సంస్థ మహేష్ యోగి సంస్థ. ఈ రెండింటి యొక్క శాఖోపశాఖాలే మిగతా సంస్థలన్నీ అన్న సంగతి మనం గుర్తించాలి. ఈ పరమ సత్యం ప్రతీ ఆధ్యాత్మిక సంస్థకీ, ప్రతి ఆశ్రమానికీ, ప్రతి సమూహానికి తెలియాలి. ఎంత తొందరగా తెలుసుకోగలిగితే వారి వారి సంస్థలు, పీఠాలు అంతగా గురుని అనుగ్రహానికి దగ్గరవుతారు. సాయిపరివార్ అయినా మరో గురుపరివార్ అయినా పై విషయాన్ని మర్చిపోతే వారు పొందేది ఏమీ ఉండదని చెప్తూ పూజ్యగురుదేవులు 'ఏ కష్టమో, బాధో, మరో పరిస్థితో ఆధ్యాత్మిక సమూహానికి మనల్ని దగ్గర చేస్తుంది. యిది మనకు పైకి కనపడేదైనా, బాహ్యకారణం అలా కనిపిస్తున్నా ఈ విషయాల్ని తెలుసుకుంటున్న మనం ముఖ్యంగా అనేకానేక జన్మలబట్టీ కలిసిమెలసి ఒకే లక్ష్యం వైపు ప్రయాణిస్తోన్న వారమేననే సత్యాన్ని గ్రహించాలి.

ఏదో సినిమా టిక్కెట్టు దొరక్కనో, యింట్లో పెళ్ళాం పోరు తప్పించుకోవడం కోసమో, బాధ్యతల నెగ్గొట్టడం కోసమో కొందరు ముసుగువీరులు ఈ ఆధ్యాత్మిక సమూహాల్లో అప్పుడప్పుడు వైరాగ్యపు మొహంతో జొరబడ్డా, వారెక్కువకాలం ఉండరక్కడ. చాలా విసుగ్గా ఉంటాయి వారికిలాంటి విషయాలన్నీ. అటువంటి వారిని తప్పించి మిగతా వారి సంగతి తీసుకుంటే పక్కపక్కన కూచొని సాధనల్లో, జపమో, పూజో చేయడమంటే అది జన్మజన్మల కారణమై వుంటుంది. ఏ జన్మలోనో కలిసి వుండకపోతే యిలా ఒకే సమూహంలో లేదా ఒకే



పరివార్‌లో కలిసివుండటం అసంభవం. మరి అలాంటి మనం మన అనంత జీవిత కాల యాత్రల్లో బంధుత్వాలెలా ఏర్పరుచుకోవాలో చెప్పారు. ఒక తల్లిగర్భాన ఒకే కుటుంబంలో జన్మించినా సరే మన లక్ష్యం వైపు రానటువంటి వాళ్ళను పక్షప్రేషనలో బిగిపోయే తాత్కాలిక స్నేహ భావంతో ఎలా చూస్తామో ఈ బంధుత్వాలు అలానే చూడాలి. యివాళ కాకపోతే రేపు. రేపు కాకపోతే మరొక నాడు మధ్యలో నిర్దయగా దిగిపోయేవారే అందుకే నీతో ఉంటూ, నీతోపాటు నీ గమ్యం వరకు ప్రయాణించే వాళ్ళను గుర్తించండి. వారితో బంధుత్వాలు ఏర్పరచుకోండి. మీ జన్మలు ధన్యమవుతాయి. మీ సాధనలు ఫలిస్తాయి. మీ లక్ష్యమూ సిద్ధిస్తుంది. త్వరితగతిలో ఈ మహ ప్రయోజనా లందించేందుకు ఒకే లక్ష్యం వైపుకు సాగిపోయేలా బంధుత్వాలను కలుపుకోండి" అన్నారు.

ఈ జన్మతో వచ్చిన బంధాల కంటే బంధుత్వాలకంటే అనేక జన్మలనించి ఏర్పడిన బంధాలకే ప్రాముఖ్యత నివ్వగలగాలి. యిది చదువుతోన్నప్పుడు మనకు కాస్త యిబ్బందిగా తోస్తుంది. 'యిదేమిటి యిలా చెబుతున్నారు' అనికూడా అనిపిస్తుంది. ఇలాంటివి చెప్పి మనల్ని గురువులు యిబ్బందికి గురి చేయడం కోసం కాదు అని తెల్సుకోవాలి. వ్యాధి గ్రస్థుడైన రోగిని డాక్టర్ కాస్త మందలింపుగా ఏదైనా చెప్పినా అది ఆ రోగిపై కోపమో, ద్వేషమో అనుకోం కదా ! యిదీ అలాగే. మనం భవ రోగ గ్రస్థులం. దీన్నించి మనల్ని బయటపడేసే ప్రయత్నంలో ఆ వేదవిదులు, ఆ వైద్యులు కొన్ని కొన్ని రహస్య సూచనల్ని చేస్తారు. సర్వజ్ఞులైన వారికి తెలుసు ఏ రోగానికి ఏమందు అవసరమో అనే పరిపూర్ణ విశ్వాసం మనకుండాలి. లేనిపోని బంధాలు, బంధుత్వాలు మనల్ని యీ భవసాగరం నుంచి బయట పడనివ్వవు. ఎంతగానో అడ్డు తగుల్తుంటాయి. ఆ బంధాలు, ఆ సంబంధాలు బాధ్యతలనుకొని భ్రమిస్తూంటాయి. ఆ బాధ్యతల ముసుగులో మోహములుంటుంటాయి. ఏది బాధ్యతో-ఏది అసలైన మోహమో మనం అంత తేలిగ్గా గుర్తించలేము. కాస్తంత వివేచనతోనే గుర్తించాలి!

మోహాల్ని బాధ్యతలనుకొని అయా వ్యక్తులతో లేని పోని దగ్గరితనంతో వ్యవహ రించడం వల్ల ఆ బంధాలు చిక్కుముడులు పడిపోయి జన్మ జన్మలు మనల్ని వెంటాడి వేధించవచ్చు. అలా అని వారిని దూరంగా ఉంచమని కాదు. ప్రేమగానే ఉండాలి అందరితోనూ కాని, ఎంతవరకు ఆ బంధాలకు ప్రాధాన్యత యివ్వాలి అనేది ఎవరికి వారము చక్కగా ఆలోచించుకొంటూ ఉండాలని వారి భావము. యీ విషయం గురించి మాట్లాడుతూ యిలా చెప్పారు.

'ఛీఛీ మోహము ! వీరు నా లక్ష్యం వైపు రావడం లేదు. వారితో పలకకూడదు - వీరిని రానివ్వ కూడదు. దూరంగా వుంచాలి - వీరిని అక్కడే వుండనివ్వాలి' అని పిచ్చిగా ప్రవర్తించరాదు. నీ మనసులో భావన మరొకరికి తెలియక్కరలేదు. అయినా అందర్నీ సమానంగానే ప్రేమించగలగాలి. ఎవ్వరినీ నొప్పించడం గాని, చిన్నతనంగా చూపడంగానీ చేయకూడదు. నీకంటే బాగా ప్రేమించగల తండ్రి ఉండకూడదు. నీకంటే గొప్పగా ప్రేమించగలిగే తల్లి వుండకూడదు. నీకన్నా చక్కగా చూసుకొనే భర్త ఉండకూడదు. నీకన్నా బాగా చూసుకోగలిగే భార్య ఉండకూడదు. యింతకన్నా ప్రేమించగల కొడుకు ఉండకూడదు. యింతలా ప్రేమగల్గిన కూతురుండకూడదు. అన్నంత యిదిగా మన ప్రవర్తన మనవాళ్ళతో ఉంచుకొంటూండాలి. ఇవి చాలా జాగ్రత్తగా అవగాహన చేసుకోవల్సిన అంశములు. 'రెండూ మీరే చెపుతున్నారే' అనుకుంటారేమో మరి అదే ఆధ్యాత్మిక సాధన అంటే. కత్తిమీద సాము లాంటిదన్నారందుకే. గీతలో యిలాంటివి వినే అర్జునుడు అయోమ యంలో పడ్డాడు. అదే అడిగాడు కూడా. No confussion. దేన్దార్దాన్దే.

మనచుట్టూ ఉన్న నచ్చని పరిస్థితులే మనం మహానుభావులుగా మారటానికి ప్రకృతి మనకందిస్తోన్న దివ్యౌషధాలు. విశాలమైనటువంటి వాతావరణంలో కంకికి ఉన్న గింజ విత్తనం అవాలంటే ఎండలో పడేస్తాం. ఆపై గుంటదీసి అందులో పడేసి పైన మట్టి కప్పేస్తాం. ఏ మాత్రం కదలకుండా బిగించి పారేస్తాం. పైన పేడ, బురదల్లాంటివి



కూడా వేస్తాం. అప్పుడుగానీ అంకురించదది. ఆ కష్టాల తరువాత ఆ మామూలు గింజే తనను పోలిన ఎన్నో అసంఖ్యాకమైన విత్తనాల్ని తయారుచేస్తుంది.

*'Nature is always right* - ప్రకృతి ఎప్పుడూ సరిగానే చేస్తుంది.' ఈ అద్భుతమైనటువంటి సూత్రాన్ని కొందరు తెలివిగా మలుచుకొని బద్ధకస్తులుగా, బాధ్యతా రహితులుగా జీవితాన్ని గడుపుతున్నారు. అలాంటివారిని గమనించిన గురువులు ఆందోళనకు గువ్వతూ వారిని సరిదిద్దు ప్రయత్నంలో భాగంగా ఈ విషయాల్ని తెలియ జేస్తున్నారు. (S.S.Y.) సిద్ధ సమాధి యోగ అందించిన ఋషి కూడా 'అంతాసరి' అనుకోండని చెప్పారు. 'ఏం జరిగినా జరగవలసివుండి జరిగిందని అంగీకరించాలి' అని నేర్పారు.

అక్కడ చాలామంది పొరబడ్డారు. 'ఏమిజరిగినా చేతకాని వాళ్ళలా చూస్తుండిపోవాలి కాబోలు' అనకుంటున్నారు. ఋషు లందించిన అద్భుతమైన విజ్ఞానం మనల్ని చవటలుగా మార్చేందుకు కాదు. సర్వ సమర్థులైన వారు, అసంభవాలను సంభవాలుగా మార్చగలిగే స్థాయి కెదిగిన శక్తివంతులు మనల్ని కూడా అంతకు మించిన స్థాయికి చేర్చేందుకు ప్రయత్నిస్తారు తప్ప Nature is always right అంతాసరి అనుకుంటూ మనల్ని మనం మోసం చేసు కోవడం కాదు. బడికి పంపించిన పిల్లాడు బడెగ్గొట్టి మ్యాట్నీ కెళ్ళాడు. అంతాసరి అననుకుంటే ఎలా ?

బాధ్యతల్ని విస్మరించే వారిని ఏ గురువు స్వీకరంచడు. ఏ గురువుగానీ, ఏ యోగిగాని బాధ్యతల్ని ఎగ్గొట్టలేదు. బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించలేనివాడు ఆధ్యాత్మిక జగత్తు మొట్టమొదటి మెట్టు కాదు కదా ఆ దరిదాపులకు కూడా రాలేడు. మనలో కొందరు తెలివిగల వారమనుకుంటూ వాదోపవాదాలకు దిగే ఓ వర్గం వారికి ఈ ప్రశ్న వస్తూంటుంది. బుద్ధుడు భార్య బిడ్డల్ని వదిలేశాడు కదా అని.

ఎలాంటి వాతావరణంలో వారిని ఉంచి వెళ్ళాడు ? గాలికేమీ వదిలి వెళ్ళలేదు. తిండికి, బట్టకి ఏ లోపం లేదువారికి అలాంటి స్థితిలో వారిని ఉంచి తను వెళ్ళిపోయాడు. మనలో ఎవరికైనా ఏ ఫారిన్ లోనో ఉద్యోగం వచ్చిందనుకోండి. ఓ ఐదేళ్ళు ఉండాల్సొస్తుందక్కడ. మీకొక్కళ్ళకే సదుపాయాలు కల్పించిన విదేశీయులు మీ భార్య పిల్లల్ని తీసుకురావటానికి ఒప్పుకోలేదనుకుందాం. అప్పుడేం చేస్తారు మీరు? వాళ్ళని ఇక్కడ వదిలేసి, వారికి కావల్సిన ఏర్పాటుచేసి మీరెళ్ళిపోతారు ఫారన్‌కి. అప్పుడు బాధ్యతారహితంగా భార్యాపిల్లల్ని వదిలేసి వెళ్ళిపోయాడని ఎవరైనా అంటారా? బుద్ధుడు కూడా అదే చేశాడు. జ్ఞానం ఉదయించాక తిరిగి వాళ్ళ దగ్గరికే వచ్చాడు. వచ్చాక "మొట్టమొదట నేను సంపాదించినటువంటి జ్ఞానానికి హక్కుదారువు నువ్వేనమ్మా యశోధరా" అన్నాడాయన.

Nature is always right అనుకుంటూ బద్ధకస్తులుగా, సోమరి పోతులుగా తయారవటం కాదు. ప్రతీ పరిస్థితిని అప్పటికి, అంగీకరిస్తూ ఆ పరిస్థితుల్ని ఉన్నతంగా మార్చుకునేందుకు, తీర్చిదిద్దు కునేందుకు మాటిమాటికి తీవ్ర ప్రయత్నం చేస్తుండాలి. పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ నీ కనుకూలంగా లేనప్పటికీ నిరాశ చెందకుండా వాటిని మీ లక్ష్యానికి తగ్గటుగా మలచుకుంటూ గురువులవైపు సాగిపో తూండాలి. బురదలో పెట్టిన విత్తనం అక్కడే అలా ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోవటల్లేదు. మెల్లిమెల్లిగా పైకి ప్రయాణిస్తోంది. సూర్యుడివైపు సాగుతోంది. అంకురంగా, మొక్కగా, మెల్లిమెల్లిగా దాని ప్రయత్నం సూర్యుడి వైపుకే ఉంటోందికదా !

కాబట్టి ఋషులందించిన 'అంతా సరి' అన్న సూత్రమైనా, Nature is always right అన్న సూత్రమయినా, మరో మంత్రమైనా జరుగుతోన్న పరిస్థితుల్ని ఒప్పుకోడంతోనే సరిబెట్టుకోకుండా మన దృష్టి ఉచ్ఛస్థితి వైపుండేలా చూసుకోవాలి. అందుకే ఈ ఉదాహరణ నిచ్చారు. బజారు నించి వచ్చేసరికి మీ యిల్లు ఎలా వుందో చూడండి ! బైట



మెట్లమీద కూరగాయలు చెల్లాచెదురుగా పడేసున్నాయి. లోపలి కెళ్ళేసరికి చెప్పులస్టాండ్ దగ్గర గ్లాసులు, కంచాలు, చెంచాలు యిష్ట మొచ్చినట్టు పడేసున్నాయి. పక్కనే దుప్పట్లు, దిండ్లు కుప్పలు తెప్పలుగా పడేసున్నాయి. అక్కడే ఊరగాయ పచ్చళ్ళ జాడీలుకూడా ఉన్నాయి. పరుపులో ఉండాల్సిన దూది యిల్లంతా మంచులా కప్పబడి వుంది. ధైర్యం చేసి వంటింట్లో కెళ్ళి చూసేసరికి చెప్పులు గ్యాస్టౌవ్ దగ్గరున్నాయి. బాత్రూమ్ లోనించి టెలిఫోన్ మోగుతోంది. ఆఫీసు ఫైళ్ళు, యింక్ బాటిళ్ళూ వంపుకిందున్నాయి. బుజ్జిగాడు పంపు తిప్పబోతున్నాడు. ఈ పరిస్థితి చూస్తున్న మీరు గట్టిగా అరవకుండా ఉండలేకపోయారు.

పరిస్థితులు ఎలావున్నప్పటికీ ఆ క్షణానికి అవి ఓకే. మరుక్షణం అవి ఓకేగాదు. కొంపలంటుకుంటాయి. బుజ్జిగాడు వంపు తిప్పివుంటే ఉద్యోగం ఊడేది. బజార్న పడుండేవారు. ఎలాంటి పరిస్థితులున్నా అప్పటికి అనివార్యమది. జరిగిపోయిందది. తర్జన భర్జన లనవసరం. దృష్టి జరగవలసిన వాటిమీదకు వెళ్ళాలి. ఆ పరిస్థితి, ఆ వాతావరణం ఎలా ఉంటే బాగుంటుందని నీకనిపిస్తుందో అలా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు మరుక్షణంలోనే మొదలెట్టు. ఆలస్యం చేస్తే పంపు తిప్పేస్తాడు. డ్యామేజ అయిపోతుంది. ఒక్కోప్పుడు పరిస్థితులు చేయిదాటిపోవచ్చుకూడా. ఆలస్యం అమృతం విషం. వాదోపవాదాలు - తప్పులెంచటాలు సాధకులకు పనికిరావ్.

మీ జీవితం సకల శాస్త్రాల్లో చెప్పబడిందానికి పూర్తి విరుద్ధంగా ఉన్నా - గురుస్థాయిలో ఉన్నవారు మీది తప్పని తేల్చినా - సొసైటీ మొత్తం ఎదురునిల్చి నీకు శిలువేసినా Nature is always right. ఏమీ ప్రాబ్లమ్ లేదు. అలాంటి పరిస్థితులు ఖచ్చితంగా మీలో ఉన్నటువంటి సర్వజ్ఞత్వాన్ని అభివృద్ధి చేస్తాయి. సర్వవ్యాపకత్వాన్ని అభివృద్ధి చేస్తాయి. సర్వ సమర్థత నభివృద్ధి చేస్తాయి. మన జీవితంలో

ఎదురయ్యే ప్రతి కష్టము, ప్రతీచికాకు, ప్రతిబాధ ఈ మూడు లక్షణాలనూ మనలో పెంపొందింపచేసేందుకే అనేది మర్చిపోకూడదు.

Nature అనబడే ప్రకృతే మనకు గురువు. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడూ అయిన ఆ గురువు మనల్ని కూడా ఆయనంతటి వాడుగా తీర్చిదిద్దే ప్రయత్నంలో మనకాపాటి కష్టం కలగడం, బాధనిపించడం తప్పదుమరి. ఇంజెక్షను సూది పిల్లాడి లేత శరీరాన్ని ఛేదించుకొని లోపలికెళ్ళేప్పుడు తల్లికి ఆనందంగా ఉంటుందా ? ఆ సందర్భంగా ఆ పసివాడు కందిపోయి గుక్కపట్టి ఏడుస్తోన్న ఏడుపు తల్లికి వీనుల విందుగా ఉంటుందా ? సర్వజ్ఞత్వము - సర్వవ్యాపకత్వము - సర్వసమర్థతల మీదనేగాక అసంభవాన్ని సంభవాలుగా మార్చగలిగే స్థాయి ఉన్నవారు మనల్ని సైతం అంత ఎత్తుకు తీసుకెళ్ళే ప్రయత్నంలో ఆ మాతృహృదయులు పడుతోన్న తపన, ఆతృత మన ఊహకందనివి. మన గురువులంతా మనకోసం సముపార్జించి పెట్టి ఉంచిన శక్తి భాండారంతో కనుక మనం పోల్చి చూస్తే మన సాధనలు ఎంత తక్కువస్థాయివంటే వాటిద్వారా పొందగలిగే శక్తులే మన ఊహకందనంత గొప్పవి. దాన్ని బట్టి ఆ దయామయుల ప్రేమ, ఆ కరుణాసాగరుల యొక్క కరుణ కాస్తర్థమవుతుంది మనకు. అసలు వారు మనపై చూపిస్తోన్న కృపను అంచనా వేయలేము. గురువు అనుగ్రహంలోనే శిష్యుడున్నప్పటికీ ఆ అనుగ్రహాన్ని వాడు పొందే అర్హత, సమర్థత పొందేదాకా అది అతనికి అనుభూతిలోకి రాదు. శిష్యుడనే వాడు తన పాత్రతను పెంపొందించుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలి తప్ప మరోవైపు దృష్టి ఉంచకూడదు. ఆ పాత్రతను సంపాదించు కోవడానికి 'ఏకైక మార్గము సర్వ సమర్పణ' అని చెప్పారు.

Nature is my master. సర్వజ్ఞుడైనటువంటి ఆ గురువుకు- ఆ ప్రకృతికి మన గురించి మనకంటే బాగా తెలుసు. మన అలవాట్లు, మనలోని బలహీనతలు, మన భవిష్యత్తు, మన లక్ష్యము, మనమున్న పరిస్థితులు మన చుట్టుపక్కల వారు - వారి పరిస్థితులు, పిల్లలు- వారి భవిష్యత్తు ఖచ్చితంగా నీ కంటే ఆ ప్రకృతికే చాలా బాగా తెలుసు. పరిస్థితులు చెడిపోయి నీ తల్లే నిన్ను మోసం చేయవచ్చు - నీ తండ్రే అమానుషంగా ప్రవర్తించి వుండవచ్చు. నీ బంధువులు, స్నేహితులు, అన్నదమ్ములు అందరూ మోసం చేయవచ్చుగానీ ప్రకృతి నిన్ను మోసం చేయదు. నీ ఆత్మోన్నతికి ప్రస్తుతం నీవున్నటువంటి పరిస్థితుల కంటే యింకాస్త మంచి పరిస్థితులు కనుక నీకివ్వాల్సివస్తే అలాంటి పరిస్థితులు ప్రకృతి నీకు ఖచ్చితంగా యిచ్చివుండేది. కానీ యివ్వలేదంటే యిప్పుడు నీవున్న పరిస్థితులే నీ కత్యంత ఉపయోగపడే వని నమ్మండి. ఆ ప్రకృతి పట్ల నీ విశ్వాసం ఉంచండి. నీకు మేలు కలిగించని ఏ పరిస్థితీ నీ కెదురవదని గ్రహించు. నీ కిష్టంలేని ఆ పరిస్థితులే నీ శ్రేయాభిలాషులు. ఉద్యోగ సమస్యలు కావచ్చు, కుటుంబ సమస్యలు కావచ్చు. అవేవైనా సరే నీ ఆత్మోన్నతికి తోడ్పడేటటువంటి పరిస్థితులైతేనే ప్రకృతి ప్రసాదిస్తుంది. అవి నీకు సుఖవంతమైనవా? యిబ్బంది కలిగించేవా ? అని చూడదు ప్రకృతి. నీ పూజలు, ప్రార్థనలు చూసి దయ చూపించడం, క్షమించడం చేతకాదు దానికి. ప్రార్థనల వల్ల పరిస్థితులు మారవు అన్నారందుకే. మనల్ని ఉన్నత పథానికి చేర్చే ప్రకృతి అసలు కనికరం చూపించనే చూపించదు. ఎందుకంత కఠినంగా వ్యవహరిస్తున్నదో కూడా మనం తెలుసుకోవాలి. నడుస్తున్నప్పుడు కాలు ముల్లు మీద పడ్డది. చటుక్కున కాలు వెనక్కి వచ్చేస్తుంది. మీరున్నటువంటి పరిస్థితుల ద్వారా గురువేం చెప్తున్నాడో వెంటనే గ్రహింపుకు రావాలి. ఆ స్థితికి మనమెదగడం కోసం ప్రకృతి అంత ఖచ్చితమైన గీతలు గీస్తుంది. ఏ మాత్రం దయాదాక్షిణ్యా లుండవు. అప్పుడే మనమేదైనా నేర్చుకోగలుగుతామని మనకంటే ఆ గురువుకే చాలా బాగా తెలుసు.

మన శాస్త్రజ్ఞులు కూడా యించుమించు ఋషుల స్థాయి వాళ్ళే. మనిషనేవాడు ఈ పృథ్వి మీద తప్ప యింకెక్కడైనా ఉన్నాడా అని దృష్టి సారించారు. లేడని తేల్చారు. యితర గ్రహాలలో ఈ సౌరకుటుంబాలలో, నక్షత్ర మండలాలలోగానీ మానవ సమూహం

యింకెక్కడా లేదని తీర్మానించారు. యిటీవల మనం వార్తల్లో చదివాం. ఒకప్పుడు ఏదైనా కనుక్కోవచ్చుగానీ, సముద్రం లోతు కనిపెట్టలే మనేవారు. కానీ దాన్నికూడా లెక్కగట్టి అన్ని సముద్రాల వైశాల్యాల్నీ, లోతునూ అడుగులతో సహా చెప్పేశారు. వేదిక్ సైంటిస్టులైన మన ప్రాచీన ఋషులంతటి వారు కాకపోయినా తక్కువ వారుకాదు. అర్కిమెడీస్ గురించి చెప్తూ ఆ మహానుభావుడి శక్తి సామర్థ్యాలు తక్కువని ఎలా చెప్తాం? 'Give me a place to stand. I will lift the earth' అన్నాడు. ఆ సైంటిస్టు యొక్క దమ్ము అది. కప్పీల గురించీ, పళ్ళ చక్రాల గురించీ, బరువులెత్తటం గురించీ తేలికమార్గాలు కనిపెట్టి నాయన ఛాలెంజ్ చేశాడు. 'నిలబడేందుకు కాస్త స్థలమివ్వండి ! నా సిద్ధాంతం ఎంత గొప్పదో నిరూపిస్తా ! భూగ్రహాన్నే అమాంతం ఎత్తేస్తానన్నాడాయన.

అంతటి ఆధునిక సైంటిస్టుల తీర్మానమే కాదు ఈ విశాల విశ్వంలో ఈ భూమ్మీదున్న మనుషులే మనుషులని వేదిక్ సైంటిస్టులు (ఋషులు) కూడా ఒప్పుకున్నారు. వాళ్ళు 800 కోట్ల మందనీ కూడా తెలుసు. ఈ భూమి ఉపరితలం మీద జీవిస్తోన్న 84 లక్షల జీవరాశుల్లో వీడొక ప్రాణి. ఈ విశాల విశ్వంలో 84 లక్షల జీవరాశుల్లో వీడొక విలక్షణ ప్రాణి. వీడు పొందిన అద్భుతమైన మానవ శరీరం యొక్క గొప్పదనం ఏమంటే ప్రకృతి వీడికొక్కడికే యిచ్చింది అపురూపమైన వరం. అలాంటి వరాన్ని దేని కుపయోగించుకోవాలో దానికుపయోగించు కోకుండా మూర్ఖత్వంతో వ్యవహరిస్తున్నాడు. ఇదీ అసలైన దారిద్ర్యమంటే.

ఓ రాజుగారు వేటకని బయలుదేరి చీకటి పడేదాకా వేటాడి వేటాడి చీకట్లో పొరపాటున తన పరివారాన్నుంచి వేరు పడ్డాడు. అడవిలో, చీకట్లో దారి తెలియక కంగారుపడ్డాడు. ఎంతైనా రాజుగదా! ఏడ్చిగగ్గోలు పెట్టబుద్ధి కాలేదు. భయం భయంగా సంచరిస్తున్న ఆ రాజుకు దూరంగా ఓ దీపం కనబడింది. మెల్లిమెల్లిగా ఎలాగోలా అక్కడికి చేరాడు. ఆ గుడిసెలో కాపురముంటున్న ఆ పేదవాణ్ణి రాత్రికి



తనకు ఆశ్రయమివ్వమని అడిగాడు. మంచి మనసుగల ఆ పేదవాడు ఆ రాత్రికి తన ఆహారాన్ని అతిథికిచ్చి, గుడిసెలో పడుకునేందుకు ఏర్పాటు చేసి తను ఆ రాత్రికి అరుబయట పడుకున్నాడు. తెల్లారాక మెలకువ వచ్చి గుడిసెలోకి తొంగి చూశాడు. అతిథి జాడ కనపడలేదు. మరునటి రోజు రాజభటులొచ్చారు. కొలువుకు తీసుకెళ్ళారు. సింహాసనంలో కూచున్న రాజును గుర్తించాడు. నాటి రాత్రి తనింటి కొచ్చిన అతిథి ఆయన. ఆ రోజున రాజు గారికి తగిన మర్యాదలు చేయనందుకు కోపగించుకొని వెళ్ళిపోయాడనీ, యిప్పుడు తనని శిక్షించడానికి అక్కడికి రప్పించాడనీ అనుకున్నాడు. తెలీక చేసిన అపరాధానికి మన్నించమనడిగేందుకు పెదవి విప్పబోయేలోగా రాజుగారి గంభీరస్వరం అతన్నయోమయంలో పడేసింది. 'నీకేం కావాలో కోరుకో.' పేదవాడు అయోమయంగా చూస్తున్నాడు. తన ఊహ తప్పింది. రాజుగారేదో కోరుకోమంటున్నాడు. ఏమడిగితే బాగుంటుంది ? అనే సందిగ్ధంలో పడ్డాడు పేదవాడు. సమాధానంకూడా రాజగారే చెప్పేశారు. కొన్ని ఎకరాల తోటను బహుమానంగా ప్రకటించి పంపేశాడు.

పేదరికంలో ఉన్న తనకా తోట ఆసరాగా ఉంటుందని అనుకున్నాడు. తన చేతగానితనం వల్ల తోటంతా ఎండిపోయింది. ఎండిన చెట్లని నరికాడు. కాల్చిబొగ్గులుగా చేసి సమీప గ్రామాలకు తీసుకెళ్ళి అమ్ముకుంటూ బ్రతుకుతున్నాడు. చాలా కాలం అయింది. ఓ రోజు బొగ్గుల మూట మోస్తూ వెళ్తున్న వీడికి ఒక యోగి ఎదురై 'పిచ్చివాడా! నీకు మహారాజు తరగని సంపదనిచ్చాడు. దాని విలువ తెలీని నీవు యిలా దురుపయోగం చేసుకుంటున్నావు. నీవు ఒట్టి పిచ్చివాడివ'న్నాడా యోగి. పేదవాడు వినయంగా వివరం అడిగాడు. అందుకాయోగి "నీవు రాజుగారికిచ్చిన ఆతిథ్యానికి మెచ్చి నీకు గంధపుతోటను బహుమానంగా యిచ్చాడు. దాన్ని నీవు జాగ్రత్తగా పెంచి పోషించుకున్నట్లైతే ఎంతకీ తరగని సంపదగా ఉండి ఉండేది. దాని విలువ తెలియని నువ్వు తోటంతా ఎండిపోయేలా చేసుకున్నావు.

గంధం చెట్లుకొట్టించి, కలపను కాల్పించి ఆ బొగ్గులమ్ముకొని బతుకుతున్నావు. వట్టి దురదృష్టవంతుడివి.' ఆ మాటలు విన్న ఆ పేదవాడు గబగబా తోటకేసి పరుగెత్తాడు. తోటలో బొగ్గులు రాశిపోసి వున్నాయి. అలా చెక్కలు దూలాలు కాల్చి బొగ్గుగా మార్చి రాశులు పోసింది తనే. యింక గంధపు చెక్కలు గానీ దూలాలుగానీ తోటలో లేకుండా చేసుకున్నాడు. తన చేజేతులారా చేసుకున్న మూర్ఖపు పనికి కుమిలి కుమిలి ఏడ్చాడు. అయినా ఏం ప్రయోజనం ?

గురువు తనకున్నట్టి మూడు లక్షణాలను మనిషికి అందించేందుకు తపన పడుతుంటే ఈ మానవుడు విలక్షణమైన, అద్భుతమైన మానవశరీరాన్ని తాను పొందింది కేవలం తిండి తిని సుఖాల ననుభవించడం కోసం మాత్రమే ననుకోవడం గురువుల్ని కూడా కలవరపెడుతోంది. నేడు ఈ అరుదైన విశేష కాలంలో మానవ శరీరాన్ని ధరించిన మనల్నందరినీ దేవతలుగా మార్చేస్తామంటూ ఆ దయామ యులు ఎన్నో కీలక రహస్యాల్ని వెల్లడిస్తున్నారు. ప్రకృతి సమస్యల రూపంలో, విషమిస్తున్న పరిస్థితి రూపంలో మనలోని ప్రతిభను బైట పెట్టేందుకు అనుక్షణం ప్రయత్నిస్తుంటుంది. మనమేమో అనుకోని పరిస్థితులు కొంచెమెదురైనా, చిన్న సమస్య వచ్చినా బెంబేలు పడిపోతుంటాం. అనవసరంగా బంధనాలని పెంచుకుంటుంటాం. అర్థాంతరంగా, లక్ష్యహీనంగా ప్రవర్తిస్తుంటాం. మరెలా యిలాఐతే ?

ఏ ఉద్యోగ ధర్మం మీదో సెమినార్‌కి బయలుదేరాం. ఢిల్లీ వెళ్ళాలి. ఉద్యోగరీత్యా తప్పదది. రైల్లో తోటి ప్రయాణీకుల్లో ఎవరో బాగా దగ్గరయ్యారు. అయోమయంగా మనం వారితోపాటు పక్కస్టేషనులో దిగిపోయామనుకోండి ఏమనాలి మనల్ని? మన లక్ష్యం పోయింది. సెమినార్ పోయింది. ఉద్యోగ ధర్మం పోయింది. అర్థం పర్థం లేని బాధ్యతలో, బంధుత్వాలో అడ్డుపెట్టుకొని మాయా మోహితులమై లక్ష్యహీనంగా బతుకుతున్నాం. పైన చెప్పినట్లు మన గమ్యం వైపు వెళ్ళేవారికే ప్రాధాన్యతనిస్తూ అలాంటి వారితోనే ప్రయాణం



సాగిస్తుంటే త్వరత్వరగా మనం లక్ష్యాన్ని ఛేదించగలం. ఈ లోగా బాహ్య పరిస్థితులు గడ్డుగా తోస్తాయి. కంగారు పడతాము. అమ్మో ! యింకేముందనిపిస్తుంది. మరేం ఫరవాలేదు. బాహ్యపరిస్థితులు మన ఎదుగుదలకి తోడ్పడకపోతే అవి మరుక్షణంలో ఉండవు. మన లక్ష్యం సరిగ్గా ఉన్నప్పుడు కొన్ని అవాంఛనీయ పరిస్థితుల్లో మనం యిరుక్కున్నప్పటికీ ఆ పరిస్థితులన్నీ నూటికి నూరుపాళ్ళూ మనకు సహకరించేవేనని మరిచిపోకూడదు.

యింటికి శ్లాబ్ వేస్తున్నప్పుడు కొన్ని బాదుల్నీ, కర్రల్ని సపోర్టింగ్ వేస్తారు. పోటీ పెడతారు. శ్లాబ్ గట్టిపడేవరకు అలాగే ఉంచుతాం. పొద్దున శ్లాబేసి ఆ పోటీ ఉంచిన కర్రల్ని సాయంత్రానికి తీసేశామనుకోండి ! అంత కష్టపడి వేసిన శ్లాబ్ కాస్తా కుప్పకూలిపోతుంది. కొన్నాళ్ళుంచాలి. గట్టిపడేవరకూ తీయకూడదు. ప్రకృతిలో కూడా మనకున్నటువంటి గడ్డురోజులు యిబ్బందిగా తోస్తున్న పరిస్థితుల్లో ఖచ్చితంగా మన క్షేమం కోసమే ఆ క్షణంలో ఎదురయ్యాయి. అవెప్పుడు తీసెయ్యాలో ప్రకృతికి బాగా తెలుసు. ఈ లోగా ఖంగారు పడిపోతే ఎలాగ ? యింత ప్రతిభ కలిగినటువంటి, విలక్షణమైనటువంటి, శరీరధారి అయినటు వంటి మనిషి ఈ విశాల అనంత విశ్వంలోనే ఓ అద్భుతమైనటు వంటి స్థానం కలిగినటువంటివాడని గుర్తించి ప్రకృతి కనుగుణంగా నడుచుకుంటూ ఆధ్యాత్మిక జీవనం గడుపుతోన్న వీడు మధ్యలో ప్రాణం వదిలేసినా అతనికంతా శుభమే జరుగుతుంది. గీతలో జగద్గురువు ఈ విషయమై హామీ కూడా యిచ్చాడు.

శ్లో॥ పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే
నహి కళ్యాణ కృత్కశ్చి ద్దుర్గతిం తాతగచ్ఛతి ॥

భ॥గీ॥ - 6వ అ., 40 శ్లో॥

*తా॥ పార్థా ! యోగభ్రష్టునకు యీ లోకమునగానీ, పరలోకమున గానీ వినాశనము కలుగనేరదు. పుణ్యాత్ముడైన వాడెవడూ దుర్గతి పాలుకాడు కదా !*

శ్లో॥ ప్రాప్య పుణ్య కృతాం లోకా నుషిత్వా శాశ్వతీస్సమాః
శుచీనాం శ్రీమతాంగేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥

భ॥గీ॥ - 6వ అ., 41 శ్లో॥

తా॥ యోగభ్రష్టుడు పుణ్యాత్ములు వసించెడి లోకములను పొంది, అచట అనేక సంవత్సరములు ఉండి, ఆ తర్వాత సదాచార సంపన్నులైన శ్రీ మంతుల గృహంబులలో జన్మించుచున్నాడు.

రాజు పట్టుబడిపోయినా రాజలాంఛనాలతోనే పట్టుబడతాడు. ఆ రాజుగారికి జైల్లో కూడా రాయల్ ట్రీట్‌మెంటే. ఆ హోదా కారాగారంలో కూడా కొనసాగుతుంది. పేరుకే కారాగారం. వి.ఐ.పీ. కింద గుర్తించబడతాడు. గౌరవించబడతాడు. మానవ శరీరధారులంతా వి.ఐ.పీ.లే. జంతూనాం నరజన్మ దుర్లభం అన్నారుగా. మానవ శరీర ధారణ ఎందుకు వచ్చిందో, మనం ఈ శరీరాల్ని ఎందుకు ధరించామో దానికి సంబంధించినటువంటి పనులు చేస్తుంటే ఫరవాలేదు ? లేకపోతే ప్రకృతి సహించదు. పరిపాలిస్తుంది. తప్పదది. ప్రాకృతిక నియమమది.

ఈనాడు పృథ్వీగ్రహము మానవజాతిపై మండిపడుతోంది. పంచభూతాలు అసహనంగా ఉన్నాయి. కేవలం మానవుడు మానవుడిలా ఉండటంలేదు. ఖనిజ మానవుడుగా, వృక్ష మానవుడుగా, జంతు మానవుడుగానే జీవిస్తున్నాడు. కనీసం మానవుడు మానవుడిలాగానైనా ప్రవర్తించటంలేదు. మిలటరీలో జాయినై కొన్నాళ్ళుండి తుపాకి పట్టుకొని పారిపోయడనుకోండి మిలటరీ వదిలేసి. ఎక్కడున్నా పట్టుకుంటారు వాడిని. చాలా పెద్దనేరం కింద అరెస్టు చేస్తారు. అంత ఆషామాషీగా వదలరు. సరిగ్గా యిక్కడ కూడా అంతే. మానవ శరీరాన్ని ధరించి జంతువుల్లా ప్రవర్తిస్తూ లక్ష్యహీనంగా వుంటే ప్రకృతి సహించదు అన్నదందుకే. అంత ఆషామాషీగా వదిలిపెట్టదు. మానవ జీవిత గమ్యం వైపు జీవనయానం చేస్తూ సాగిపోతూ మనం చేసే పొరపాట్లు కూడా మనకు సహకరిస్తుంటాయి.



మానవ జన్మ కేవలం మూడు లక్షణాలని సాధించేందుకు మాత్రమే లభించింది. గనుక దీన్ని త్రీ డైమన్షనల్ వరల్డ్ అన్నాం. బ్రహ్మ విష్ణు మహేశ్వరులన్నా, ఆ మూడు శక్తులు కలిసిన దత్తాత్రేయుడన్నా, గురువన్నా ఏదైనా ఒకటే. ఈ సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వము, సర్వసమర్థత అనే మూడు లక్షణాలు సాధించడానికి అందరూ అర్హులే. వారే మతమైనా, కులమైనా, ఏ జాతైనా, ఏ ఉద్యోగం చేస్తున్నా ఫరవాలేదు. రైదాసు చెప్పులు కుట్టుకుంటూ సాధించాడు. కబీర్‌దాసు బట్టలు నేస్తూ, అమ్ముతూ పొందాడు. జనకమహారాజు రాజ్యపాలన చేస్తూ ఆ స్థితిని అందుకున్నాడు. యువరాణి ఐన మీరాబాయి పట్టుదలతో సాధించింది. యిటీవల కాలంలో తణుకులో కూరలమ్ము కొనే ఓ అమ్మి ఆ మూడు లక్షణాలనీ సొంతం చేసుకొని, చివటం అమ్మగా, అవధూతగా కీర్తింపబడుతోంది. బందరు దగ్గర కురు మద్దాలిలో ఓ మాలపల్లెలో మాల పిచ్చమ్మ అనే ఆవిడ కూడా అదే స్థితికి వెళ్ళింది. అడుక్కుతినే వాడి దగ్గరనుంచి చక్రవర్తి వరకు అందరూ ఆ స్థితికి అర్హులే. అందుకు స్త్రీ పురుష భేదం లేదు, వయోపరిమితి అసలులేదు.

మన జీవితంలో ఎలాంటి పరిస్థితులన్నాయో అవి అప్రస్తుతం - అనవసరం. పాఠం చెప్తున్న గురువుకి వింటున్న విద్యార్థి అన్నం తిన్నాడో లేదో అనవసరం. అతని పరిస్థితి కూడా అనవసరం. దీన్నే వైరాగ్యమంటారు. వైరాగ్యమనేది మీకు సరిగా అర్థమైనట్టులేదు. పక్క స్టేషన్‌లో దిగిపోయేవాడికి, దూరప్రయాణంలో మీతో వచ్చేవాడికి మధ్య మీ హృదయ స్పందనల్లో తేడాలున్నాయే దాన్నంటారు వైరాగ్యమని. ప్రతి పరిస్థితీ మన ఆత్మోద్ధరణకు దోహదపడుతుందనే విశ్వాసం మనకున్నప్పుడు యింకవాటి గురించి బెంబేలు పడటం అనవసరం కదా? వైరాగ్యంతో గంభీరంగా ఉండగలిగితే చాలు.

ఈ సమాజం మధ్య మధ్యలో మీకు కొన్ని బరువులు తల కెత్తేందుకు చూస్తుంటుంది. "అక్కడ మీ నాన్నగారు ఒక్కరే ఉన్నారు. పైగా రిటైరయ్యారు. మీ దగ్గర ఉంచుకోకూడదూ?" మా నాన్నగారి

మీద వీడికింత ప్రేమేంటా అనుకుంటాం? 'అంత ప్రేమున్న వాడివి మా నాన్నగారిని నీవే తీసుకెళ్ళచ్చుగా' అన్నామనుకోండి ! ఖంగారు పడతాడు. సమాజపు ప్రతినిధి అతను. లేనిపోని బాధ్యతల్ని తల కెత్తేందుకు ప్రయత్నిస్తుంది. ఈ సొసైటీకి భయపడి లక్షలు లక్షలు పోసి అర్థం పర్థంలేని చదువులు చదివిస్తూ పిల్లల జీవితాల్ని అతలా కుతలం చేయడమే కాకుండా అప్పుల పాలవుతున్న మధ్యతరగతి కుటుంబీకుల మూర్ఖత్వాన్నేమనాలి? 'తల్లిదండ్రుల్ని వృద్ధాప్యంలో దూరంగా ఉంచండి ! పిల్లల్ని వీధిబళ్ళల్లో చేర్పించండ'ని కాదు గురువుల ఆంతర్యం. ఎవరితో సంబంధాలు పెంచుకోవాలో' ఎవరి మాట వినాలో ఎప్పుడెప్పుడేమేమి చెయ్యాలో ప్రకృతే మీకు చక్కగా స్పష్టంగా చెప్తుంది. దాన్ని మనం పట్టించుకోకుండా, తెలుసుకోకుండా సొసైటీ చెప్పినట్టు చేస్తామంటే ఖచ్చితంగా నూటికి నూరుపాళ్ళూ గంగలో దిగుతారు. ప్రకృతిలోంచి వినటం నేర్చుకోవాలి. ఆ సాధన చేయాలి !

నిప్పునుపయోగించుకునే జీవి మనిషొక్కడే. అగ్నిజోలికి ఏ జంతువులు రావు. అగ్ని మొదటిది. రెండోది చక్రము. ఈ రెండు అభివృద్ధి సాధనాల్ని మనకు ప్రకృతిచ్చింది. సైంటిస్టులు రకరకాల పరిశోధనల్లో అనేకరకాల సత్ఫలితాలు పొందడానికి ప్రకృతే క్రీమ్లు ఈ రెండింటినీ వారికిచ్చింది. చిత్ర విచిత్ర పరిస్థితుల్లో వైజ్ఞానికులు ఆశ్చర్యకరమైన వాటిని కనుగొన్నారు. దాన్ని గమనిస్తే ప్రకృతి చెప్పే పాఠం తీరు మనకర్థమవుతుంది. (రహస్యవాణిలో వివరాలు లభ్యమవుతాయి)

ప్రకృతి యొక్క  సందేశాన్ని, సమాధానాన్ని పొందాలంటే 'మౌనంగా' ఉండడం నేర్చుకోవాలి. మన సొంత ఆలోచనలు, పక్కవాళ్ళ యొక్క ఆలోచనలు, సమాజం యొక్క ఆలోచనలు అన్నీ పక్కన పెట్టాలి. పక్కనపెట్టి బిగుసుకుపోకూడదు. ఇది చాలామంది చేస్తున్న పెద్దపొరపాటు. రిలాక్సేషన్ లేదు. హాయిగా, ఫ్రీగా కూచోలేక పోతున్నారు. బిగుసుకు పోతున్నారు. యింకో వర్గంవారు ఏకంగా నిద్రపోతున్నారు. అలాకాదు. నిద్రపోకూడదు. మౌనంగా వుంటూ ఏ



విధమైన ఆలోచనలు లేకుండా  ఆ గురువువైపు మన దృష్టి ఉండాలి. ప్రకృతి ఏం చెప్పబోతోందో దాని సమాధానానికై వేచివుండాలి. ప్రకృతిచ్చే సమాధానానికి హాయిగా ఎదురు చూడండి. టెన్షన్ పడటం దేనికి ? అన్నారు.

'ఎడ్గర్ ఎలాంపో' పెద్ద డిటెక్టివ్ కథా రచయిత. మనుషుల్ని సస్పెన్స్‌లో పెట్టి వెంట్రుకలు నిక్కబొడుచుకునేలా చేయగలడు. అతని నవల చదవుతోన్నవాడు ఎంత శాంతమూర్తైనా తారాస్థాయిలో టెన్షన్ పడిపోతాడు. అలాంటి రచనలు చేయగల రచయిత అతను. ఇంగ్లండ్‌లోని తన ఆఫీసుకి వేలకొలది ఉత్తరాలు, ఫోన్‌కాల్స్ రావటం మొదలెట్టాయి. ఉన్నట్టుండి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దానిక్కారణం ఏంటంటే అతను డైలీ సీరియల్ రాస్తూ రాస్తూ హీరోని ఎక్కడో బంధించినట్టు రాశాడు. 'ఒంటిస్తంభం మేడనీ, చుట్టూ మిషన్ గన్స్ అనీ, దూకడానికి వీల్లేదనీ, ఉచ్చు బిగించేశారనీ.....' ఆ తరువాత ఆ టెన్షన్‌ని భరించలేని పాఠకులు తరవాతేమైంది? తరవాతేమైందని ఫోన్ మీద ఫోన్ చేయడం మొదలెట్టారు. దానికి తగ్గట్టుగానే రచయిత ఏదో పర్సనల్ పనివత్తిడిలో ఆ రోజు సీరియల్ అందించ లేకపోయాడు. ఇంగ్లండ్‌లో నిజంగా జరిగిందీ సంఘటన. పాఠకులెవరూ టిఫిన్ కూడా చేయలేకపోయారు. టెన్షన్‌తో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఒకటి రెండు రోజులయ్యాక 'ఎడ్గర్ ఎలాంపో' అనే ఆ డిటెక్టివ్ రచయితకు తరువాత కథ ఎలా రాయాలో తెలీలేదట. హీరోని కట్టుదిట్టంగా యిరికించాడుగాని అతన్నెలా రక్షించాలో అర్థం కాలేదాయనకి. కన్ఫ్యూజయ్యాడు. పాఠకులు యింక సహించేటట్లులేరు. ఏకంగా ఆఫీసుమీద దాడి చేసేట్టున్నారు. భయమేసింది రచయితకి. రాసేయడమైతే రాసేశానుగానీ యిప్పుడా 'హీరోని ఎలా రక్షించాల్రా దేవుడో !' అని తెగ యిదైపోయాడు. యిక చేసేదిలేక "ఎలాగొలాగా శత్రువుల ఉచ్చులోంచి బయట పడ్డ హీరో అడవిలో అడ్డంపడి పరుగెత్తడం మొదలెట్టాడు." అంటూ రాసు కుంటూ వెళ్ళిపోయాడట.

ప్రకృతి మిమ్మల్ని నిర్బంధించి తను నేర్పదలచుకున్న పాఠం నేర్పేశాక మిమ్మల్ని బయటపడేస్తుంది. 'అదెలా సంభవం ? అలాంటి దాంట్లోంచి ఎలా బైటపడతాం ?' అనేది మనకనవసరం. ఎలాగోలా బయటపడిపోతాం అంతే. గ్యారంటీ అది' అంటూ భరోసాయిస్తున్నారు గురుదేవులు.

వేద విద్యలో నిష్ణాతులైనటువంటి మహర్షులు-
అబద్ధమాడటం అంటే ఏమిటో ఎరుగని మహర్షులు-
అతిశయోక్తులు చెప్పటం ఎలాగో తెలీని మహర్షులు-

కన్నపిల్లలు కళ్ళముందు చచ్చిన చద్దురుగాక ! అనవసరమైన ఒక్క అక్షరాన్నైనా వాడనటువంటి మహర్షులు అందించిన మహాసూత్రమిది. "నీ బాగోగులు ప్రకృతి చూసుకుంటుంది. నీకెందుకు బాధ?"

రమణ మహర్షి ఎప్పుడూ ఒక కథ చెప్తుంటారు. నెత్తి మీద పెట్టెనొకదాన్ని మోసుకుంటూ గబగబా రైలెక్కాడొకతను. రైలెక్కినా పెట్టె కింద పెట్టట్లేదు. కాసేపు చూశాక తోటి ప్రయాణికులడిగారతన్ని. 'నెత్తిమీద బరువెందుకు దించకపోయావా?' అని 'నా బరువే గాక పెట్టె బరువుకూడా ఎందుకు పాపం రైలుకి? నా పెట్టె నేనే మోసుకుంటాన్లే' అనాట్ట అమాయకంగా. అలాగే మన బరువులు, బాధ్యతలు మోసేది ఆ ప్రకృతే. మనం మోయలేం అసలు. మనమేదో మోస్తున్నామనుకుంటే ఏ గురువూ ఏమీ చెయ్యలేడు. పరిస్థితుల్లో మార్పు మన చేతుల్లో లేనప్పుడు ఏదవుతే అదవుతుందని నిశ్చింతగా ఉండడమే. నిజంగా మనకి గురువుపట్ల విశ్వాసముంటే అలాంటి పరిస్థితుల్ని ఆ క్షణంలోనే వదిలేయగలగాలి. యిలాంటి క్లిష్ట పరిస్థితులు- ఏం చేయాలో తోచనటువంటి ఉద్రిక్త వాతావరణం ప్రతి గురుచరిత్రలో, ప్రతి భక్తుని చరిత్రలో కనిపిస్తుంది మనకి. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లోంచి కూడా చాలా సునాయాసంగా బైటపడ్డ సంఘటనలు కూడా మనం వారి చరిత్రల్లో చదువుతాం. మనకూ అంతే. 'జరిగేదంతా మంచికనీ



అనుకోవడమే మనిషి పని ........ అంటూ పాటలుగా పాడించాడు సినీ రచయిత విన్నాంకదా !

పాఠం చెప్తున్నప్పుడు గురువు -

చావగొట్టి చెవ్వులు మూస్తున్నప్పుడు అవతారము

సూర్యుడి దగ్గరనుంచి ఈ విశేషకాల ప్రభావం చేత మన వైపుకు రెండు రకాలైన శక్తిధారలు ప్రసరిస్తున్నాయి. ఆ రెండే పైన చెప్పబడినవి. సృజనాత్మకమైనటువంటి శక్తిధారలు, విధ్వంసాత్మకమైన శక్తి ధారలు. గురువుగారు పాఠం చెప్తున్నారు. ఎదురుగుండా కూచొని మనం శ్రద్ధగా వింటున్నాం. ఆరుబయట మన వయసు వాళ్ళే హాయిగా టీవీలు చూస్తూనో, ఏ పులీ-మేకో, పేకోటో ఆడుకుంటుంటారు. చదువుకొంటున్న వాళ్ళకి పాపం ఏడుపొక్కటే తక్కువ ఈ అనుభవం చదువుకొనే విద్యార్థుల్లో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఎలాగోలాగా కష్టపడి చదివేసుకొని శిష్య మంచి పొజిషన్ కెళ్తే యింక అక్కడినుంచి సుఖపడచ్చుగదా అని. మామూలు చదువులకే ఓ పిల్లవాడు అంతగా వైరాగ్యం చూపించగలిగితే మరి గురువులీ విశేషకాల ప్రభావం చేత అమరత్వాన్ని సాధించగలిగే సంజీవనీ విద్యని నేర్పుతున్నప్పుడు మనమెంత కష్టపడాల్సివుంది ?

దానికంటే ముందు గురువుల వాక్యాల్లోని పరమార్థాన్నీ, అంతర్యాన్నీ చక్కగా అర్థం చేసుకోగలగాలి. ఆ తరువాత వాటిని మననం చేసుకుంటుండాలి. నిత్యజీవితంలో వాటిని సాధ్యమైనంత వరకూ ఆచరణలో పెడుతూండాలి. అదీ సాధనంటే. పూజలు, వ్రతాలు, నోములు, మంత్రజపాలు యివన్నీ సాధనలు కావన్నదందుకే? సాధనల వైపుకు తీసుకెళ్ళే మార్గాలే అవన్నీనూ. 'Nature is always right అనే భావన మన నెత్తురులో యింకిపోవాలి. కణకణంలో జీర్ణమై పోవాలి. మన పరిస్థితులు, మన బాధలు, మన సుఖాలు, మన ఆనందాలు, మన సమస్యలు, మన కష్టాలు, మన శత్రువులు, మన నౌకర్లు,

మన మిత్రులు, మన చుట్టూవున్న యిరుగు వారు, పొరుగువారు, మన పైవారు, క్రిందివారు. మనం కన్నవారు - మనల్ని కన్నవారు అందరూ కూడా ఎవరెవరెక్కడుండాలో, ఎవరెవరు ఎలా ఉండాలో, ఖచ్చితంగా వారందరూ అక్కడే, అలాగే వున్నారు. వాళ్ళంతా అలా ఉండటం వల్లే మీకు మేలు జరుగుతుంద'ంటున్నారు గురువులంతా.

గురువు-ప్రకృతిల మధ్యన స్వల్పమైన వ్యత్యాసాన్ని సూక్ష్మమైన తేడాని గమనించాల్సివుంది. టీచరు పాఠం చెప్తుంటాడు, క్లాసులో వున్న వందమందికీ అందరికీ ఒకేలా చెప్తాడు. అర్థం కాకపోతే అడిగితే మళ్ళీ చెప్తాడు. అవసరమైతే Extra classes పెట్టైనా సరే చెప్తాడు. దగ్గర కూర్చోపెట్టుకొని చదివిస్తాడు. ఆ టీచరే పరీక్షలప్పుడు ఇన్విజిలేటరుగా వస్తాడు. నిన్నటి వరకూ చెప్పిందే చెప్పిన లెక్కో, పాఠమో ప్రశ్నాపత్రంలో ఉంటే మనవాడే కదాని చచ్చినా చెప్పడు. ఎగ్జామినర్‌గా కఠినంగా వ్యవహరిస్తాడు. నిన్నటివరకూ 'యిది యింపార్టెంటు, యిది చదువు, ఆ లెక్క చెయ్యి' అన్న గురువే ఓ నియామక శక్తిగా ఎలా పనిచేస్తాడో ప్రకృతిగా తనపాత్రను ఏ మాత్రం కనికరం లేకుండా పోషిస్తాడు. మన స్తోత్రాలకి, మన ప్రార్థనలకి ప్రకృతి దిగిరాదు. తన నియమాల్ని మార్చుకొని ధర్మాన్ని తప్పదు. సాధకులైన మనం ప్రకృతిలోని ప్రతి వ్యక్తీ, ప్రతి సంఘటనా, ప్రతి పరిస్థితీ నిర్దుష్టమైన వ్యవస్థ ప్రకారం కదులుతూ వున్నప్పుడు యింక మన యిష్టాయిష్టాలతో ప్రమేయమేముంటుంది ? సంధికాలంలో ఈ పరిస్థితి చిత్ర విచిత్రంగా ఉంటుంటుంది. నిజంగా పరీక్షా సమయమే. ఆధ్యాత్మికతలో సాధకు లకిది చిత్ర విచిత్రమైన మలుపులు సృష్టిస్తుంది. అందుకే ఆధ్యాత్మికతకిది ఎమర్జన్సీలాంటిదన్నారు. ఎప్పుడెప్పుడేది చెయ్యాలో, ఎలా చెయ్యాలో ప్రకృతే గురువై తెలియజేస్తుందన్నారు కదా! ఎటొచ్చీ ఆ ప్రకృతి యొక్క భాష మనమర్థం చేసుకోగలగాలంతే. మన సాధనలూ అవీ అందుకొరకే.

మనం నిరంతరం గుర్తుంచుకోవల్సిన ప్రధానాంశమేమంటే మన దృష్టి ఎప్పుడూ ప్రపంచం వైపుండగూడదు. గురువువైపు ఉండాలి. గురువు



మనకెలా ఆజ్ఞాపిస్తే అలా నడుచుకుంటాం. మూలాధారం నుంచి విశుద్ధివరకు ఉన్న చక్రాలు మనల్ని ప్రపంచంలో పడేస్తాయి. అది దాటాలి మనం. ఆజ్ఞాచక్రం గురుస్థానం. మన దృష్టి ఉన్నతంగా ఉండాలి అని చెప్తారు. కళ్ళు మూసుకొని మన దృష్టిని - మన మనస్సును కనుబొమ్మల మధ్య ఆజ్ఞాచక్రం దగ్గర ఉంచుకోవాలి. అలా ఏ పని చేస్తున్నా కళ్ళు మూసుకున్నా తెరిచినా నిరంతరం ఉండేలా చూసుకుంటూండాలి. ఈ అలవాటు మనకా శూన్య స్వరూపుడ్ని త్వరితగతిన సాక్షాత్కారింప చేస్తుందని మరువగూడదు. మౌనంగా ఉన్న వాళ్ళకి అది సులభసాధ్యం. 'కరిష్యే వచనం తవ'. 'స్వయంగా నేనే నిర్ణయమూ తీసుకోను. నువ్వెలా చెప్తే అలా నడుచుకుంటాను'. అదీ అసలైన సమర్పణా భావం.

శ్రీరాముడు ఆయన జీవితంలో చాలా చక్కగా పాటించాడు దీన్ని. శ్రీరాముడు స్వయంగా ఏ నిర్ణయం తీసుకోలేదు. ప్రకృతి ఏం చెప్తోందో అది చేయడమే రామావతారం యొక్క ప్రత్యేకత. రామాయణంలోని కొన్ని ప్రధాన ఘట్టాల్ని కనక మనం పరిశీలించినట్లైతే మనకు ఈ విషయం చాలా స్పష్టంగా అర్థమవుతుంది. రామాయణం మొత్తమ్మీద రాముడు మాట్లాడిన మాటలు సుమారుగా ఓ ఏడో, ఎనిమిదో ఉంటాయంతే. నిరంతరం 'మౌనంగా ఉంటూ, ఆ మౌనాన్ని 'శక్తివంతంగా మార్చుకొనే ధీమంతులే ప్రకృతి భాషనర్థం చేసుకోగలుగుతారు. రాముడి దగ్గరకి విశ్వామిత్రుడొచ్చి 'యాగ రక్షణ చేయాలి ! తాటకి సంహారం చేయాలి నాతోరా నాయనా !' అంటే వెళ్ళాడా ? లేదు వశిష్ఠుడు 'వెళ్ళు !' అన్నాడు. వెళ్ళాడు. తాటకిని స్వయంగా చంపాడా? విశ్వా మిత్రుడు చంపమంటే చంపాడు. రాతిని అహల్యగా తనంతట తనే మార్చాడా? లేదు. విశ్వామిత్రుడే చెప్పాడు. 'ఆ రాయిని తన్ను' అని. అలాగే శివ ధనుర్భంగము కూడా విశ్వామిత్రుని ఆజ్ఞే. ప్రకృతి చెప్పినట్లు ఎవరు చేస్తారో వాళ్ళుకూడా రాముడైపోతారు.

రామాయణాన్ని అధ్యయనం చేసిన మనం యీ రహస్యోపాసనను అవగాహనం చేసుకొని ఆచరణలో ఆ రామ తత్త్వాన్ని పాటించ గలగాలి !'మౌన వ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్వం'. అన్న ఉపనిషద్వాక్యాన్ని మేడమ్ బ్లావెట్స్కీ 'The voice of silence' అనే పుస్తకంలో బ్రహ్మాండంగా రచించింది. పూర్తిగా మౌనంలోకి వెళ్ళిపోవడమే మనం చేయాల్సిందల్లా. అంతే. యింక అక్కడ చేసేదేముండదు. అప్పుడా 'మౌని' తన 'మౌనానికి' తానే ప్రతిధ్వనిస్తుంటాడు. తనకై తాను చేసేదేం లేదక్కడ. అదే రామావతార ప్రక్రియ. 'నాయనా! నీకు రేపు పట్టాభిషేకం' అంటాడు తండ్రి దశరథుడు. 'అలాగే అంటాడు. కైకేయి వచ్చి 'అడవులకు ఫో' అంటుంది. 'అలాగే' అంటాడు. అడవిలో రావణాసురుణ్ణి ఎలా చంపాలా అని దిగులుపడుతుంటే అగస్త్యుడు ఉపాయం చెబుతాడు. విభీషణుడు రావణుని మరణ రహస్యం చెప్పాడు. అప్పుడు రాముడు రావణుణ్ణి వధించాడు. లక్ష్మణుడోసారి మూర్ఛపోయాడు. రాముడికేం తోచలేదు. సుషేణుడనే వాడొచ్చి సంజీవనీ గురించి చెప్తాడు. ఎలా తేవాలో చెప్పాడు. ఎవర్ని పంపంచి తెప్పించాలో కూడా చెప్పేశాడు. Nature is always right.

### *కరిష్యే వచనం తవ.*

ప్రకృతి ఏది ఆదేశిస్తే అదే శిరసావహిస్తాను. ఏది చెబితే అది చేస్తానని దీక్ష తీనుకోవాలి. రాముడలా చేశాడు. అనేకమంది గురువులలా చేశారు. సాయి జీవిత చరిత్రలో కూడా యిలాంటి సంఘటనలు చూడచ్చు. మసీదులో ఉండగా శిష్యుల సేవలందుకుంటున్న సాయి దగ్గరకు హఠాత్తుగా నానావళి వచ్చాడు. 'ఏంటీ? శిష్యుల సేవలలో మునిగి తేలుతున్నట్లున్నావు? అక్కడి నుంచిలే!' అన్నాడు. తక్షణం లేచి నిలబడిపోయాడు బాబా. 'రా! యిలాగ' అన్నాడు. నానావళి దగ్గరికెళ్ళిపోయాడు బాబా. ఆ కథ తెలిసిందే మనకు. 'కరిష్యే వచేనం తవ'.



జగద్గురు పీఠాన్ని అధిరోహించబోయే భారతదేశము యొక్క శక్తి సామర్థ్యాలు మనం తక్కువంచనా వేసుకోగూడదు. అవసరం వస్తే సంపూర్ణ ప్రపంచానికి తిండి పెట్టగలదు. దిశానిర్దేశమూ చేయగలదు. చక్కటి క్రమశిక్షణతో నడిపించగలదు కూడా. అంతటి శక్తిసామర్థ్యాలు భారతదేశానికి రావడానికి గల కారణం ఆ గడ్డ మీద నివశిస్తోన్న ఋషుల సమర్థత, ప్రతిభలు మామూలు సామాన్యమైనవేం గాదు. ఓ సారి ఓ చోట పన్నెండు సంవత్సరాలు తీవ్రమైన కరువు కాటాకాలొచ్చాయి. గౌతముడు అనే ఋషి ఆ సమయంలో తన ఆశ్రమంలో సంపూర్ణ మానవజాతికీ ఆశ్రయమిచ్చాడు. అంతేగాదు వేళకి భోజనం పెట్టేవాడు. యిదొక అద్భుతమైనటువంటి విద్యకు సంబంధించిన సంఘటన. కట్టుకథలో, హరికథలో కావవి. మహాద్భుతమైన యదార్థ గాథలవి. తన ఆశ్రమంలో ఆశ్రయం పొందుతోన్న సమస్త ప్రజానీకానికీ ఎలా భోజనం పెట్టాడో తెలుసుకుందాం. పొద్దున సంధ్యావందనంతో విత్తనాలు నాటేవాడు. మధ్యాహ్నపు సంధ్యావందనానికి పంట కోసేవాడు. అంటే పొద్దున నాటింది మధ్యాహ్నానికి చేతికొచ్చేది. కోసేశాక తిరిగి మధ్యాహ్నం నాటి సాయంత్రం సంధ్యావందనానికి కోసేసేవాడు. ఆ విధంగా చేస్తూ సమస్త మానవులకూ సంవత్సరాలపాటు భోజనాలు పెట్టాడు. ఒక పూట, అరపూట కాద'ని చెబుతూ గురుదేవులు సంధ్యావందన మహత్యాన్ని గురించి తెలియచెప్పారు.

సంధ్యా వందనాన్ని ఆచరింపని వాడు ఏదీ సాధించలేడు. ముఖ్యంగా ఆధ్యాత్మిక జగత్తులో అతను సాధించేది వట్టి పిచ్చి భ్రమల్లోనే ఉండి పోతుంది. సంధ్యావందనం చేయని వారికి వేదవిజ్ఞానం వంటబట్టదు. ఋషుల అనుగ్రహానికి నోచుకోలేరు. గురువుల ఆశీర్వాదం ఎన్నటికీ పొందలేరు. ముఖ్యంగా ధ్యాన, ధారణ, సమాధి స్థితులనబడే యోగ విద్యా పరమైనవేవీ అనుభూతి చెందలేరు. పిచ్చి భ్రమల్లో కల్లబొల్లి అల్లికలతో సమయాన్ని వృధా చేసుకుంటూ జీవితాన్ని అసంపూర్ణ ఘట్టంగా మార్చుకుంటారు. 'మా సంస్థకి సంధ్యావందనాల్లేవండీ, యజ్ఞాల్లేవండీ

అంటూ రాగయుక్తంగా చెప్తుంటారు. అలాంటివారు నిజంగా రాబోవు రోజులలో ఎంత గందరగోళం పడబోతున్నారో' ప్రకృతిపరమైన ఎలాంటి ప్రమాదాలకు గురికాబోతున్నారో తక్షణం తెలుసుకొని వెన్వెంటనే ఆచరించవలసిన పరిస్థితి ఎంతోవుంది.

ఆశ్రమాలలో ఉన్నవారు, గురువుదగ్గర కొచ్చేవారంతా శిష్యులని భ్రమపడకూడదు. గురువు చెప్పినదాన్ని ఆచరించడానికి ప్రయత్నిస్తూ తనను తాను పూర్తిగా సర్వసమర్పణ చేసుకున్నవాడే శిషుడు తప్ప మిగిలిన వారంతా ఏదో కోరిక మీద అక్కడికొచ్చినవాళ్ళే. కరిష్యే వచనం తవ. **నీవేం చెప్తే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాననే భావన పటిష్టంగా ఉన్న శిష్యుడ్ని ఏ గురువూ వదులుకోడు.** అలాంటి శిష్యరత్నాన్ని జన్మజన్మలుగా వెన్నంటి నడిపిస్తుంటాడు. తానూ తోడుగా నడుస్తుంటాడు.

వీరబ్రహ్మేంద్రస్వామి తన చుట్టూ వున్న భక్తుల్లో అసలైన శిష్యులెవరో బహిర్గతం చేయడానికి సంకల్పించారు. 'మనుషుల గుంపు ఎక్కడెక్కడ వుండునో అక్కడక్కడ రాగద్వేషాలుండ గలవన్నట్టు సిద్ధయ్యగారిని చూస్తే మిగతా శిష్యులకి ఒళ్ళుమంట. అనేకాశ్రమాల్లో యిది మనకి స్పష్టంగానే కనిపిస్తుంది. (ఒకళ్ళని మరొకరు ప్రేమగా ఆప్యాయంగా పలకరించు కోలేకపోవడం చాలా విచారకరం. ఈ ధోరణి మూనుకొని చక్కని ప్రేమతత్వాన్ని అలవరచుకోవాలి.) సిద్ధయ్యగారిని ఎలాగొలా తమ జట్టులోంచి, వీలైతే ఏకంగా ఆశ్రమంలోంచే తప్పించేస్తే బాగుంటుందనుకున్నారు. వారి కుళ్ళు ఆలోచన గ్రహించారు గురువుగారు. దారిలో దుర్గంధం వ్యాపించింది ఉన్నట్టుండి. నడుస్తున్న భక్తులు, శిష్యులు ముక్కులు మూసుకొని దిక్కులు చూస్తున్నారు. అప్పుడెదురైంది వారికి దారిలో అల్లంత దూరాన ఓ కుక్క శవం. గురుదేవులు వీరబ్రహ్మంగారు ఆ వైపుకు నడక సాగించారు. సిద్ధయ్య గారు అనుసరించారు. తప్పేదిలేక మిగతావారు కూడా వారివైపు నడక సాగించారు. అందరికీ ఆకలిగా వుంది. తినేందుకేమైనా దొరికితే బాగుండని అందరికీ అనిపించింది చిత్రంగా.



అసలైన శిష్యుణ్ణి బహిర్గతం చేసేందుకు స్వామివారు 'మీకు బాగా ఆకలిగా వున్నట్టుంది' అంటూ చచ్చి పడున్న కుక్క దగ్గరికి నడిచారు. దుర్వాసన కొడుతున్న ఆ కుక్క చనిపోయి ఎన్నాళ్ళయిందో ? కళేబరానికి పురుగులు కూడా పట్టినై. ముక్కులు పగిలిపోతున్నాయని కొందరు దూరంగా కూడా వెళ్ళారు. 'ప్రస్తుతానికి దీన్ని తిని ఆకలి తీర్చుకోండ'న్నారు స్వామివారు కుక్క కళేబరాన్ని చూపిస్తూ. యిదేంటలా అంటున్నారని బిత్తరపోయి చూస్తున్నారంతా స్వామివారివైపు. 'సిద్ధా! నీవు కానివోయ్ ! అనడమాలశ్యం చకచకా వెళ్ళి కుళ్ళి, పురుగుల పట్టి, దుర్గంధం వేస్తూన్న ఆ కుక్క కళేబరం దగ్గర హాయిగా కూర్చున్నాడు సిద్దయ్య. చకచకా తీసుకు తినడం మొదలు పెట్టాడు. చూస్తుండగానే తినేశాడు. 'శిష్యత్వానికి పరాకాష్ఠ అది.' జై గురుదేవ !

చక్రవర్తే నీ పక్కనుండగా, పైగా నీ వాడై వుండగా అడగడంలో చచ్చు ఎందుకు? నీ దరిద్రాన్ని పోగొట్టే శాశ్వత పరిష్కారం కోరుకోవచ్చు కదా ? గురువుకు మన కోరికలు తీర్చమని అడగవచ్చా ? అంటే హాయిగా అడగవచ్చు. బిడ్డడు తన తండ్రిని కాక యింకెవర్ని అడుగుతాడు ? సరే. ఆ అడగటమే కాస్త వివేకాన్నుపయోగించి అడగడం మంచిది గదా. అయితే శిష్యుడైన వాడికి అడగాల్సి నవసరం లేదన్నారు. సర్వసమర్పణ చేసుకున్నాడు. కనక తనకంటూ కావల్సిందేముండదు. శిష్యుని పూర్తి బాధ్యత ఆ గురువుదే. 'ఆ గురువే చూసుకుంటాడు' అనే పరిపూర్ణ విశ్వాసం వుంచుకోవాలి ! ఏదీ అడుక్కోవాలనిపించదు. అలాంటి గొప్ప మానసిక స్థితిలో వుంటాడు. (సాయికి నీవు శిష్యుడివా? భక్తుడివా ? అనే పుస్తకం చదవండి)

అందరికీ శిష్యులమవ్వాలనే వుంది. కానీ అదంత ఆషామాషీ కాదు. ఆ శిష్యరికం అనే పథం అంత తేలిగ్గా అందుకోలేము. పతంజలి యోగ సూత్రాలలో ఆ మహర్షి కొన్ని మార్గాల్ని ఏనాడో అందించాడు.

వాటిని చక్కగా అభ్యసిస్తే అంత కష్టసాధ్యమైనదేమీ గాదది శిష్యరిక మనేది. ముఖ్యంగా యమ నియమాల్ని పాటించాలి. యమములు అంటే బాహ్యంగా చేసే ఆచరణలు. నియమములంటే మానసికంగా చేసే ఆచరణలు. అంటే అంతరంగ ఆచరణలు. యమములు 5, నియమములు 5 ఉన్నాయి.

బ్రహ్మచర్యం, అహింస, అసత్యం, అస్తేయం, అపరిగ్రహం. ఇవి యమములు.

బ్రహ్మచర్యమంటే బ్రహ్మయందు చరించుట. అంటే చీమ, దోమ దగ్గరనుంచి బ్రహ్మవరకు అంతా ఒకే అంతర్యామి సంచరిస్తు న్నాడనీ, మూల సూత్రమొకటేననీ గుర్తిస్తూ, దాన్ని దర్శిస్తూ ఉండాలి. యిదొక మానసిక స్థితి. శారీరకమైన బ్రహ్మచర్యం పాటించడం దీనిలో ఒక చిన్న భాగం మాత్రమే.

2. *అహింస* :- ఎప్పుడైతే మనకు ఒకే అంతర్యామి అందర్లో కనిపిస్తూంటాడో, అన్ని ప్రాణుల్లో దర్శనమిస్తూంటాడో ఇంక ఏ ప్రాణిని ఎవరినీ కూడా హింసించటానికి మనసొప్పదు. అంతేకాదు ఏ ప్రాణి బాధపడ్డా, ఎవరికి కష్టం కల్గినా సహించలేని ప్రేమమయస్థితిలో ఉండాలి. మనస్సులోనైనా సరే. ఎవరికీ కష్టం కలగాలని ఊహ కూడా చేయకుండా ఉండగలగాలి. అదీ అహింస అంటే.

3. *సత్యం* :- సర్వత్రా బ్రహ్మయే నిండి ఉన్నాడన్న సత్యాన్ని దర్శించే వాడు మామూలుగానే అబద్ధాలు ఆడలేడు. అసలు అసత్యం ఆడే అవసరమే రాదు. అంటే ఎప్పుడూ కూడా సత్యం పైనే దృష్టి ఉంచుకుంటూ అదే మానసిక స్థితిలో ఉండాలి.

4. *అస్తేయము* :- దేన్నీ దొంగిలించకుండా ఉండటం, తనది కాని వస్తువుని కాజేయకుండా ఉండటమే కాదు. మనస్సులో కూడా తనకది కావాలని అనుకోకుండా ఉండాలి. అదే అస్తేయమంటే



5. *అపరిగ్రహము* :- మనది కాని వస్తువును దాని సొంతదారుడు ఇచ్చినా తీసుకోకుండా ఉండగలగాలి. ఈ ఐదింటినీ యమములు అంటారు.

ఇక నియమములు పరిశీలిద్దాం. 1. శౌచము, 2. సంతోషము, 3. తపస్సు, 4. స్వాధ్యాయము 5. ఈశ్వరప్రణిధ్యానములను అభ్యసించటం.

ఈ ఐదింటిని నియమాలు అంటారు.

1. *శౌచము* :- అంటే పవిత్రత. ఇది బాహ్యానికి అంటే శరీరానికి, ఆంతరికానికి అంటే మనస్సుకి సంబంధించి రెండు రకాలుగా ఉంటుంది. ఎదుటివాళ్ళలో ఉన్న దోషాలు ఎంచకూడదు. మనస్సు నిర్మలంగా అయ్యే కొద్దీ అలవడుతుంది. **ఎదుటివాడిలో దోషాలు మనకు కనబడ్డాయంటే అవి అన్నీ మనలోనే ఉన్నాయని అర్థం.**

2. *సంతోషం* :- అనుకొన్నది జరిగితే సంతోషం. జరగకపోతే సంతోషం ఉండదు. కోరికల సంఖ్య తగ్గించుకోవాలి. అదే సంతోషానికి దారి తీస్తుంది. ఎప్పుడూ సంతృప్తిగా ఉండటం నేర్చుకోవాలి.

3. *తపస్సు* :- SIVA Principles విధిగా పాటించి తీరాలి. సమయ సంయమనము - ఇంద్రియ సంయమనము - వాక్ సంయమనము - అర్థ సంయమనము. (SIVA గుర్తుంచుకోడానికి తేలిక యీ అక్షరాలు.) డైరీ వ్రాసే అలవాటు ఎంత గొప్పదో మీకు సరిగా అర్థమవడంలేదు. ప్రతిఒక్కరూ, ప్రతి సాధకుడు డైరీరాయడం తప్పనిసరి అని చెప్పారు. దీన్ని ఎంత త్వరగా ఆచరించగలిగితే అంత మంచిది. దీనివల్ల ఎంతెంత సమయమును మనం దుర్వినియోగం చేస్తున్నామో తెలుసుకోవచ్చు.

4. *స్వాధ్యాయము* :- స్వ + అధ్యాయము తనను తాను అర్థం చేసుకోవటం. ప్రకృతిని జయించిన గురువుల చరిత్రలు చక్కగా

చదవాలి. వారు జీవితంలో ఎలా ప్రవర్తించారో బాగా అవగాహన చేసుకోవాలి. అలా ఆచరించేందుకు ప్రయత్నిస్తూండాలి !

5. *ఈశ్వర ప్రణిధానము* :- భగవంతునికి లేక గురువుకు సర్వ సమర్పణ చేసుకొని జీవించాలి.

ఈ మధ్య కాలంలో ఆధ్యాత్మికతను ఓ వర్గం వారు భ్రష్టు పట్టించారు. కొన్ని పడికట్టు పదాలను తరచు ఉపయోగిస్తూ ఆ పదాల యొక్క శక్తినే పాడు చేశారేమో అనిపిస్తుంది. మన జీవితాలలో ఉపయోగపడనటువంటిది ఎంత గొప్పదైనా అలాంటి విద్య మనకు అక్కర్లేదు. రాబోయే రోజుల్లో ఇప్పుడున్న యూనివర్సిటీలన్నీ మూతపడిపోతాయి. రెసిడెన్షియల్ కాలేజీలన్నీ కుప్ప కూలిపోతాయి. కానీ ఒక్క విద్య మాత్రం చిరస్థాయిగా నిలబడిపోతుంది. ఆ విద్య మనకిక్కడ నేర్పబడుతోంది. రాబోవు రోజుల్లో బయోటెక్నాలజీ అనే పేరుతోనో, జెనెటిక్ ఇంజనీరింగ్ అనే పేరుతోనో, కాంన్షియస్‌నెస్ టెక్నాలజీ అనే పేరుతోనో అందరికీ నేర్పబడుతుందీ విద్య. అతి పురాతనమైన, నిత్య నూతనమైన, శాశ్వతమైనటువంటి యీ విద్య మనకు అమరత్వాన్ని ప్రసాదిస్తుందని చెప్పారు. అతి త్వరలో ప్రపంచంలో చావు అనేది లేకపోవడం ఖచ్చితంగా మనమంతా గమనిస్తాం. మన మధ్య అనేక మంది మృత్యుంజయుల్ని చూస్తాం.

గురువులంతా మనల్ని ప్రాధేయపడి మరీ మరీ అడుగుతోంది ఏమంటే మీకు తెలుసున్నది ఏదో అదే అంతా అనే భ్రాంతిలోంచి త్వరగా బయటపడండి. అలాగే మీకు తెల్సిందే సరియైనది అనే భ్రమలోంచి కూడా తక్షణం బయటపడండి. లేదా రాబోవు రోజుల్లో జీవచ్ఛవాలుగా బ్రతకవలసివస్తుంది. 'భగవంతుడా నువ్వే మార్చు, గురుదేవా యివన్నీ నువ్వేచేయి. అనేటువంటి మీ అమాయకపు, మోసపూరిత పదాలకు ఏ గురువు, ఏ భగవంతుడు బుట్టలో పడేడు. మీ వైపు రాడు. ప్రతిదీ మానవులైన మీరే చేయాల్సి ఉన్నది. గతంలోలా భగవంతుడో, గురువో చేసే రోజులు పోయాయి'. అంటోన్న గురువుల మాటలలోని ఆవేదనని గ్రహిద్దాం. నేడు ఆ దయామయుల సందేశాన్నీ, ఆహ్వానాన్నీ అందుకోలేకపోతే, పరమగురువులందిస్తున్న ఈ రహస్యమయ సమాచారాల్ని మనమే ప్రపంచాని కందజేయ లేకపోతే ఈ మానవజాతి మొత్తం వెనక్కి విరుచుకుపడిపోయి జంతు జగత్తు కన్నా హీనమై వృక్ష జగత్తు కూడా దాటి ఆపై వెనకాలెక్కడో ఉన్న ఖనిజ జగత్తులోకి కుప్ప కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ మానవజాతి మళ్లీ ఎన్ని కోట్ల సంవత్సరాలు వెనక్కి జారిపడిపోతుందో ఊహించలేమంటూ ఆందోళన చెందుతున్న వారే యిలా అంటున్నారు. 'మిగతావారి సంగతి కాస్త అటుంచి ఈ విద్యను ఈ రహస్య సమాచారాల్ని మీ పరిధిలో శక్తివంచన లేకుండా అందరికీ అందజేయలేకపోతే నాకేం బట్టిందనో, వేరెవరో చూసుకుంటార్లే అనో తటస్థంగా ఊరుకుంటే మీకు ఆధ్యాత్మికతంటే ఏంటో గూడా కనీసపు అవగాహన కూడా లేనట్టే.



నాకేంపట్టిందని ఎవరికివారు అనుకోవటం వినాశనానికి దారితీస్తుంది. నేడు మనమెదుర్కొంటున్న రాజకీయ, సాంఘిక పరమైన సంక్షోభ పరిస్థితి దానివల్లే ఏర్పడింది. ఈ వాతావరణ కాలుష్యాలు దానివల్లే ఏర్పడింది. నేడు పృధ్వీ గ్రహాన్ని పేలిపోబోయేట్టు తయారు చేసింది నాకేంబట్టిందని అనుకుంటున్న రాక్షస ప్రవృత్తి గలవారే. ఇక ఈ 'నాకేం బట్టింది' అనే విధంగా ఆలోచించే వారిని ప్రకృతి సహించి విడిచిపెట్టదు. అలాంటి వారు భూమికి నిజంగా ఎంతో భారం కలిగిస్తున్నారు. ఋషుల అశ్రునయనాలు, ఆవేదన, ఏ మాత్రం వారిని కదిలించలేకపోవటం వారు ఋషి సంతతికి చెందినవారు కానే కాదు. ఈ విశేషకాలంలో కొన్ని చిత్రాతి చిత్రమైన ఆత్మలు మనుష్యశరీరాలు ధరించాయి. వాటి వికృత ప్రభావం ఎక్కువ శాతం మిగతా మానవ జాతిమీద చూపిస్తుంది. అలాంటి రాక్షస ప్రవృతి గల మనుషులు మహాకాలుడు కొంగుజాచి అర్ధించినా, గురువులు ప్రాధేయపడి

అడుగుతున్నా, సాక్షాత్తు వారనుకుంటున్న ఏ భగవంతుడో ఎదురునిల్చి అర్థించినా ఆలోచిస్తాం, పరిశీలిస్తాం అనే వర్గంవారు రాబోవు రోజుల్లో సుఖశాంతులతో ఉండగలరంటే, ఆరోగ్య ఐశ్వర్యాలతో జీవిస్తారంటే ఎలా సంభవమది ? ఋషి ప్రణాళికలో, కనీసం వారి ఆవేదనలో భాగం పంచుకోలేని, కనీసం వారి అశ్రునయనాలను అర్థం చేసుకోలేనివారు మనిషిగా చెప్పుకునేందుకు కూడా పనికివస్తాడను కోవటం అసంభవం. ఇక్కడ గురుదేవులు అందిస్తున్న ఓ మహా వాక్యాన్ని గ్రహిద్దాం. "మీరనుకుంటున్నారేమో గురువులకు పనికొచ్చేపనులు చేయకపోతే, వారికి సాయపడకపోతే ఆ ఋషుల ప్రణాళిక ఆగిపోతుందనుకుంటున్నారేమో ? అది ఎన్నటికీ ఆగదు. అసంభవాల్ని సంభవాలుగా మార్చుకోగలిగే శక్తివంతుల్ని తక్కువ అంచనా వేయకండి. మీరు ముందుకు రాకపోతే నష్టపోయేది మీరే. ఋషులకేమి అవ్వదు. గురువులకు అంతకన్నా ఏమీ అవ్వదు . అది గుర్తుంచుకోండి" అన్నారు. యుగశిల్పి పరమపూజ్య గురుదేవులు శ్రీ పండిత శ్రీ శ్రీరామశర్మఆచార్య ఎత్తైన తలగడా పెట్టుకొని నిద్రపోయేవారు. అలాంటి మహితాత్ముడికి మన సంకుచితత్వం, మానసికస్థితి అప్పుడప్పుడూ గుర్తొచ్చి ఎంతో దుఃఖించేవారట రాత్రంతా. వారెంతగా కన్నీరు కార్చేవారంటే తలకింద పెట్టుకున్న ఎత్తైన తలగడాలు తెల్లారేసరికి పూర్తిగా తడిసిపోయుండేవిట. ఆయన ఆత్మకథలో రాసుకున్నారీ విషయాన్ని.

" తుమ్మితే ఊడిపోయే ముక్కుకు మేకప్ చేసుకొంటున్నారేమో చూసుకోండి ! మీరు ప్రాణాయామాలు చేస్తున్నారు-ఆసనాలు వేస్తున్నారు. అవి సాధనలు కావు. ధ్యానం చేస్తున్నారు -సంధ్యావందనం చేస్తున్నారు అవీ సాధనలు కావు. నిత్యజీవితంలో మనం చేస్తున్న యిలాంటివన్నీ సాధనలేనని భ్రమిస్తూ యిదంతా ఆధ్యాత్మికతను కుంటూ మోసపోతున్నాం. ఈ నగ్నసత్యాన్ని కాస్త పరిగణనలోకి తీసుకొని ఆలోచించుకోలేకపోతే ఏకంగా మూర్ఖత్వంతో నట్టేట మునిగినట్టే.



అలాగే దీక్షంటే ఏ గురువో యిచ్చేదికాదు. ఒకవేళ ఫలానా స్వాములవారో మరొకరో దీక్షయిస్తున్నారని అంటే అది పిచ్చి భ్రమల్లో విహరించే కొందరు జనాన్ని నట్టేట ముంచటానికి చేసే మోసపూరిత చర్య అది. ఏ మంత్రదీక్ష అయినా యిచ్చేది కాదది. తీసుకునేది. ఫలానా మంత్రాన్ని దీక్షతో చేస్తానని నిర్ణయించుకొని, చక్కటి భక్తి శ్రద్ధలతో క్రమం తప్పకుండా చేయడం దీక్ష అంటే.

'ఫలానా సంస్థవారు మంచిమంచి గ్రంథాల్ని అందచేస్తున్నారు ఏంటో చూద్దామని చదివాను చాలా బాగున్నట్టున్నాయి' అనగానే ఆ గురువుకి చమటలు పడతాయి. గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టుంటుంది. 'ఓర్నాయనో అవన్నీ బుర్రకెక్కితే నా గతేం కాను' అనుకొని అదేదో సినిమాలోలాగా 'దులిపెయ్.....! బుర్రలోనుంచి దులిపెయ్ ! యిప్పుడు చేస్తే చేశావు. యింకెప్పుడలా చేయకు నాశనమైపోతావ్ ! అననిపించుకున్న భక్తజనులు కోకొల్లలు. మీరనుకుంటున్న సాధనలు ఆధ్యాత్మికతపట్ల మీ అభిప్రాయాలు, మీ గురువు మీకు అందించిన ఉపదేశాలు యింకో గురువు చెప్పిన విషయాలతో ఏకీభవించ లేకపోతే - అవి మీకు విరుద్ధమని తోస్తే మీరు పెద్దప్రమాదంలో, పిచ్చిభ్రమల్లో ఉన్నట్టే అనేకమంది మా గురువు దగ్గర మేము మంత్రదీక్ష తీసుకున్నాం. అయినా మళ్ళీ మీ దగ్గర కూడా తీసుకోవచ్చా ? అనే సందేహాలతో మాష్టారు దగ్గరికి వచ్చి అడుగుతుంటారు. శుభ్రంగా తీసుకోవచ్చు. మీకు ఓపికుంటే రోజుకో మంత్రదీక్ష తీసుకోవచ్చు. అలాగే ధ్యాన విధానాలు మార్చుకుంటూండవచ్చు. ఎటొచ్చీ మీకర్థమ వ్వాల్సిందేమంటే 'మననాత్ త్రాయతి యితి మంత్రః మాటిమాటికీ మననం చేసుకుంటూండడం మంత్రం. మంత్రజపం చేయగా చేయగా ఒకచోట మంత్రం ఆగిపోతుంది. శబ్దాతీత స్థితి ఏర్పడుతుంది. అప్పటివరకు మీరు చేసిన మంత్రము మిమ్మల్ని లోతుల్లోకి తీసుకెళ్ళి వదులుతుంది. అసలు మంత్రం యొక్క ఉద్దేశ్యమే అది. అంతర్ముఖం చేయడాని కుపయోగపడేది. అది ఏ మంత్రమైనా కావచ్చు. అసలక్కడి నుంచే ఆధ్యాత్మికత మొదలవుతుంది.

రావణాసురుడ్ని వాల్మీకి మహర్షి 'న భూతో న భవిష్యతి' అని మెచ్చుకున్నాడు. అయినా రాక్షసుడిగానే మిగిలిపోయాడు. మనమలా కాకూడదని గురువుల యొక్క ఆవేదన. ఆ కలవరపాటువల్ల మన ప్రవర్తనకు ఆ దయామయులు ఆందోళన చెందుతూ ఈ పచ్చినిజాల్ని మన ముందుంచుతున్నారు. మీరసలు ఆధ్యాత్మికతలోకే యింతవరకు రానేలేదు. అసలు మీకు దానిపట్ల సరియైన అవగాహన కూడా లేదు. అతి సమీపకాలంలో యిలాంటి వారిని ప్రకృతి ఉండనివ్వదు. నిర్దాక్షిణ్యంగా ఏరి పారేస్తుంది. గొర్రె కసాయివాడ్ని నమ్మినట్టు జ్ఞానమటుంచి యింగితజ్ఞానం కూడా (కామన్‌సెన్స్) లేనివాళ్ళు శిష్యగణాల్ని పోగుచేసుకుంటూ 'గాయత్రి చేయకండి. ఆ ఆశ్రమాలనీ, ఈ పీఠాలనీ వెళ్ళేరు. అలావెళ్ళకండి. అక్కడి వారు చెప్పే సాదనలు, ఉపన్యాసాలు వినకుండా ఉండేందుకు ప్రయత్నించండి. ఒకవేళ మీరు నామాట ఖాతరు చేయకుండా యివన్నీ వింటే మీకదీ రాదు యిదీరా దంటూ చాలా తెలివిగా శిష్యుల్ని బెదరగొట్టి వెర్రివాళ్ళని చేసి ఆ మురికి కూపంలోనే కట్టి పడేసుకుంటున్నారు. పరమ గురువ్యలు చెప్తోన్న ఈ **మహావాక్యాల్ని లేక వేరెవరో చెప్తోన్న మామూలు ఉపన్యాసాలే వింటేనే అయోమయంలో పడిపోయే శిష్యగణాలు దేనికి పనికొస్తారు. ? తుమ్మితే ఊడిపోయే ముక్కుకి మేకపిలు చేసుకున్నట్టు అన్నిటికి చెడ్డ భ్రష్టులుగా మిగిలిపోతారు.**

ఎమ్. ఎస్.లు, ఎమ్. డి.ల వంటి ఉన్నతమైన డిగ్రీలు పొందిన డాక్టరు దగ్గరకెళ్ళి తనకున్న వ్యాధి గురించి చెప్పిమందు తీసుకుని రిక్షాలో యింటికి తిరిగి వస్తున్న ఓ రోగి మహాశయుడు దోవలో రిక్షావాణ్ణి అడిగాడు. 'ఈయన ఫర్లేదంటావా ? ఈయన రాసిన మందు పనిచేస్తుందంటావా ?' అని - సంవత్సరాల తరబడి దీక్ష తీసుకొని వైద్యుడయ్యాడాయన. ఆయన దగ్గర మందు తీసుకున్నాడు ఈ రోగి. వీడికి రిక్షా అబ్బి సలహా చెప్తున్నాడు. 'ఈయనగారా లాభం లేదండి ! అల్లక్కడ బేషనుకాడ ఒకాయనున్నాడు. ఆయన కరెస్టు' అన్నాడని



చేతిలో మందులు పక్కన గిరాటేసి 'అయితే అటేపోనీ' అన్నాడట ఆ రోగి రిక్షావాడితో.

సరిగ్గా అలాగే 'గాయత్రీమంత్రం చేయకండి!' అది బ్రాహ్మలనే కులంవారి సొత్తు. ఒకవేళ మీరెవరైనా చేశారో మీ యిష్టం. 'సర్వనాశనమై పోతారు-నెత్తి అణుస్తుంది వంటి' మాటలు విని కొందరు దీక్షా పరులు సైతం బెంబేలు పడిపోతున్నారు. వారికి మాష్టారు యిలా తెలియ జేస్తున్నారు.'అగ్ని స్వరూపుడు -గాయత్రీ ప్రతిరూపము-యుగదృష్ట అవతార పురుషుడు -దివ్యాత్ముడు-మహర్షి ఐన పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్యుని సత్యవచనాలపై విశ్వాసం లేకపోవడమే అశుభకరమైనది. వారిపట్ల, వారిమాటలపట్ల అలక్ష్యం చూపడం నిజంగా పరమ దౌర్భాగ్యం కాక మరేమిటి ?

మన ఆశ్రమాలు, మన ఆధ్యాత్మిక పీఠాలు, సరియైన అవగాహనలేని గురువులు, మన అజ్ఞాన జనితమైన భగవత్సేవలు, అనాగరికమైన ప్రవృత్తితో ఉంటూ నాగరికులుగా నటిస్తున్న మన నటన, వీటిన్నింటినీ మించిన అహంకారము సద్గురువుల్ని ఎంతగా క్రుంగదీస్తుందో మనం ఊహించలేం. ఒక్కసారి వారి వైపునుంచి ఆలోచించేందుకు ప్రయత్నిద్దాం !

"బాబుగారూ మీరు చాలా బలహీనంగా ఉన్నారు. నీరసంగా కూడా కనిపిస్తున్నారు. భక్తులెవరినన్నా దగ్గరుంచుకోకపోయారా! వారికి మీ సేవాభాగ్యాన్ని కల్పించినట్టుండేది గదా".

భక్తుల కోరికల జాబితాలు తీర్చి తీర్చి శారీరకంగా బాగా అలిసిపోయి డస్సిపోయిన ఆ సద్గురువిలా అంటున్నారు. " ఏం భక్తులో ఏంటో ఎంతసేపూ ఆ కోరిక తీర్చు - ఈ కష్టం తీర్చు అంటూ చుట్టుకుంటున్నవారే. ఎన్ని సమస్యలు తీర్చినా, ఎన్నెన్ని కోరికలు నెరవేర్చినా ఎప్పుడో, ఏ ఒక్కటో నెరవేరని దాన్ని పట్టుకొని నామీద అలుగుతారు. నిష్టూరాలల్లుకుంటారు. అనుకున్నది నెరవేరితే

సేవజేస్తామంటూ వస్తారు. వద్దులే అంటే వినరు. వదలరు. పోన్లే కదాని చేయనిస్తే ఆ చేస్తున్న వారిమీద చేయలేనివారు తెగ అసూయ పడిపోతారు. పంతాలు, ద్వేషాలు, వాదోపవాదాలతో వాతావరణాన్ని కలుషితం చేసుకుంటారు. ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకుంటారు. జట్లుగా ఏర్పడతారు. ముఠాలు కడతారు. అటు రాకున్నా బాగానే ఉంటుంది లేదా సక్రమంగా వచ్చినా బాగానే ఉంటుంది. సేవచేస్తున్న వాళ్ళుకూడా కొద్దిసేపట్లోనే వాళ్ళకేదో నామీద ప్రత్యేకమైన హక్కున్నట్టు అర్థమైన వాళ్ళనూతెచ్చి నా నెత్తికెక్కిస్తారు. రికమండేషన్సు చేస్తారు. అర్థమైన చోట్లకీ రమ్మంటారు. వెళ్ళకపోతే తమమాట పోయిందని ఏడుస్తారు. యిదంతా ఆధ్యాత్మికతనీ, భక్తనీ, సాధనలనీ పచ్చిగా మోసగింపబడుతున్నారు.

మొదట్లో అందరూ నే చెప్తోంది వింటూ నే నందివ్వ దలచిన శ్రేయస్సు నందుకోవాలనే వస్తారు. అలా వచ్చిన వాళ్ళు మెల్లిమెల్లిగా కొద్దికాలానికి వారు చెప్పినట్టల్లా ఆడమంటారు. అలా ఆడకపోతే నామీదే గుసగుసలు ప్రారంభిస్తారు. గురువుగారు మారిపోయాడంటారు. అసంతృప్తి చెందుతారు. తిరిగి పాతకాలపు దౌర్భాగ్యపు జీవితాలవైపే దృష్టి సారిస్తారు. అటువైపెళ్ళి పోతామని బెదిరిస్తారు.బెదిరిస్తూ నన్నాడించాలని చూస్తారు. సేవ చేసేందు కొస్తామంటారు. సరేనంటే తామెంతో అధికులైనట్లు అహంకరిస్తారు. వారే క్రమక్రమంగా నాపట్ల తేలిక భావాన్ని చూపిస్తారు. నేనేదో వాళ్ళపై ఆధారపడి వాళ్ళని నా స్వప్రయోజనాల కోసం వాడుకో జూస్తున్నట్టు భావిస్తారు. అలా కాదని తెలిసేలా చేస్తే యింతసేవా చేయించుకొని అవసరం తీరగానే విదిలించి పారేసినట్లు బాధపడతారు. నా ప్రతిచర్యా, ప్రతిమాటా వాళ్ళ యిష్టాయిష్టాల త్రాసులో చూసుకుంటూ నాకు తీర్పులు చెప్తారు. వారి అంతర్యాన్నీ, మనోభిప్రాయాన్నీ గుర్తించి దూరంగా ఉంచితే వారి మంచితనాన్ని నేనపార్థం చేసుకుంటున్నానని వాపోతారు. గుర్తించ నట్టుగా, చూడనట్టుగా ఉంటే వాళ్ళ దుశ్చర్యలు యధేచ్ఛగా సాగిస్తూ



నాపై చులకన భావన పెంచుకుంటారు. చాలామందికి తెలీదుకానీ ఈ మనుషులతో మనగలగడం చాలా కష్టం. వారిసేవకంటే ఈ అనారోగ్యమే మేలనిపిస్తుంది."

శ్రీ పాకాలపాటి గురుదేవులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారితో ఎంతో ఆవేదనగా పలికిన పలుకులివి. శ్రీ పాకాలపాటి గురుదేవుల వాక్యాలతో ఈ మహాసత్యాల్ని తెలుసుకుంటున్నప్పటికీ యిది వారికొక్కరికీ సంబంధించినది కాదు. జంతుమానవుడిగా జీవిస్తూ ఆధ్యాత్మిక ముసుగులో గురువుల చెంతచేరి వారి శరీరాల్నీ, వారినీ అవగాహనా లోపంతో ఆవేదనకు గురిచేస్తుండడంలో ఏ సద్గురువునీ మనం వదల్లేదు. చిత్రహింసలకి గురిచేశాం. ఆఖరికి హత్యచేయడానికి కూడా వెనుకాడలేదు ఈ మానవజాతి. యికపై యిలాంటి దుశ్చర్యలు సాగబోవు. పృథ్వీగ్రహము మనపట్ల ఉగ్రరూపంతో మండిపడుతోంది. గురువులు సహించి ఉపేక్షించినా ఆధ్యాత్మికత తప్ప తతిమ్మా వాటినన్నిటినీ ప్రకృతి నిర్దాక్షిణ్యంగా ఎత్తివేసే ప్రణాళిక జరగబోతోంది. ఈ సందర్భంగా మనం ఎవరికి వారము మనల్ని మనం కడు జాగ్రత్తగా విశ్లేషించుకోవాల్సి ఉంది. మనం జీవిస్తోన్న విధానము ఆధ్యాత్మికతకు ఏ మాత్రం భిన్నంగా ఉన్నా ప్రకృతి ఏలివేతకు గురికావలసి వస్తుంది. మన మూర్ఖపు వాదనలు, మొండి వైఖరి అహంభావపు చర్యలు మనల్ని ప్రమాదాల్లో ముంచుతాయి.

ముఖ్యంగా మనం అవగాహన చేసుకోవాల్సిన అంశాల్లో గురుచేతనత్వము అత్యంత ప్రధానమైనది. సూర్యకిరణాల యొక్క మూర్తీభవించిన స్వరూపమే ఈ ప్రపంచము. అలాగే జ్ఞానము యొక్క మూర్తీభవించిన స్వరూపమే గురువు. వేదమనగా జ్ఞానమే. వేదవిదులు గురువులు. సూర్యకిరణ విజ్ఞానమే వేద విజ్ఞానము. ప్రతి గురువు ఈ సూర్యకిరణ విజ్ఞానాన్ని ఆమూలాగ్రం ఔపోసన పట్టినవాడే. ప్రతిఋషీ ఈ సూర్యుడి నుపయోగించుకున్నవాడే. మనక్కనిపిస్తోన్న ప్రతీ పదార్థమూ, ప్రతి అణువు సూర్యకిరణాలతో తయారైనదే. అలాగే మన కంటికి కనిపించని ప్రతిదీకూడా ఘనీభవించిన సూర్యకిరణాలే. ఓ

బట్టకున్న నిలువు దారపు పోగులు, అడ్డదారం పోగుల్ని క్రమక్రమంగా పీకేస్తూపోతే ఆ బట్ట మాయమౌతుంది. ఘనీభవించినటువంటి సూర్యకిరణాలే ఈ ప్రపంచమంతా. సూర్యకిరణాలు లేకపోతే అసలేం ఉండదు. సముద్రంలోని ఒక్కో బిందువు ఒక్కో బిందువు నీటిని తీస్తేస్తూ పోతే ఆ సముద్రం మాయమవుతుంది. అలాగే యిదీనూ. యీసృష్టి అణువణువు సూర్యకిరణ నిర్మితమనని స్పష్టంగా అర్థమవ్వాలి. 'సూర్య ఆత్మా జగతస్థుషశ్చ' అన్నారందుకే. ఆధ్యాత్మికతకు మూల భూతమైన ఆ సూర్యుడ్ని మనం ఉపాసన చేయాల్సి ఉన్నది.

అధర్వణ వేదంలో 'హృద్రోగ నివారక సూక్తం ' అని ఒకటి ఉంది. వేదాలన్నీ సూర్యకిరణ విజ్ఞానమే అని కదా తెల్సుకున్నాం. మరి అలాంటపుడు హృద్రోగానికి మందు కూడా ఆ సూర్యకిరణాల్లోనే ఏవో ప్రత్యేకమైనవి నివారణ చేసేవి ఉంటాయని గమనించం. మర్చిపోతాం. మనకేం గుర్తుంటుందంటే ఇవి చదవచ్చా ? చదవకూడదా ? అనే మీ మాంశలో కొట్టుమిట్టాడుతుంటాంతప్ప ఆ అద్భుతమైనటు వంటి విజ్ఞానాన్ని సూర్యకిరణాలను నిత్యజీవితంలో ఉపయోగించు కుంటూ, వాడుకుంటూ మన రోగాలు, కష్టాలు, బాధలు, పోగొట్టుకోవచ్చు నిపించటంలేదు. అధర్వణవేదం ఆరవకాండలో మన బ్లడ్‌ప్రెషర్, హార్ట్ ట్రబుల్స్‌లవంటి రుగ్మతల్ని ఎలా తగ్గించుకోవచ్చు అనేది చాలా స్పష్టంగా చెప్పబడింది. అసలు దానిపేరే హృద్రోగ నివారక సూక్తము అని పెట్టారు. దాన్ని చదివిన మనకు వేద విదులైన ఆ ఋషుల యొక్క ప్రతిభ ఎంతటి గొప్పదో మనకర్థమవుతుంది.

పనికిరాదనుకోంటున్న మలమువంటి మలిన పదార్థాలు, కుళ్ళిన చెత్తా చెదారాలు మొక్కలకి, చెట్లకి బలాన్నెలా చేకూరుస్తుందో అలాగే ప్రకృతిలో ఒకదాని విషం మరొకదానికి ఆహారం మవుతుంది. హృద్రోగము కలిగించినటువంటి కొన్ని విషపు కణాలు సూర్యుణ్ణుంచి వస్తోన్నటు వంటి ఎరుపురంగు కిరణాలు శరీరం నుంచి బహిర్గత పరుస్తాయి. మన కంటికి కనిపించక పోయిన్నా వాస్తవానికిదే జరిగేది,



అలా బయటకు వచ్చిన హృద్రోగ కారక విషం కీటాణువులు ప్రకృతిలో మరొకరికి హాని చేయకుండా ఉండేందుకు, వ్యాపించకుండా ఉండేందుకు, ఋషులు చెప్తోన్నదేమంటే ప్రక్కన ఓ రామ చిలకని ఉంచుకోండి, హృద్రోగంతో బాధపడుతోన్న రోగి నుండి ఆ సూర్యకిరణ ప్రభావంతో వెలువడిన విషకీటాణువులు చిలక పీల్చుకుంటుంది. దానికది అవసరం. ఎంతో బలాన్నిస్తాయి కూడా దానికి. యీ చక్రీయ క్రమం ప్రాకృతిక నియమం. లలితోపాసనలో చిలక యొక్క ప్రస్తావనలోని ఆంతర్యం ఇదే.

తులసి మొక్క ఎంత పవిత్రమైనదంటే, ఎంతటి మహాప్రయోజ నాల్ని అందిస్తుందంటే అవి ఇన్ని అని వివరించలేమన్నారు. దానికంత పవిత్రత, ప్రాముఖ్యత కేవలం సూర్యకిరణాలవల్లే చేకూరింది. సూర్యుణ్ణుంచీ వస్తోన్న కిరణాల్లో అత్యంత పవిత్రతని కలుగజేసే ఆ విశేష కిరణాల్ని నిరంతరం తనవైపు తులసి పీల్చుకుంటుందన్నమాట. మనం ఆ తులసికి దగ్గరగా ఉంటూ పనిపాటలు చేసుకుంటూ తిరుగు తుంటామనకోండి లేదా ఆ ప్రాంతంలో కూర్చుని ఏ ప్రాణాయామమో, శ్వాససాధనో చేసుకున్నామనుకోండి ఖచ్చితంగా మనలోకి ఆ పవిత్రతను కలిగించే సూర్యకిరణాలు తప్పకుండా ప్రవేశిస్తాయని తెలియాలి. ఈ మహా ప్రయోజనాల కోసమే ఋషులు అశ్వర్థ వృక్షము మొదలైన వృక్షాలకు ప్రదక్షిణలు విధించారు. ఈ రహస్యాన్ని అవగాహన చేసుకుని ఆచరించే మన ఆచరణలు సంపూర్ణ ఫలితాల్ని అందజేస్తాయి.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవే నమః

ఈ శ్లోకము సూర్యుడి గురించి చెప్పబడిన శ్లోకము. సూర్యుని స్తుతి యిది ? బీజాల నంకురింపజేస్తూ సృష్టికి కారకుడౌతున్నాడు. ప్రతి అణువునూ సృష్టిస్తున్నాడు. ఉదయాన బ్రాహ్మీశక్తితో తూర్పున ఉదయిస్తూ మనకు దర్శనమిస్తున్న ఆ సూర్యుడే బ్రహ్మ.

సూర్యకిరణాలు పడనిచోటులేదు. భూమిపైనేకాదు. భూమి లోపలి పొరల్లోక్కూడా చొచ్చుకుపోయి ఆ కిరణ ప్రభావం అమోఘంగా సర్వత్రా వ్యాపించిపోయి ఉంది. సంపూర్ణ సృష్టిలో ఆవరించి పోయి ఉన్న ఆ శక్తివల్లే గ్రహాలు తిరుగుతున్నాయి. నమస్తమూ పోషింపబడుతోంది. ఆహారాన్ని మనకందించే ఆ వైష్ణవీ శక్తి మధ్యాహ్న సూర్యుడిగా ఆకాశాన దర్శనమిస్తాడు. ఆయనే విష్ణువు.

లయకారకుడైన శివుడు కూడా సూర్యుడే. రెండు మూడు రోజులు ఏ మబ్బుపట్టో సూర్యుడు కనిపించకపోతే దాని ప్రభావం బాగా అర్థమవుతుంది. రకరకాల రోగాలకు, సమస్యలకు సూర్యకిరణ లోపమే కారణమని తెలుకోగలుగుతాం. సర్వ మంగళకరుడు కూడా శివుడే. ఆయనలా మేలుచేయగలిగిన దైవము లేదు. అంతటి శివస్వరూపుడుగా ఆ సూర్యుడు అస్తమయ సమయాన పశ్చిమాన దర్శనమిస్తాడు.

**అంతటి శక్తిగల సూర్యుడు సకల దేవతా స్వరూపమే కాదు సమస్త దేవతలకు శక్తినిచ్చే యింధనం వంటివాడు. అంతటి బ్రహ్మా విష్ణు మహేశ్వర స్వరూపుడైన సూర్యుడిక్కూడా శక్తినిచ్చేటువంటిది ఓంకారము. సకల దేవతలకే కాకుండా సకల సమర్థ సద్గురువు లందరికీ కూడా శక్తిఇచ్చేది 'ఓం' కారము అదే గాయత్రి.**

అంతటి గాయత్రీ దేవిని మనం సంధ్యా సమయంలో ధ్యానించాలి ! సంధ్యా వందనంతో ఆ గాయత్రిని ఉపాసన చేయాలి. సూర్యుడి వెనుక ఉండి నడిపిస్తున్నటువంటి శక్తి సవితా శక్తి. **ఆధ్యాత్మికతకు ఆధారభూతమైన సంధ్యావందనాన్ని వదిలి నీవు చేయగలిగిందేమీ లేదు.** హంసవాహిని గాయత్రి. శ్వాసల రూపంలో మన శరీరంలో ప్రతిసారీ జొరబడుతోన్న శ్వాసను గమనించ గలిగితే ప్రాథమిక స్థాయి నందుకోగలుగుతాం. **'శ్వాసను సంధ్యాకాలంలోనే సరిగ్గా గమనించగలుగుతాం. మిగతా సమయంలో దాన్నర్థం చేసుకోవడం అసంభవం'** అని చెప్తున్నారు. ప్రకృతిలో జీవించడాని కాధారమైన ఈ



శ్వాసను సంధికాలాల్లో ప్రయత్న పూర్వకంగా గమనించడం తెలుసుకొని ఆ తరువాత మిగతా సమయాల్లో ఎప్పుడైనా అభ్యాసం చేయవచ్చు.

మన ప్రాచీన ఋషులు గానీ, పూర్వీకులుగానీ సంధ్యా వందనాన్ని ఒక్కరోజైనా విడువలేదు. రాక్షసులైనా - దేవతలైనా, స్త్రీలైనా పురుషులైనా చక్కటి నియమ బద్ధంగా ఆచరించారీ సంధ్యావందనాన్ని. అతి మామూలుగా దైనందిన కార్యక్రమాలతోపాటు త్రికాల సంధ్యల్లో క్రమం తప్పకుండా ఆచరిస్తుండేవారు. రామాయణంలో ఈ విషయాన్ని చాలాస్పష్టంగా చదువుతాం. సీతకోసం వెతుకుతూ తిరుగుతున్న హనుమంతుడు విసిగి వేసారిపోయి, వెతికిన చోట్లే వెతుకుతూ, చివరికి బాగా ఆలోచించుకొని ఓ సరస్సు దగ్గరకొస్తాడు. 'ఎంత చెరసాలలో ఉన్నా సంధ్యావందనం చేసుకోడానికి నీళ్ళదగ్గరికి రాకపోదుగదా ! ఆమెను అప్పుడు గుర్తించవచ్చు' అని ఆ నీటికొలను దగ్గర వేచిఉంటా డాయన. దీన్నిబట్టి సంధ్యావందనానికి వారెంత ప్రాధాన్యత నిచ్చేవారో తెలుస్తోంది. చెరసాలలో ఉన్న ఓ స్త్రీకి రాక్షసులు సైతం సంధ్యావందనా నికి అనుమతినిచ్చారంటే దానిపట్ల వారికెంత అవగాహనున్నదో గ్రహించవచ్చు.

రావణాసురుడు వాల్మీకి మహర్షి అంతటివాడి చేతనే పొగిడించు కున్నాడు. 'అతన్ని మించిన తపస్వి, వేద వేదాంగ పారంగతుడు మరి పుట్ట బోడు. యింతటి గొప్పవాడు గతంలో లేడు. యితనికితనే సాటి' అని అనిపించుకున్న ఘనుడు రావణాసురుడు. యజ్ఞయాగాదుల మీద బ్రహ్మాండమైన పట్టుందతనికి. కానీ అతడు రాక్షసుడే. అలాంటి రావణుడు క్రమం తప్పకుండా సంధ్యావందనం చేసేవాడు. అలా సమయానికి అతడు సంధ్యావందనం చేయటం వల్లనే కదా శివలింగం లంకకు చేరలేదు. అలా చేరిఉంటే మన మీ పాటికి పూజామందిరంలో అతని పోటోలు పెట్టుకొని పూజలవీ చేస్తూండాల్సొచ్చేది. ప్రపంచం మొత్తం నాశనమైపోయుండేది. అతనికున్న ఆ మంచి అలవాటు వల్ల మనమంతా రక్షించబడగలిగాం.

శ్రీకృష్ణ పరమాత్మ కూడా సంధ్యావందనాన్ని విధిగా ఆచరించే వాడు. ఆఖరికి ఆ జగద్గురువు నిర్యాణాన్ని పొందబోయే చివరిరోజు వరకు సంధ్యావందనాన్ని మానలేదు. సూర్యుడి యొక్క నాలుగు ఉపాసనలని అవగాహన చేసుకోవాలి. ఉదయాన సూర్యుని యొక్క చేతనత్వం వేరు మధ్యాహ్న సూర్యుని యొక్క చేతనత్వం వేరు-సాయంత్రం సూర్యునియొక్క చేతనత్వం వేరు. అలాగే అర్థరాత్రి సూర్యునియొక్క చేతనత్వం వేరు మెలకువగా ఉన్నప్పటి మనస్థితి-కలలుగంటున్నప్పటి మన స్థితి (స్వప్నస్థితి) -గాఢనిద్రలో ఉన్నప్పటి మన స్థితి. ఈ మూడు స్థితుల్నే జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలుగా, మూడులోకాలుగా చెప్తారు. వీటిమధ్య ఒకదానికొకటి సంబంధం ఉండదు. కలల ప్రపంచంలో ఉన్నప్పుడు భౌతిక జగత్తులో ఏం జరుగుతోందో నీకు తెలియదు. మేలుకున్న నీవు కలలో ఉండలేవు. గాఢనిద్రలో ఆ రెండూ ఉండవు.

కానీ వీటన్నిటికీ పైనున్న నాలుగోస్థితిలోకి మనం ప్రవేశించగలిగితే ఆ తురీయస్థితిలో క్రింది మూడులోకాలు అంటే మూడు జగత్తులు - ఆ మూడు స్థితులు మనకు చాలా స్పష్టంగా అర్థమవుతాయి. అన్నిటికీ ఒకదానికొకటి సంబంధం కలిగి ఉండడాన్ని అనుభూతి చెందుతాం. అఖండత్వాన్ని చవి చూసాము.

కాబట్టి నాలుగు సంధ్యావందనాలు అవసరమే. అయితే ఈ నాలుగో సంధ్యావందనం అనగా అర్థరాత్రి 12 గంటల సమయంలో చేయవలసిన తురీయస్థితి సంధ్యావందనం చేసే శక్తి మనకు లేదు. నిద్దరపోతూ చేయగలగాలది. మేలుకొని చేస్తే అది తురీయ సంధ్యావందనం అవదు. జాగ్రదావస్థ సంధ్యావందనం అవుతుంది.

కాలానికి-రాశులకూ ఉన్న సంబంధం తెలియాలి ! తిథి వార నక్షత్ర యోగ కరణాల గురించి చెప్పే పంచాంగాన్ని ఉపయోగించు కోవడం తెలియాలి -అనాహత చక్రం జాగృతమవుతే యీ విషయాలు



వంట బడతాయి. యీ కాలాన్ని వినియోగించడం నేర్పే విద్యనే సంధ్యా వందనం అంటారు. కాలము - చక్రము = కాలచక్రము కాలాన్ని చక్కగా ఉపయోగించుకొంటూ దానికి అతీతంగా వెళ్ళాలి. కాలాతీత స్థితికి చేరుకోవాలి. సంధ్యావందనం మనల్ని ఆ స్థితికి చేరుస్తుంది.

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవాన్ అహమవ్యయం
(భ ॥ గీ ॥అ 4 -1 శ్లో)

'మొట్టమొదటి యీ విద్యను నేను సూర్యుడికి చెప్పాను. సూర్యుడు తప్ప మీకింకో దైవంలేదు. ఇంకో శక్తి లేదు మానవుడైన వాడు ఆయన్ని శరణువేడాల్సిందే. మరి వేరు దారిలేదు. అది తప్ప మీరింకే సాధనలు చేసినా అది దోషమే అవుతుంద'ని శ్రీకృష్ణుడు స్పష్టంగా భగవద్గీతలో చెప్పాడు.

ఆ సూర్యుడికి, శ్రీకృష్ణుడికి భేదం లేదని గుర్తించగలిగినప్పుడు, ఆ సూర్యుడికి, అగ్నికి తేడాలేదని గ్రహించినపుడు, ఆ దత్తాత్రేముడికి, జగద్గురువుకి అ భేదమని తెలుసుకోగలిగినపుడు, ఆ దత్తాత్రేయుడే శ్రీవేంకటేశుడని అర్థమౌతుంది. తిరుమలలో వేంచేసి ఉన్నాడని ఆనందం కలుగుతుంది. శ్రీ వేంకటేశ్వర మహత్యం వంటి గ్రంథాలు కాస్త జాగ్రత్తగా చదవగలిగితే ఆ తిరుమలేశుడే దత్తాత్రేయుడు అని స్పష్టమవుతుంది.

40 రోజుల్లో ఉత్తరదేశయాత్ర, 11 రోజుల్లో 108 తీర్థాల యాత్ర అంటూ గబగబా రానుపోను బండి మాట్లాడుకొని 'బ్రహ్మవిద్య టూకీగా ఎవరైనా అనుగ్రహించేస్తారేమో స్వీకరించేసేద్దాం' అనుకుంటూ తీర్థయాత్రలు చేసే మహాభక్తులు లేకపోలేదు. అలాంటి ఓ మహా భక్తుడు ఏ జన్మలో చేసుకున్న పుణ్యంవల్లనో మాష్టారికి స్నేహితుడు కాగల్గాడు యీ జన్మలో.

ఓసారతను యిలాంటి తీర్థయాత్రే బస్సులో 40 రోజులు గిరగిరా తిరిగొచ్చాడు. వచ్చాక మాష్టార్ని కలిసి రామకృష్ణా బదరీనాథ్

వెళ్ళొచ్చాను. కేదారనాథ్ వెళ్ళొచ్చానం'టూ పుణ్యక్షేత్రాల పేర్లు ఓ ఐదారు వరుసగా గబగబా చెప్పాడు. చెప్తున్నంతసేపు చక్కగా వింటున్న మాష్టారు 'అదృష్టవంతుడివయ్యా ! మంచి మంచి తీర్థాల్ని దర్శించుకొని వచ్చావు. సరే ! వీటిన్నిటిలో నీకు బాగానచ్చింది. నీకు చాలా తృప్తిని, హాయినీ యిచ్చిన క్షేత్రాన్ని గురించి చక్కగా నాలుగు మాటల్లో చెప్పవయ్యా !' అనడిగారు. 'అబ్బా రామకృష్ణా బదరీనాథ్‌లో గాంధీ బజార్ అనే ఒక మార్కెట్టుంది. అక్కడ హోటల్‌లో మన ఆంధ్ర ఇడ్లీ సాంబార్ ఎంత అద్భుతంగా ఉంటుందో మాటలతో చెప్పలేం అన్నార్ట చాలా సీరియస్‌గా.

అలాంటివి మనం ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా ఫలితం శూన్యమే అని గ్రహించాలి ! 'తీర్థీ కుర్వంతి తీర్థాని.' గురువున్న స్థలమో ఓ పెద్ద తీర్థక్షేత్రం, గురువుల సమాధి ఉన్న ప్రదేశం కల్పవృక్షం లాంటిది. మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రస్వామి వారి సమాధి. బృందావన క్షేత్రమది. షిర్డిలో సాయి సమాధి. పరమ పుణ్య క్షేత్రమది. గొలగమూడి వెంకయ్య స్వామివారి సమాధి ఏ గురువైనా గొప్పవాడే. వారి సమాధులెక్కడెక్కడున్నాయో అవి మహాపుణ్యక్షేత్రాలు. దర్గాలన్నా , సమాధులన్నా ఒక్కటే. గుంటూరులో మస్తాన్ దర్గా అద్భుతమైన క్షేత్రం. గురువుల సమాధి దర్శనమే మహత్వపూర్ణమైన ఫలితాల నందిస్తాయి. గురువులెక్కడెక్కడైతే సమాధి చెందారో అలాంటి దివ్యక్షేత్రాలకు వెళ్ళి మూడురాత్రులు గడప గలిగితే కొత్త జన్మ వస్తుందనీ తెలియజేశారు. అలాంటి ద్విజత్వాన్నందించే గురువుల సమాధి దగ్గర చక్కటి దీక్షతో ద్రవాహారం మాత్రమే తీసుకుంటూ ఉపవాస దీక్ష చేయగలిగితే అదే నిజమైన ఉపవాస దీక్ష. మూడు రాత్రులు సమాధి చెంత కాలక్షేపం చేస్తూ గురుచరిత్ర పారాయణ చేసినవారి జీవితాలు ఏకంగా నందన వనంగా మారగలవనీ, అమోఘప్రద ఫలితాలు చవిచూడగలరనీ ఈ సందర్భంగా తెలియజేయబడుతోంది. మన శ్రద్ధ, పట్టుదలను బట్టి గురువుల సమాధులు పలకడం మొదలుపెడతాయి. నచికేతుని కథ దీన్నే తెలియజేస్తుంది. కఠోపనిషత్తులో ఈ విషయాలే ఉన్నాయి.



మన తీర్థయాత్రలు, పుణ్యక్రతువులు ఎలా ఉన్నాయంటే దానిలోని పరమార్థాన్ని మర్చిపోయాం మనం. ఋషులు యివన్నీ మన కెందుకేర్పాటుచేశారో ఆ అవగాహన పూర్తిగా పోయింది, మనలో ఎంతోమంది ఏటా కనీసం ఒక్కసారైనా తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్ళి వస్తుంటాం. యాంత్రికంగా యిక్కడ సెలవుపెట్టడం దగ్గరనుంచి-టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకోవటం దగ్గర్నించీ తిరిగి దర్శనానంతరం యిల్లు చేరేవరకు మర మనుషుల్లా ప్రవర్తిస్తాము. వెళ్ళాలి కాబట్టి వెళ్ళడం-చూడాలి కాబట్టి చూడటం -వెంట్రుకలివ్వాలి కాబట్టి యివ్వడం - హుండీలో వేయాలి కాబట్టీ వేయడం అన్నట్టు చేస్తున్నాంగానీ 'ఎందుకు చేస్తున్నాం ? దానిలోని ఆంతర్యం ఏంటి ? తిరుమలలో ఉన్న వెంకటేశ్వరుని మహత్యాలనేలా అర్థము చేసుకోవాలి ? ఆయన దివ్యానుగ్రహము పొందేదెలా ?' వంటి ఆలోచనలు మన మనసుల్లో పుట్టటం లేదు సరికదా ఆ తిరుమలేశుని దివ్యమంగళ విగ్రహాన్ని కనులారా చూడలేకపోతున్నాం. ఇదీ మన దౌర్భాగ్యం. మనకి చూడాలనున్నా అక్కడున్న రక్షకభటులు మన మనసులోని ఆలోచనల్ని చటుక్కున పసిగట్టి, అమాంతం మన ఆలోచనల్ని భక్షించి, బలవంతాన బైటికి లాగి పారేస్తారు. వారి నెదిరించడం వెంకటేశుడి వల్లేగాదు. మనమేం చేస్తాంకానీ విషయమేంటంటే ఆ శ్రీ వేంకటేశ్వరుని ముఖంమీద పెద్దగాటు ఒకటి ఉంటుంది. బైటవైపున కాస్త తలపైకెత్తి చూస్తే పెదపార ఒకటి వ్రేలాడ దీయబడి ఉంటుంది. పరుగు పరుగున దర్శనార్థం వచ్చినవాళ్ళు అదే మాదిరి పరుగెత్తుకుంటూ వెళ్ళిపోవల్సినవాళ్ళకు తలపైకెత్తే తీరిక ఎక్కడుంటుంది ? గర్భగుడిలో దివ్యమంగళ విగ్రహాన్ని తేరిపార చూసే టైమెక్కడుంటుంది ?

సుమారు 150 సంవత్సరాలక్రితం తిరుమలలో జరిగిన యదార్థ సంఘటన. స్వామిభక్తుడు ఉండేవాడు. ఆయనకు ప్రతిరోజూ స్వామికి పూలమాలతో అలంకరణ చేస్తే బాగుండనిపించి పూలతోటను

పెంచాడు. తోటకు నీరు కావలిసి ఓ బావి తవ్వుదామనుకున్నాడు. మంచి ముహూర్తాన బావి తవ్వడం మొదలెట్టాడు. అతని భార్య గర్భవతి. వెంకటేశ్వరస్వామివారి పూజకు పూలకోసం పెంచినతోట. ఆ తోటకు నీరందించే బావి. ఆ బావి తవ్వేందుకు పడుతోన్న శ్రమ. చూస్తున్న భార్య 'నేనూ సాయం చేస్తానంది.' నీవు నిండు గర్భిణివి కదా ? 'వద్దులే నేనే చేస్తాను చేయగలిగినంత'. అన్నాడు. అందుకామె ఊరుకోలేదు. అప్పుడతను 'సరే యిది దైవకార్యం కదా చేస్తే చెయ్యిలే' అంటూ ఓ షరతుపెట్టాడు. 'నీవెంత వరకు చేయగలవో చేయి. అంతవరకు ఎవరి సహాయము అర్థించద్దు !' అన్నాడు.

ఈనాడు దైవకార్యాలు ఎంతబాగా చేస్తున్నామో మీకూ తెలిసే ఉంటుంది. మొదలెట్టటమే చందాల పుస్తకం అచ్చు వేయించేసి, కోశాధ్యక్షుడు అనే సంతకం పెట్టుకొని, ముష్టెత్తుకోడానికి బయలుదేరినట్టు తలా ఓదిక్కుకు పరుగెత్తుతుంటారు. భక్తి అంటే ఏంటో తెలియని జంతుమానవులకు దైవకార్యం, విశ్వకల్యాణం వంటివి వివరిస్తూ, చందాలంటూ ఎక్కేగడప దిగేగడప. యిదంతా భక్తి అనుకుంటూ పక్కవాళ్ళుకూడా అనుకునేలా చేస్తూ, చేయబడుతోన్న ఎంత పెద్ద దైవకార్యమైనా వాటిని దేవతలు మెచ్చరు. ఇది చాలా స్పష్టంగా చెబుతున్నారు. చక్కగా అవగాహన చేసుకొని మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

మన కథలో స్వామివారి భక్తుడు ఈ హెచ్చరికే చేశాడు భార్యతో. 'నువ్వుచేస్తే చెయ్యిగానీ ఓపికున్నంతవరకు ఎవర్నీ అర్థించకు' అన్నాడు. భర్త మట్టి తవ్వి అందిస్తున్నాడు. భార్య బైటపారబోసి వస్తోంది. ఎండమండిపోతోంది అందులో తిరుమలకొండ. పైగా ఎండాకాలం. అంతకుమించి ఆవిడ గర్భవతి కూడా. త్వరత్వరగా మట్టి పారబోసి రావడం అతని కనుమానం కలిగించింది. 'అంత తొందర తొందరగా ఎలా చేయగలుగుతున్నా వన'డిగాడు. 'ఎవరో చిన్నపిల్లాడు గొల్లవాడట. నల్లనివాడు వచ్చి 'నువ్వు మోయలేకున్నావు నేసాయం



చేస్తాన'న్నాడు. సరేనన్నాను.' అనిచెప్పింది. 'నేనేం చెప్పాను ? యితరుల సాయం అడగొద్దన్నానుగదా !' అన్నాడు భర్త. 'నేనేం అడగలేదు ఆ పిల్లాడే వద్దన్న కొద్దీ చేస్తున్నాడు' అని చెప్పింది. 'సరే ఈసారి నుంచి వాడి సాయం తీసుకోవద్దు' అంటూ మట్టితట్టకెత్తిచ్చి పంపాడు.

ఆవిడకి ఆ పిల్లాడు మళ్ళీ ఎదురొచ్చాడు. 'నీ సాయం వద్దుతే ఆయనికి కోపమొస్తుంద'ని చెప్పింది. వినిపించుకోలేదా పిల్లాడు. తట్టచేతిలోంచి లాక్కోబోయాడు. యింతలో ఆ పిల్లాడికి ఎక్కడి నుంచో ఓ పారవచ్చి టపీమని మొహానికి తగిలింది. బడబడా రక్తం కారసాగింది. పిల్లాడు గాయానికి చేతినడ్డం పెట్టుకొని వెనుదిరిగి పరుగెట్టాడు. గర్భగుడిలోకి ప్రవేశించి మాయమైపోయాడు. పిల్లాడిమీదకి పారవిసిరిన భర్తకి అయినా కోపం చల్లారక అక్కడేపడ్డ పారను పుచ్చుకొని కుర్రాడి వెంటపడ్డాడు. గర్భగుడిలోకి తనూ వెళ్ళి వెదికాడు. ఎవ్వరూ కనిపించలేదు. కానీ ఆ వెంకట రమణమూర్తి నుదుటి మీద గాయం కనబడింది. పశ్చాత్తాపపడ్డాడు ఆ భక్తుడు. ఏడిచాడు. తప్పు గ్రహించాడు.

'తిరుమలలోని ఆ వెంకటేశ్వరుడే ఆ దత్తాత్రేయుడు' అన్న సత్యము మనకు వేంకటేశ్వర స్వామి వారి దివ్య చరిత్ర కాస్త జాగ్రత్తగా అధ్యయనం చేస్తే తెలుస్తుంది 'వేంకటేశ్వర వైభవం' అనే శ్రీ వేద వ్యాసుగారి గ్రంథాన్ని పారాయణ చేస్తే మనకు స్పష్టంగా అవగతమవ గలదు.

ప్రధానంగా మనకో మహాసత్యము స్పష్టంగా తెలియాలి. ఈ భూమ్మీదున్న సమస్త పదార్థాలు, యింత కంటె కోటాను కోట్ల రెట్లు మన మధ్యనున్న శూన్యంలో సూక్ష్మ రూపంలో తేలియాడు తుంటాయి. ఉదాహరణకీ భూమ్మీదున్న నీటి కంటే కోటానుకోట్ల రెట్లు సూక్ష్మరూపంలో ఈ శూన్యాకాశంలో ప్రవహిస్తోంది. అలా 'ప్రతి వస్తువూ, ప్రతి పదార్థమూ మనకందుబాటులో ఉండగా కరువేల వచ్చెరా ?'

అంటూ వేమన కూడా వేదన చెందాడు. యిప్పుడు చెప్పబోయే ఈ మహాశూన్య స్వరూపుని దర్శించేందుకు దివ్య చక్షువువంటి మహావాక్యాలని పరిశీలిద్దాం.

### ఋచో అక్షరే పరమేవ్యోమన్

మన చుట్టూ అనంతంగా వ్యాపించి వున్నది ఈ పరమ శూన్యము. మహాశూన్యము. అందు సమస్త వనరులు, అనంత సంపదలు పుష్కలంగా ప్రవహిస్తున్నాయి. యింతకు ముందు చెప్పినట్లు ఈ పుస్తకాన్ని పట్టుకున్న చేతివ్రేళ్ళ మధ్య వున్న ఖాళీజాగాలో సైతం శూన్య ప్రదేశముంది. అదంతా ఆకాశమే. ఖాళీచోటు. అలా అనంతంగా వ్యాపించి పోయివుందది. మన నాసికారంధ్రాల్లోని ఖాళీ, చెవుల రంధ్రాల్లోని ఖాళీ, అలా వ్రేళ్ళమధ్య ఖాళీ అలా అనంతంగా ఎంత వరకు వ్యాపించి పోయివుందో మన ఊహలకందదది.

ఆ పరమేవ్యోమన్ మనందరి చుట్టూ చుట్టి అనంతంగా అఖండంగా సాగిపోతూ మన మనసు, దృష్టి పోలేని అనేక చోట్ల అలా విస్తరించి పోయి అల్లంత ఎత్తున గ్రహ గోళ నక్షత్ర మండలాల కావలిదాకా సాగి, వ్యాపించి వున్నద'ని చెబుతూ పూజ్యగురుదేవులు యిలా చెప్పారు.

"నీవెంతటి శక్తి గలవాడివంటే నీవు యదాలాపంగా కదిలించిన నీ చిటికినవేలి కదలిక యొక్క ప్రభావం మొత్తం యావత్ సృష్టి మీదే చూపెడుతుంది. నీ దృష్టిలో అది యాదృచ్ఛికము కావచ్చు. కానీ దాని ప్రభావం అనంతం. యిదే అనంతాకాశం మీలోనూ ఉన్నది. ఆ ఖాళీ చోటు మీనోట్లో, పొట్టలో ఊపిరితిత్తులలో యిలా శరీరమంతా పుష్కలంగా వ్యాపించివుందీ అఖండాకాశం. సైంటిస్టులు చెప్తోందేంటంటే మానవ శరీరములో ఉన్న ఖాళీ జాగా తీసేసి మొత్తం శరీరాన్ని ఓ ఉండలా చేసేస్తే-పిసికి ముద్ద చేస్తే అది ఎంత చిన్న ముద్దవుతుందంటే అగ్గిపుల్లమీద మందంతుంటుంది అన్నారు.



అధునిక సైంటిస్టులు తన ప్రయోగాల్లో కనుగొని వెల్లడించిన సత్యమిది. పిల్లలు ఆడుకునే బూరలు గాలి ఊది ఎలాగైతే పెద్దవిగా చేస్తుంటారో అదే మాదిరిగా మన శరీరంలో దాదాపు మొత్తం ఎక్కువ భాగం ఆ ఖాళీ జాగాయే. ఐదున్నరో ఆరడుగులో ఉందనుకుంటున్న ఈ శరీరము గాలి ఊదిన బెలూన్లా శూన్య ప్రదేశంతో ఉంది. ఖాళీ జాగాగా ఉంది. మరి మాంసము ఎముకలు వంటి వున్నాయి. గదా అనే సందేహం వస్తుంది.

మనకి కనిపిస్తున్న సమస్త వస్తువులు, అన్ని పదార్థాలు అణువులతో ఏర్పడ్డవే గదా ! అసలా మాటకొస్తే ఈ సృష్టంతా పరమాణువుల సముదాయమే. కొన్ని పరమాణువులు కలిసి అణువు. కొన్ని అణువులు కలిసి ఓ పదార్థము కదా ! అయితే యిక్కడ శాస్త్రజ్ఞులు చెప్తోందేమంటే కొన్ని పరమాణువుల ముద్దలు కలిసి పదార్థమౌ తున్నాయి కదా ! ఆ పరమాణువుల్లోంచి ఒకదాన్ని పరిశీలిస్తే అందులో యింకా సూక్ష్మాతి సూక్ష్మమైన భాగాలున్నాయి. ఎలక్ట్రానులనీ, న్యూట్రానులనీ, ప్రోటానులనీ చెప్తారు వాటిని. అవెంత సూక్ష్మమైనవంటే యంత్ర సహాయంతోకూడా చూడలేనంత సూక్ష్మంగా ఉంటాయివి. విచిత్రవేమంటే ఈ మూడు పరమాణువులు ఒకదానికొకటి తగలకుండా విశాలంగా అక్కడున్న ఖాళీ ఆకాశంలో అత్యంత వేగంగా తిరుగుతుంటాయి. సుమారు గంటకు రెండులక్షల కిలోమీటర్ల వేగంతో అంటే కాంతి వేగంతో తిరుగుతుంటాయి. అంతవేగంతో తిరుగుతున్నా ఒకదానితో ఒకటి ఏ మాత్రం తగలకుండా ఉంటాయి. ఇది మరీ విచిత్రం.

అసలు రహస్యమేంటంటే ఒక పరమాణువులో ఎక్కువ భాగం ఖాళీ ఆకాశమే. ఖాళీ జాగానే. అలాంటి ఖాళీ జాగాలో విశాలాకాశంలో ఆ పరమాణువు లోపల ఈ ఎలక్ట్రాన్, న్యూట్రాన్, ప్రోటాన్లు తిరుగు తుంటాయి. కాబట్టి మన శరీరం కూడా చెప్పుకునేందుకు రక్త మాంసాలతో, ఎముకలతో నిర్మింపబడిందని చెప్పుకుంటున్నప్పటికీ

పరమాణువుల కలయికతో ఏర్పడ్డదే గదా ! ప్రతి పరమాణువులోనూ దాదాపు ఎంతో భాగం శూన్య ప్రదేశమే గదా ! కాబట్టి మన శరీరంలోనించి అంటే ప్రతి పరమాణువులోంచి ఖాళీజాగాని తీసేసి కనక యింతోటి శరీరాన్ని దగ్గరికి నొక్కేస్తే అగ్గిపుల్లమీదున్న మందంత అవుతుందన్నారు శాస్త్రజ్ఞులు యిటీవల వారి ప్రయోగాల ద్వారా ఋజువు చేస్తూ.

ఉదాహరణకి ఓ విషయాన్ని ప్రస్తావిస్తూ ఆచార్య భరద్వాజగారు దీన్ని చాలా చక్కగా సమర్థించారు. 'ఓ గోడ ఉందనుకోండి. యిటుకలతో కట్టబడింది. యిటుకెలా తయారు చేయబడుతుంది ? అది కూడా అణువులు, పరమాణువుల కలయికే కదా ! పైకి యిటుకలా కనిపిస్తున్నప్పటికీ ఎక్కువభాగం శూన్యమే ఉందందులో, ఆ పరమే వ్యోమన్- ఆ అనంతాకాశము పుష్కలంగా ఉంటుందందులో.

పరమాణువుల దృష్ట్యా చూస్తే గోడగా అనిపిస్తోందిగానీ నిజానికి అక్కడ ఖాళీ ఆకాశమే ఉంది. దట్టంగా, ఘనంగా కనిపిస్తున్న ఆ గోడయొక్క నిజ స్వరూపము ఊహించవచ్చు మనం. దీన్ని బట్టి అఖండమైన ఆకాశం సువిశాలమైన పరమేవ్యోమన్ అనంతంగా అలా వ్యాపించిపోయి ఉంది. యిలా ఆలోచించుకుంటూపోతే ప్రతి పదార్థంలో ఆ మహాశూన్యాన్ని చూడవచ్చు. ప్రతివస్తువులో ఆ పరమే వ్యోమన్ దర్శనమిస్తుంటుంది. అణువుకంటే చిన్నది పరమ అణువు -పరమాణువు. అంటే అణువు కంటే ఎంతో చిన్నది. అలాంటి అణువులు కలిసి ఒక ముద్దగా, ఒక పదార్థంగా కనిపిస్తోంది. ఈ సృష్టిలో ఉన్న ప్రతిదీ అణువుల, పరమాణువుల సముదాయమే కదా ! అలాంటి పరమ చిన్న అణువులోనే (పరమాణువు) ఖాళీ చోటు అంతంత ఎక్కువగా ఉంటే పరమాణువు, అణవులు వీటన్నిటితో కలిసి తయారైన వస్తువు పైకి మనకి వస్తువులా కనబడుతున్నా వాస్తవానికక్కడ ఏమీ లేదు మహాశూన్యం తప్ప. యిది మనకు బాగా అర్థమవ్వాలి.



అందుకే మాతృశ్రీ జిల్లెళ్ళమూడి అమ్మతో ఓ తనయుడు 'అమ్మా మద్రాసు మౌంటు రోడ్డుమీద నీ నామం చేసుకుంటూ నడుచుకుంటూ వెళ్తున్నాననుకో నీకెలా ఉంటుంద'నడిగాడు. 'ఏముంది నాన్నా ! నన్ను తలుచుకుంటూ నా ముందుగా వెళ్తున్నట్టుంటుంది' అని అన్నారు అమ్మ.

రమణమహర్షి దగ్గరకు వేరేదేశంనుంచి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి దర్శనార్థం వచ్చి తిరిగి వెళ్తున్నప్పుడు ఆ భక్తులు రమణమహర్షితో 'మళ్ళీ మిమ్మల్నెప్పుడు చూస్తామో కదా !' అన్నారు. అందుకు మహర్షి 'నేను మిమ్మల్ని రోజూ చూసుకుంటునే ఉన్నాగా' అన్నారు. వారికింకా వివరంగా చెప్పదలచిన శ్రీరమణులు 'మీయింటికి దగ్గరగా వున్న ఓ పార్కుకు మీ యిద్దరు రోజు వస్తుంటారుగా. అక్కడ మిమ్మల్ని రోజూ చూస్తుంటాన'న్నారు.

దివ్యాత్ములకు, మహర్షులకు దృష్టి ప్రభావం అధికం. వారి దృష్టికి అడ్డులేదు. ఈ సత్యాన్ని మనం ప్రతి గురువు చరిత్రలో స్పష్టంగా తెలుసుకుంటాం. మహా శూన్య స్వరూపుడైన ఆ గురువు చూడలేని దేముంది? ఆయన కడ్డు నిలబడ గలిగేదేముంది ?

ఈ పరమ రహస్యాన్నందజేసిన గురుదేవులు రహస్యోపాసన ద్వారా ఆ మహాశూన్య స్వరూపుల్ని ఉపాసనజేసే విధి విధానం తెలియజేస్తున్నారు. ఆ సర్వ సమర్థుడు, మహాశూన్య స్వరూపుడైన వారి సత్తా ఎలాంటిదో కాస్త పరిశీలిద్దాం.

షిర్డి సాయి దగ్గర విశ్వనాధశాస్త్రి ఉరఫ్ ఉపాసనీ బాబా ఉంటుండేవారు. ఆయన్ను ఓ నాలుగేళ్ళ పాటు తన దగ్గరే ఉండమన్నారు బాబా. ఓ మూడున్నర సంవత్సరాల తరువాత బాబా అనుమతితో వెళ్ళిపోయాడాయన. తరువాత ఆయన కూడా ఓ మహాత్ముడిగా మారిపోయాడు. మానవుని సహజ ప్రవృత్తి ప్రకారం సద్గురువు లెక్కడెక్కడున్నారో వెతికి మరీ హింసించి చంపడానికి కొన్ని

వర్గాలవారు నిరంతరాన్వేషణ చేస్తుంటారు. అనాదిగా జరుగుతోంది. అలాంటివారు కొంతమంది ఉపాసనీ బాబాని, ఆయన శిష్యుల్ని హతమార్చేందుకు హఠాత్తుగా ఊడిపడ్డారు.

అంతకు కొద్దిసేపటి క్రితమే సర్వజ్ఞులైన ఉపాసనీ బాబా సత్సంగం నిమిత్తం అక్కడకు చేరిన ఆడా, మగా అందరితో ఏ ఓంకారోపాసనో చేయిస్తున్నట్టున్నారు. ఉన్నట్టుండి చేస్తున్న ఉచ్ఛారణ ఆపమన్నారు. కదలకుండా కూచోమన్నారు. గాజుల చప్పుడు కూడా చేయకండని ఆడవాళ్ళతో చెప్పారు. చాలా నిశ్శబ్దంగా, ఎంతో మౌనంగా కూచున్న ఆ ప్రాంతానికి కత్తులు, కటారులు, గొడ్డళ్ళు, పలుగులలో బిలబిలమని చేరారక్కడికి కొందరు వ్యక్తులు. నాలుగువైపులా తిరిగారు. తిరిగి తిరిగి వెళ్ళిపోయారు. వెళ్తూ వెళ్తూ 'యిక్కడెవరూ లేరే ఏమయ్యారు ?' అనుకుంటూ వెళ్ళిపోయారు.

పతంజలి యోగసూత్రాల్లో యిలాంటి చాలా రహస్యాలు న్నాయి. గాలిలో ఆకాశగమనం చేయగలిగేటట్లు చేసే రహస్యాలెన్నో వున్నాయి. యింతకూ ఉపాసనీ బాబా చేసిన మహత్యమేమంటే ఆయ నెదురుగా కూచున్న యింతమంది వ్యక్తుల్నీ కాసేపు మహా శూన్యంలో కలిపేశారు. ఎవరికీ కనబడకుండా మాయం చేయగలిగారు. (రహస్య వాణి ద్వారా సమర్థ సద్గురు స్పర్శ చదవండి ! మరిన్ని వివరాలు లభిస్తాయి.)

గురుదేవులనుగ్రహిస్తోన్న ఈ వైజ్ఞానికత ఆధ్యాత్మికత మనకు నిత్యజీవితంలో అనేక సమస్యల్ని పరిష్కరిస్తుంది. ఆధ్యాత్మికత అనే పదానికి అనేకమంది రకరకాలైన నిర్వచనాలు, ఎన్నెన్నో వివరణలు యిచ్చారు. ఎవరికి తగ్గట్టు వారు ఎవరిస్థాయికి తగ్గట్టువారు తెలియజేస్తూ వస్తున్నారు. మోక్షము మా లక్ష్యమని, ముక్తి మా లక్ష్యమని, మంత్రసాధన మా లక్ష్యమని, కుండలినీ సాధనే మా లక్ష్యమని రకరకాలైన భావాలతో ఉంటుంటారు. భగవాన్ శ్రీ మూరెళ్ళ శ్రీ రామకృష్ణ గురుదేవులు మనకందిస్తున్న ఈ వైజ్ఞానిక ఆధ్యాత్మికత



మన నిత్యజీవితాల్లో ఎదురయ్యే అనేక సమస్యల్నీ, కష్టాల్నీ, బాధల్నీ సవాల్‌గా ఎదుర్కొనేట్టు చేస్తుంది. తద్వారా అనేక దైవీ సంపదలకు వారసులమయ్యేట్టు చేస్తుంది. మహా శూన్య స్వరూపుడైన ఆ సర్వ సమర్థుడినీ, ఆ సర్వ వ్యాపకుడినీ, ఆ సర్వజ్ఞుణ్ణీ పోలిన వేదవిదులుగా మనల్ని తీర్చిదిద్దుతుంది. అందుకు మనం కాస్త శ్రమ చేయాల్సి వుంటుంది.

ప్రధానంగా బ్రాహ్మీ ముహూర్త సమయంలో నిద్రలేవాలి. పక్క మీదనే లేచి కూచొని గురుప్రార్థన చేసుకోవాలి. 27 సార్లు గాయత్రీమంత్ర జపం చేసుకోవాలి. (మనసులో ఉచ్ఛారణ చేసుకోవచ్చు దోషం లేదు.) ఆపై మూడుసార్లు అనుగ్రహమాలా మంత్రం చేసుకోవాలి. (అనుగ్రహమాలా మంత్రం కొరకు సమర్థ సద్గురు వేద పీఠమునకు వ్రాయండి !) తరువాత పృథ్వీమాతకు మనసారా నమస్కారం చేసికొని ఆ సమయానికి ఏ నాసికారంధ్రం నుంచి శ్వాస నడుస్తోందో అటువైపు పాదము ముందుగా నేలపై మోపి నిటారుగా కూచొని స్థల ప్రదక్షిణలు చేయాలి. (రెండు ని॥లు పడుతుంది.) ఆ తరువాత గురు నామస్మరణ చేస్తూ తూర్పుకు గానీ, ఉత్తరానికిగానీ, ఈశాన్యానికిగానీ నాలుగడుగులు వేసి ఆ తర్వాత మీ దైనందిన కార్యక్రమాలకు వెళ్ళవచ్చు. దీని వల్ల ఆ దినమంతా దిగ్విజయంగా సాగిపోతుంది. ఇదంతా కేవలం 5, 10 ని॥ల్లో చేసేసుకోవచ్చు.

ఆసన, ప్రాణాయామాల్ని విధిగా ఆచరించాలి. (తక్షణం మానవ అయస్కాంతాన్ని తయారు చేసుకోండి ! అనే పుస్తకాన్ని నోటికొచ్చేలా చదవండి) త్రికాల సంధ్యావందనము వీలుకాని పక్షంలో ఉదయము, సాయంత్రము రెండు సార్లు సంధ్యావందనం చేసుకోవాలి. అదీ కుదరకపోతే ఒక్క ఉదయం పూటైనా సరే ప్రాతః కాలమందు సంధ్యావందనం చేసుకోవాలి. సంధ్యావందనం తప్పనిసరిగా ఆచరించాలి. గాయత్రీమంత్రము ఓ గంట సేపుగానీ, పదిమాలలుగానీ (అనగా సహస్ర గాయత్రి) చేయాలి.

భోజన సమయంలో అన్నమయకోశ జాగరణకు సంఖ్యా యంత్రాల్ని వాడుకోవడం మర్చిపోరాదు. రోజూ Neck Exercise ఉదయాన మరవకూడదు. సూర్యోదయ, సూర్యాస్తమయాలందు ఆహుతులు సమర్పించాలి. (శ్వానమహావిజ్ఞాన్‌లో దీని గురించి వివరించబడింది). ఆహుతులనంతరం సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో మహాశూన్యోపాసన మరువకూడదు. **భగవాన్ శ్రీ మూరెళ్ళ శ్రీ శ్రీరామకృష్ణ** గారితో వారి గురుదేవులు పండిత శ్రీ శ్రీరామశర్మఆచార్య "రామకృష్ణా నీవు సాధన రోజుకు 24 గంటలు చేస్తే చాలయ్యా! అన్నారు. వారి గురుదేవులు వారికి చెప్పినదే నూటికి నూరుశాతం మనకీ వర్తిస్తుంది. శివప్రిన్సిపుల్ అనుక్షణం పాటించడం. ప్రతి వస్తువులో, ప్రతి పదార్థములో, ప్రతి శరీరములో, ప్రతి ప్రాణిలో ఆ అఖండమండలా కారుడైన ఆ మహాశూన్యుడిని దర్శించేందుకు ప్రయత్నిస్తుండాలి. ప్రకృతి మనకిస్తున్న ప్రతి సమాధానాన్నీ-సందేశాన్నీ అర్ధము చేసుకొనేందుకు ఆ వైపు దృష్టి సారించి అభ్యాసం చేస్తుండాలి. ప్రతి సమస్యా, ప్రతి కష్టం, ప్రతి బాధా గురువుయొక్క అనుగ్రహమేనని మనస్ఫూర్తిగా అంగీకరించాలి. యిదంతా కలిసి మహాశూన్యోపాసన అవుతుంది. ఈ రహస్యోపాసన మనల్ని త్వరితగతిన అనంత శక్తివంతునిగా తీర్చిదిద్దుతుందనడంలో మనకెలాంటి సందేహమ వసరంలేదు.

ఈ మహాశూన్యము భౌతికంగా మనక్కనిపిస్తోన్న వస్తువుల్లోనే కాదు, పదార్థంలో కూడా కాదు, మనం మాట్లాడుతున్న మాటల మధ్యలో కూడా ఆ ఖాళీ వుంది. యిలా ప్రతి పదానికీ పదానికీ మధ్యనున్న ఖాళీల్లో యింకా అక్షరానికీ అక్షరానికీ మధ్యనున్న ప్రతిఖాళీ జాగాలో ఆ మహాశూన్యము అనంతంగా వ్యాపించి పోయివున్నది. ప్రతిశబ్దానికి చివరన ప్రారంభమై అలా అనంతంగా విస్తరించి పోయివుంది. అందుకే జిల్లెళ్ళమూడి అమ్మ 'మంత్రం నిన్నుద్ధరించద' నేవారు. అలా అనడంలో ఆవిడ ఉద్దేశ్యం ఈ మంత్రాలవీ వదిలేసి



భ్రష్టుపట్టమని కాదు. మంత్ర శబ్దమంటే మన జీవితాల్ని మార్చివేసే శక్తి ఆ శబ్దము తరువాతున్న నిశ్శబ్దంలో వుంది. దాన్ని పట్టుకోండని అమ్మ భావన. పిచ్చిదన్నారు అమ్మని. పిచ్చివాళ్ళం మనం.

**మంత్రబ్రాహ్మణ యోః వేద నామధేయం.**

చిన్న చిన్న ఫార్ములాలతో చాలా చక్కగా తెలియచేస్తారు మన ఋషులు. మంత్రము అంటే శబ్దము - బ్రాహ్మణము అంటే నిశ్శబ్దము.

శబ్దము - నిశ్శబ్దము

శబ్దము - నిశ్శబ్దము

శబ్దము - నిశ్శబ్దము ఇదే వేదము. మంత్ర బ్రాహ్మణ యోః




శబ్దము నిశ్శబ్దంలో కొస్తుంది.



నిశ్శబ్దంలోంచి శబ్దము పుట్టింది.

రెండూకలిసి డమరు అకారాన్ని తెచ్చాయి. ఆ డమరుక శబ్దంలోంచే వ్యాకరణం పుట్టిందని చెప్పారు. మంత్రం శబ్దమైతే - బ్రాహ్మణము నిశ్శబ్దము (శాంతస్థితి) ఆ సంధిలో అనంతశక్తి భాండాగారం ఉన్నది. దాన్ని అందుకోవడమే మన ఏకైక లక్ష్యము.



ఈ భవరోగానికి తరుణోపాయం కావాలి. మనకు విముక్తి దొరకాలి. యీ బంధనాల నుంచి మనకు ముక్తి లభించాలి. అప్పుడే శాంతి. అంతవరకు శాంతి లేదు. దుఃఖమే ఉంటుంది. ఆ ముక్తే మనకి కావలసింది. చాలామంది ఆధ్యాత్మిక వేత్తలు ముక్తి, మోక్షము వంటి మాటల్ని తరచూ వాడేస్తూ ఉంటారు. ముక్తి ఏమిటో తెలీకుండ - ఏది మోక్షమో అవగాహన లేకుండ అది మనకు లభించినా దాన్ని గుర్తించకపోతే ఏమి ప్రయోజనము ? అవి మన అవగాహనాలోపం

వల్ల జరిగే ప్రమాదం. అందువలన ఋషులు మనకు చెప్పినదేమంటే మనసుకు పంచభూతాలతో సంబంధం ఉంటుంది. శరీరంలో లింక్ ఉంటుంది. యీ శబ్ద, స్పర్శ, రూప, రస, గ్రంథాలనే బంధాలతో మనసు యీ ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకొంది. ఆ బంధం తెగిపోతే వాసన తెలీదు, కళ్ళు రూపాల్ని చూడలేవు, నాలుకకు రుచి తెలీదు, శరీరానికి స్పర్శ తెలీదు. చెవులకు శబ్దము వినబడదు. ప్రపంచంతో లింక్ తెగిపోతుంది.

మనసుతో (Link Up) బంధము వుండటంవల్లనే ఈ ప్రపంచము ఏర్పడుతోంది. మనసు లేకపోతే ఇవేవి వుండవు. నీవే వుండవు. అది మనం రోజు ధ్యానంలో ప్రయత్నించాల్సింది. అభ్యాసం చేయాల్సింది. అందుకే పూజ్యగురుదేవులు 'మనస్సును పక్కన పడేయండి ! మీ మనస్సులను ఉపయోగించుకోకండి !' అంటుంటారు. ఈ బాధలు, కష్టాలు, రోగాలు, బాధలు ఇవన్నీ ఈ మనస్సువల్లే పుడుతున్నాయి. దాని వల్లే పెరిగి పెరిగి పోతున్నాయి అన్నది పరమసత్యము.

మంత్రదీక్షనిస్తానంటే మడిగట్టుకొని రానుపోను బండి మాట్లాడుకొని అదేదో పుచ్చేసుకుంటే ఓ పనైపోతుందని పిచ్చి చాదస్తంతో అక్కడెక్కడో పడిగాపులు పడుతుంటాం. ఇది పొరపాటు అభిప్రాయము డమరుకం ఆకారం గానీ ఆ డమరుక శబ్దంగానీ మనకీ మహాశూన్యోపాసనని నేర్పుతుంది. (**తక్షణం మానవ అయస్కాంతాన్ని తయారుచేసుకోండి' లో మరిన్ని వివరాలు లభ్యమవుతాయి**) యిలా మనలోను - మన బయటకూడా అనంతంగా వ్యాపించిపోయివున్న ఈ మహాకాశములోకి మనం జొరబడగలగాలి. మౌనంగా ఉంటే అది సాధ్యమౌతుంది. ఆ మౌనాన్ని కూడా శక్తివంతమైన మౌనంగా మార్చుకోగలగాలి. అంటే ఎలాంటి ఆలోచనలు, మాటలు లేకుండా ప్రశాంతంగా స్థిరంగా ఉండి ఆ మహాశూన్యస్వరూపుడైన మనలోని ఆ గురువు పరిధిలోకి మెల్లిమెల్లిగా జారుకోగలగాలి.



అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా

బయటవైపు కాదు మన ప్రయత్నం లోపల-బయటా సర్వేసర్వత్రా విస్తరించిపోయి ఆ మహాశూన్య స్వరూపుడైన గురువు వ్యాపించి వున్నప్పటికీ, మనం మనలోంచి ఆ మాతృ హృదయుని స్పర్శనందుకోడానికి ప్రారంభ సన్నాహాలు మొదలెడదాం. కళ్ళు మూసుకొని మనలోని ఆ మహాకాశంలో అలాగ తటస్థంగా వుండిపోతాం. మహా మౌనస్థితిలో అలా ఉండిపోయిన మనకు సర్వజ్ఞుడు తన దివ్యవాణిని వినిపిస్తాడు. ఆ అమృత వాణి ద్వారా ఎప్పటికప్పుడు అప్పటికి మనమేం చేయాలో స్పష్టంగా చెప్తుంటాడు. వినేందుకు ప్రయత్నిద్దాం !

## ధ్యాన విధానము

స్థిరాసనంలో, ప్రశాంత చిత్తంతో కూర్చుని కళ్ళుమూసుకోవాలి. మన శరీరంలోని వెన్నుపూస చివరనున్న మూలాధార చక్రము - దానికి గల నాలుగు దళములు స్పష్టంగా భావన చేసుకోవాలి. ఆ భావన ఎంత తీవ్రంగా ఉండాలంటే ప్రతి దళమునకు-దళమునకు మధ్య ఉన్న ఖాళీ జాగా - ఆ దళముల మధ్యన ఉన్న ఆకాశాన్ని - ఖాళీ చోటును స్పష్టంగా భావనలో చూడగలగాలి. అలా ఆ మనలోని మూలాధార చక్రమందలి మహాశూన్యాన్ని దర్శిస్తూ ఒక్కసారి ఓంకారాన్ని ఉచ్చరించాలి. అలా ఉచ్చరించే ముందు శ్వాసలోతుగా తీసుకొని ఆ శ్వాస (ఊపిరి) అయిపోయేవరకు ఓంకారానాదాన్ని స్పష్టంగా ఉచ్చరించాలి. అలా ఉచ్చరిస్తోన్నప్పుడు వెలువడుతోన్న ఓంకార నాదాన్ని మనము వింటూండాలి. ఇది చాలా ముఖ్యము.

యిలా చేశాక తర్వాత ఆ పైన వెన్నుపూసలో జననేంద్రియానికి దగ్గర ఉన్న ఆరు దళముల స్వాధిష్ఠాన చక్రముపై మనస్సునుంచాలి. పైన చెప్పినట్లుగానే యీ స్వాధిష్ఠాన చక్రంపై కూడ ఒక్కసారి ఓంకారాన్ని ఉచ్చరిస్తూ పై విధంగానే చేయాలి.

ఆ తర్వాత నాభి దగ్గర వెన్నుపూసలోని మణిపూరక చక్రముపై కూడా అదేవిధంగా ఓంకార ఉచ్చారణ చేయాలి. యిలా ఆజ్ఞాచక్రం వరకు 6 సార్లు ఓంకారోచ్చారణ పూర్తవుతుంది.

యిక అక్కణ్ణించి తిరిగి విశుద్ధి మీదుగా క్రిందికి సాగిపోవాలి. మూలాధారం వరకు వచ్చాక 11 సార్లు ఓంకారోచ్చారణ పూర్తవుతుంది. తిరిగి 12వ ఓంకారాన్ని స్వాధిష్ఠానం నుంచి మొదలెట్టి ఆజ్ఞవరకు పైకి చేరుతాం ఓంకారోచ్చారణతో. దీనితో 16 సార్లు పూర్తిచేస్తాం. దీనితో యిప్పటికీ మూడుసార్లు కుండలినీ సాధన కూడా పూర్తిచేసుకొన్న వాళ్ళమవుతాం.

ఇక ఇక్కడ నుంచి అతిశక్తివంతమైన సావిత్రీసాధన ప్రారంభమవుతుంది. మనసు - బుద్ధి - చిత్తము - అహంకారము వీటిని 'అంతఃకరణాలు' అంటారు. 16వ ఓంకారోచ్చారణ ఆజ్ఞాచక్రం దగ్గర చేశాక ఆ కనుబొమ్మల మధ్యన ఉన్న ఆజ్ఞాచక్రం నుంచి పైకి దృష్టిని తీసుకెళ్ళాలి. ఒక్క అంగుళంపైన బుద్ధిస్థానముంటుంది. అక్కడ కూడా ఓ సారి యిందాకటిలానే ఓంకారోచ్చారణ చేయాలి.

దానికి ఒక్క అంగుళంపైన చిత్త స్థానముంటుంది. అక్కడ కూడ ఒకసారి ఓంకార ఉచ్చారణ చేయాలి.

దానికిపైన నడినెత్తిన బ్రహ్మరంధ్రం దగ్గర సహస్రార చక్రముంటుంది. అక్కడ కూడ ఒకసారి ఓంకారోచ్చారణ చేయాలి. ఇది అహంకార స్థానము.

యిలా అజ్ఞాచక్రం దగ్గర మనసు యొక్క స్థానములో 16వ ఓంకారము, బుద్ధిస్థానంలో 17వ ఓంకారము, చిత్త స్థానంలో 18వ ఓంకారము. సహస్రారంలోని అహంకారస్థానంలో 19వ ఓంకారము ఉచ్చారణ చేశాక సావిత్రి సాధన కూడా పూర్తవుతుంది.

యిప్పుడు 20వ ఓంకారాన్ని కిందన ఉన్న చిత్తస్థానమందు, 21వ ఓంకారాన్ని బుద్ధి స్థానమందు ఉచ్చరించాలి. దానితో మన చక్రధ్యానము పూర్తవుతుంది. 21 ఓంకారాలూ పూర్తవుతాయి.



యిక్కడ మనం గమనించాల్సిన దేమంటే ఆజ్ఞ నుంచి బయలుదేరిన మనం సహస్రారం చేరాక తిరిగి ఆజ్ఞ వరకు చేరలేదు. బుద్ధిస్థానంలో ఆగిపోయాం. అది గమనించాలి.

'బుద్ధిం యూన ప్రచోదయాత్
'ధియో యోనః ప్రచోదయాత్

మా బుద్ధులను సన్మార్గంవైపుకు ప్రేరేపించుగాక !

యిలా మన ప్రతీ ప్రార్థన బుద్ధిని వికసింపజేసుకొనేందుకే. యిక్కడ యీ ధ్యాన విధానంలో కూడా మనం ఆ ప్రయత్నమే చేస్తున్నాము. బుద్ధిస్థానంలో నిలబడిపోయి అక్కడ ఉన్న మహాశూన్య స్వరూపుడైన సద్గురుని దర్శించేందుకు ప్రయత్నిస్తాము. అలా ఎంత సేపుండగలిగితే అంతసేపు హాయిగా అలా ప్రశాంతంగా ఉండిపోగలగాలి.

యోగస్థః కురు కర్మాణి

ఆ స్థితిలో ఉండిపోయి మన పనులన్నీ చేసుకోగలగాలని, ఆ మౌనంలో-మహాశూన్యంలో నిరంతరం ఉంటూ మన జీవితాల్ని లక్ష్య సిద్ధివైపు ప్రయాణింప జేసుకోవాలని శ్రీ పతంజలి మహర్షి యొక్క కోరిక.

ఓంకారోచ్చారణతో అన్ని శక్తి కేంద్రాలనూ జాగృతం చేసుకుంటూ బుద్ధి స్థానంలోని ఆ పరమేవ్యోమన్‌లో, ఆ మహాశూన్యంలో, శక్తివంతమైన మౌనాన్ని పాటిస్తూ ధ్యానస్థితిలోకి జారిపోగలగాలి. ఆ మహాశూన్యస్థితిలో తేలిపోవాలి. అప్పుడు అక్కడున్న అనంతశక్తుల భాండాగారము మన సొంతమవుతుంది. అహంకార రహితమైన ఆ స్థితిలో సద్గురుని అమృతవాణి వినబడుతుంది. ఆయన అమోఘమైన స్పర్శ అనుభవమవుతుంది. దానికై నిరీక్షిస్తూ ఆ ధ్యాన స్థితిలో అచ్యుతునిగా (చ్యుతిలేనివాడిగా) ఉండిపోగలగాలి.

ఆ ఆనందమయ స్థితిలోకి ప్రవేశించడం ఏమంత కష్టమైనది కాదు గానీ ఆ విశేషస్థితిలో అలా ఉండిపోగలగడం కొంచెం కష్టము. మాటిమాటికీ మనసు మనల్ని కింద పడేస్తుంటుంది (చ్యుతుల్ని చేస్తుంటుంది.) ఐనా మనం మంచి పట్టుదలతో ప్రయత్నిస్తూ ఆ స్థితిలో ఉండిపోగలగడమనే విజయాన్ని సాధించాలి. మనసు మనల్ని తడవ తడవకీ కిందికి లాగి ప్రపంచంలో పడవేయడానికి విఫల ప్రయత్నం చేస్తూంటుంది. విశుద్ధి మొదలు మూలాధారం వరకు ఉన్న 5 చక్రాలు ప్రపంచానికి సంబంధించినవి. ఐనా మనం దాని మాయలో పడిపోగూడదు. తెలివిగా వ్యవహరించాలి. నిరంతర జాగరూకత (awarness) ఉంటే మనల్ని ఆ మనస్సు ఏమీ చేయలేదు. గురుని అనుగ్రహంతోనే మనము ఆ అద్వితీయమైన శక్తినీ పొందగలము.

దీన్ని గురించి గురుదేవులు భగవాన్ శ్రీ మారెళ్ళ ప్రస్తావిస్తూ 'అదేమంత అసంభవమైనకాదు. ప్రతివొక్కరూ ఆ స్థితిలో ప్రవేశించవచ్చు. ఆ మౌన స్థితిలో అలా బ్యాలెన్స్‌డ్‌గా ఉండిపోనూవచ్చు. అయితే అభ్యాసం అవసరము. వైరాగ్యంతో కూడిన అభ్యాసము. మనలో చాలా మంది వైరాగ్యమంటే అన్ని సుఖాలూ వదులుకుని విరాగిలా అయిపోవడమనుకొంటున్నారు. అది కాదు. అలా అన్నీ వదులుకుని చేతగానివాడిలా బతికడాన్ని సాధన అనం. దరిద్రం అంటాం. దారిద్ర్యంతో, పుట్టెడు దుఃఖంతో అలమటించే వాడిలా తయారవడం గాదు వైరాగ్యమంటే. యిక్కడే సరియైన అవగాహన లేక మొత్తం ఆధ్యాత్మికత భ్రష్టుపట్టింది. ఆధ్యాత్మికవేత్త లనబడే కొందరు పప్పులో కాలేసి జీవితాల్నే ఏకంగా హాస్యాస్పదంగా మార్చుకొని, నిర్వీర్యం చేసుకొని, పక్కవారిని కూడా అయోమయంలో పడేశారు. దీనివల్ల ఆధ్యాత్మికత పట్ల అందరికీ చిన్న చూపుకు దారితీసింది.

అంచేత యీ వైరాగ్యము అన్నమాటను ఋషులు ఎలా వాడారో కొంచెం జాగర్తగా అర్థం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సాధనలు అవి చేస్తోన్న ప్రతివారికీ అన్ని సుఖాలూ వుండవచ్చు. ఎవరూ దేనినీ వదులుకోవల్సిన పనేలేదు. కాపోతే *Commonsence* (యింగితజ్ఞానం) తో వ్యవహరిస్తుంటే చాలు.



మరి యీ 'వైరాగ్యము' ఎక్కడ చూపించాలంటే ధ్యానస్థితికై మనం ప్రయత్నం చేస్తుండగా మన మనసు దానికిష్టమైన కోతివేషాలపట్ల, గొంతెమ్మ కోరికల పట్ల వ్యామోహంతో పరుగెడుతూ, మనల్నీ ఆ మురికి వాటికోసం వేషాలు వెయ్యమంటుంటుంది. బ్రతిమాలుతుంటుంది. భ్రమపెడుతుంటుంది. అక్కడ మనం ఆయా విషయాలపట్ల, ఆయా సుఖాలపట్ల, ఆయా వ్యక్తులు, వస్తువులపట్ల వైరాగ్యంతో మెలగాలి. అదీ వైరాగ్యమంటే. ధ్యానస్థితికై మనం ప్రయత్నం చేస్తోన్నంతసేపూ చాలు మన వైరాగ్యభావన. ఆ తర్వాత అక్కర్లేదు అంటూ మనకు చక్కగా స్పష్టంగా వివరించారు గురుదేవులు.

తర్వాత ఈ ధ్యాన విధానాలు - సాధనలు అనే విషయంలో ఎంతో మంది విపరీతంగా కృషిచేస్తున్నారు. ఎంతో తపనతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఋషులంతా చాలా సంతోషపడుతోన్న అంశమది. మన సాధనలను శ్రద్ధగా గమనిస్తున్నారు వారు. ఎటొచ్చీ వారిని తీవ్రమైన కలవరపాటుకు గురిచేస్తోన్న అంశము కూడా యింకొకటుంది. యిది మనమంతా స్పష్టంగా తెలుసుకొని సాటి ధ్యానులకు, ఆధ్యాత్మిక సాధకులకు ఎంత వీలయితే అంత త్వరగా తెలియజేయాలి. అది ఋషి సంతతి ఐన మనకు గల కనీస బాధ్యత అని మర్చిపోకూడదు.

ఋషుల కలవరపాటుకు కారణమేమంటే ప్రతీ ధ్యానము మనకు ఎంతో కొంతశక్తిని అందిస్తుంటుంది. మనం రోజూ క్రమం తప్పకుండా చేసే ప్రయత్నంలో ఆ ధ్యానస్థితి కుదురుతుంది. ప్రతీరోజూ ఏ రోజుకారోజు ఎంతో కొంత శక్తి ప్రోది చేసుకొంటూనే ఉండాలి. అలా మనలో శక్తి నింపబడుతోన్నట్టు తెలుస్తూంటుంది కూడ. నిన్నటికి, యీ రోజుకూ తేడా చాలా స్పష్టంగానే గుర్తించవచ్చు. మరి అత్యంత

శక్తిని అందించే యీ భారతీయ ఆధ్యాత్మిక సాధనలు నీకు తృప్తిని, శాంతిని అందించ గల్గుతున్నాయా ? నిజాయితీగా గుండెలమీద చెయ్యేసుకుని ఆలోచించుకో ! భ్రమల్లో ఉండకు ! దానివల్ల నీవే మోసపోతావు. నీవే నష్టపోతావు !

ఋషులందిస్తోన్న యీ అమృత విద్యను సకాలంలో అందుకోలేకపోయావో తిరిగి 24 కోట్ల సం॥రాలు వెనక్కి విరుచుకు పడిపోగలవు జాగర్త ! ఆ దివ్యాత్మల అనుగ్రహవర్షం వెలిసిపోయాక నీవు చేయగలిగేది - పొందగలిగేదీ ఏమీ వుండదు. కేవలం పశ్చాత్తాపంతో కుమిలిపోవడం తప్ప. ఋషుల ఆహ్వాన మందిరాల ద్వారాలు మూసివేశాక నీవు చేయగలిగేదీ ఏముంటుంది ?" అని ఎంతో ఆందోళనతో తెలియజేస్తున్న పూజ్య గురుదేవులు యింకా యిలా చెప్పారు.

"శబ్దము ఆకాశతత్వానికి తన్మాత్ర. మౌనంగా వుంటూ ఆ నిశ్శబ్ద ఆకాశ స్థితిలో ఉంటూ శబ్దాన్ని వినేందుకు ప్రయత్నించాలి. నీలోంచి వినబడబోయే ఆ శబ్దాన్ని వినేందుకు ప్రయత్నిస్తూండాలి. నీలోని ఆ సమర్థ సద్గురువు యొక్క కంఠస్వరాన్ని - దివ్యామృత వాణినీ వినేందుకు నిరంతరం తపించాలి ! అంతే తప్ప ధ్యానం పేరు చెప్పుకొని అలా జడపదార్థంలాగా కూర్చుండి పోకూడదు. లక్షలకు లక్షల మంది సాధకులు ఎంతో అమాయకత్వంతో పాపం సరియైన అవగాహన లేకపోవడంతో అలా ధ్యానస్థితిలో ఉన్నామనుకొంటూ రాయిలా కూర్చుండిపోతున్నారు. యిది వారికెలా వున్నా కరుణాసాగరులు, మాతృహృదయులు ఐన సకల సమర్థ సద్గురువులకది చాలా కలవరపాటు కలిగిస్తోందని గ్రహించాలి.

'నీవు చేస్తోన్న ధ్యానము లేక పూజ లేక మరోసాధన ఏదైనా సరే నీకీరోజు ఎలాంటి ఫలితాలను యిచ్చిందో గమనించుకో ! మన భారతీయ ఋషులందించిన విద్య ఎంత గొప్పదంటే ఏ రోజు ఫలితాలను ఆ రోజే అందించగలిగేంత శక్తివంతమైనదని మర్చిపో కూడదు.



అలాగే సంధ్యావందనము. సంధ్యావందనాన్ని వదిలేసిన మానవుడు (కుల మత జాతి లింగ వయో బేధము లేదిక్కడ) ఎలాంటి ధ్యానస్థితినీ పొందలేడుగాక పొందలేడు. ఒకవేళ పొందారని ఎవరైనా అనుకొంటున్నట్లయితే అది కేవలం వారి పిచ్చి భ్రమే అవుతుంది. తప్ప వేరొకటి కాదు. అని ఎంతో స్పష్టంగా తెలియజేస్తున్నారు. అనేక మంది సాధకులకు సాధనా పద్ధతులు తెలియజేస్తోన్న వారే యీ సంధ్యావందనాదులు విస్మరించారు. అసలలాంటి వారికి ధ్యానము, ధారణ, సమాధి వంటి అమృతమయ ప్రసంగాలు చేయడం తగదు. ఇది యికపై ప్రకృతి సహించబోదు. యిలా ఆచరణ లేకుండా ఉపదేశాలివ్వడం వల్ల భారతీయ ఆధ్యాత్మికత నవ్వులపాలయ్యింది. పిచ్చిభ్రమలకు దారి తీస్తుంది. ఇది ఎంతో విచారించదగ్గది అని గ్రహించాలి.


ధ్యానంలో ఆ శబ్దాతీత స్థితిలో ఉంటూ నిరంత గురుసాన్నిధ్యంలో, ఆ మాతృహృదయుని స్పర్శను అనుభూతి చెందుతూన్న వాడినెవ్వరూ ఏమీ చెయ్యలేరు. ఏ శక్తి అతన్ని బాధించలేదు. అనంతమైన దేవతాశక్తుల ఖజానా అతని సొంతమై ఉంటుంది. అతని సమక్షంలో అసంభవాలు సంభవాలుగా మారిపోతుంటాయి. అలాంటి వారికి దేవతలు ఊడిగం చేస్తారు. అలాంటి సాధకుల చుట్టూ చేరి గురువులు ఆనంద నాట్యం చేస్తారు.

అలాంటివారిగా తీర్చిదిద్దబడే యీ అమృతవిద్య పట్ల క్రమక్రమంగా అభిరుచి పెంచుకోవాలి ! మన శ్రేయోభిలాషులకు, మన పిల్లలకు, బంధువులకు, ఆత్మీయులకు దీనిని గురించి తెలియచెప్పాలి ! నేడు మనమున్న విశేషకాల యొక్క ప్రభావం గురించి తెలియజేయాలి ! మన జీవిత లక్ష్యమదేనని గుర్తించాలి. సామూహికంగా ఏకమవ్వాలి. సాధనలు పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులలో అందరూ కలిసిపోయి ఎలాంటి బేధ భావాలు లేకుండా ప్రేమతత్వంతో జరుపుకోగలగాలి. అలాంటి మహత్తరమైన

కార్యక్రమాల కోసం కష్టపడాలి. కృషి చేయాలి. పట్టుదల చూపించాలి. సాధించగలగాలి. అదే మన భారతీయత - అదే మన ఆధ్యాత్మికత - అలాంటి.నూతన ప్రపంచాన్ని కోరుకొంటున్న ఋషులు ఏకంగా యీ పృధ్వీగ్రహాన్నే స్వర్గంగా మార్చివేయబోతున్నారు. స్వర్గంలో మనుష్యులుండరు. ఉండబోయేది దేవతలు మాత్రమే. మనల్నందర్నీ దేవతలుగా మార్చి వేయబోయే ప్రయత్నంలో భాగంగా యీ అమరత్వ విద్య అందించబడుతోంది. అందుకొంటోన్న వారు నిజంగా అదృష్టవంతులు. యీ ఋషి ప్రసాదాన్ని అందరికీ అందించడంలో ఉడతల్లా సాయపడేవారిపై ఆ దయామయుల విశేష దృష్టి ఉంటుంది. తరతరాలదాకా అలాంటి వారికి ఆ ప్రేమమయుల ఆశీశ్శులు అందుతూనే ఉంటాయి. యిది సాంతం చదివాక సమర్థ సద్గురు వేదపీఠము తెనాలికి మీ అమూల్యమైన అభిప్రాయాన్ని తెలియజేయండి ! మీకై సమర్థ సద్గురు వేదపీఠము వారేకాక ఎంతో మంది ఋషులు, సద్గురువులు ఎదురుచూస్తూంటారని మరవకండి !

సర్వేజనాః సుఖినోభవంతు : ఓం శాంతిః శాంతిః శాంతిః

జై మహాకాల్ ! జైజై మహాకాల్ !



## సమర్థ సద్గురు వేదపీఠము
## ద్వారా ప్రచురింపబడిన మహా గ్రంథాలు

- అశ్వశ్రీ సూక్త సహిత శ్వాస మహా విజ్ఞాన్
  (ఓ అత్యవసర రహస్యమయ విజ్ఞానము) 24 - 00
- ఓ అత్యవసర రహస్యమయ
  శ్వాస మహా విజ్ఞాన్ (రెండవ భాగము) 33 - 00
- తక్షణం మానవ అయస్కాంతాన్ని తయారుచేసుకోండి !
  (శ్వాస మహా విజ్ఞాన్ మూడవ భాగము) 33 - 00
- గాయత్రీ మహా మంత్రము – మెరుస్తోన్న రహస్య వజ్రాలు
  (శ్వాస మహా విజ్ఞాన్ నాల్గవ భాగము) 24 - 00
- సాయినాథునికి ఆకలిగా ఉందట ! అన్నం పెట్టగలవా ?
  (ఓ అత్యవసర రహస్యమయ సందేశము) 5 - 00
- సమర్థ సద్గురుని రహస్య ఆహ్వాన పత్రిక 5 - 00
- రహస్యవాణి ద్వారా సమర్థ సద్గురు స్పర్శ 42 - 00
- సాయికి నీవు శిష్యుడివా ? భక్తుడివా ?
  (సాహస వంతులకు సమర్థ సద్గురుని రహస్య సందేశము) 24 - 00
- రహస్యకిరణాలు 24 - 00
- పేలబోతోన్న అగ్నిపర్వతం 7 - 00
- అగస్త్యప్రోక్త ఆదిత్యహృదయము 3 - 00
- మహామహిమోపేత మహాస్తోత్రాలు 24 - 00
- మహాశూన్యోపాసన (ఓ మహత్తర రహస్యోపాసన) 33 - 00
- ఋషి ప్రణాళికలో సంధ్యావందనము మరియు
  శ్రీ విద్యా రహస్యనామ లాలిత్యానుగ్రహదీపిక 15 - 00

mission SRK
SS
Phone: 23334474